ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
కడప

కపిల్ చిట్స్‌తో బంధం ఆనందాల అనుబంధం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

: fb.com/vaartha Digital

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

27-11-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 296 పేజీలు: 10+4 వెల: 6.50

# సర్వోన్నతం రాజ్యాంగం


బుధవారం నిర్వహించిన మాక్ అసెంబ్లీలో ప్రతిజ్ఞచేస్తున్న విద్యార్థులున - '2'లో


బుధవారం సంవిధాన్ దివస్ కార్యక్రమంలో రాజ్యాంగంపై ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు. చిత్రంలో స్పీకర్ అయ్యన్న, మంత్రి లోకేష్, సిఎస్ విజయానంద్

### • 106 సార్లు మార్చినా చెక్కు చెదరని రూపం • మాక్ అసెంబ్లీని అద్భుతంగా నిర్వహించిన విద్యార్థులు • అసెంబ్లీ ఆదర్శంగా ఉండాలని కోరుకుంటా • ఎమ్మెల్యేలకు వ్యక్తిగత అజెండా సరికాదు: సిఎం చంద్రబాబు • రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న సిఎం, స్పీకర్, మంత్రులు, అధికారులు

**విజయవాడ, నవంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** సోషల్ మీడియాలో అడ్డుఅదుపూలేకుండా విచ్చలవిడితనం ఎక్కువైందని సిఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజహితం కోసం ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వాళ్లకు వ్యక్తిగత అజెండాలు సరికాదని తెలిపారు. అమరావతిలో విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ వ్యక్తిగత కక్షలకోసం పోరాడాల్సి న అవసరం లేదని స్పష్టం చేశారు. మాక్ అసెంబ్లీలో ప్రతిపక్షం ప్రతిభ ఎంతో బాగుందని అభినందించారు. ప్రతిపక్షంగా గట్టిగా పోరాడి, తమ పాత్రను సమర్థంగా నిర్వర్తించిందని అన్నారు. మారుతున్న కాలానికనుగుణంగా 106 సార్లు రాజ్యంగాన్ని మార్చుకున్నా, దాని స్వరూపం మాత్రం మారలేదని వెల్లడించారు. ఓటు హక్కు మనకు వజ్రాయుధం అని సిఎంఅన్నారు. మన భవిష్యత్‌కు మనం రూప కల్పన చేసుకోవచ్చని సిఎం చంద్రబాబు తెలిపారు. నీటిని ఆయుధంగా ఉపయోగించుకుంటే సంపద సృష్టి సుసాధ్యమని స్పష్టం చేశారు. మారుతున్న ప్రజల ఆహార అలవాట్లకు తగ్గట్టుగా వ్యవసాయంలో మార్పులు రావాలని అన్నారు. నాలెడ్జ్ ఎకనామీలో తెచ్చిన ఒకేఒక్క ఐటీ పాలసీ వల్ల తలసరి ఆదాయం పెరిగిందని గుర్తుచేసారు. వందల దేశాల్లో మన వాళ్లు ఉద్యోగాలు పొందుతున్నారని, విదేశీయుల కంటే తలసరి ఆదాయం అధికంగా పొందుతున్నారని వ్యాఖ్యానించారు. మగవారికంటే ఆడపిల్లలు ఇప్పుడు ఎక్కువ జీతం సంపాదిస్తున్నారన్నారు. ఆడపిల్లల్లో కూడా ధైర్యం ఉండాలని, ఎవరైనా అవహేళన మాట్లాడితే ఎదుర్కోవాలని చెప్పారు. ఆర్టీసీ కండర్లగానూ మహిళలకు అవకాశం కల్పించామని గుర్తు చేశారు. ఆకాశమే హద్దుగా ఆడపిల్లలు ఎదగాలని సిఎం సూచించారు.ప్రజల గుండెల్లో అంబేద్కర్ శాశ్వతంగా ఉండిపోతారని సిఎం చంద్రబాబు అన్నారు. అమరావతిలో విద్యార్థులతో మాక్ అసెంబ్లీ >>2


రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అనువాద ప్రతులను ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము. చిత్రంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాని మోడీ

## ప్రజాస్వామ్య మనుగడకు రాజ్యాంగమే మూలం


### 75వ రాజ్యాంగ దినోత్సవంలో రాష్ట్రపతి ముర్ము

### వికసిత్ భారత్ లక్ష్యం దిశగా ప్రజలు కదలాలి: ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

### తెలుగు సహా 9 భాషల్లో రాజ్యాంగం విడుదల

### పాల్గొన్న ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు, ఖర్గే, రాహుల్ ప్రభృతులు

**న్యూఢిల్లీ, నవంబరు 24:** "రాజ్యాంగంలో సామాజిక న్యాయానికి పెద్దపీట. ప్రజల స్వాభిమానాన్ని కాపాడే ఎన్నో హక్కులను దేశ ప్రజలకు రాజ్యాంగం ఇచ్చింది. రాజ్యాంగం మనకు గొప్ప కర్తవ్య బోధ చేస్తోంది. దేశాన్ని ముందుకు తీసుకెళ్లడంలో రాజ్యాంగమే మార్గదర్శి. శాసనాల్లో ఎన్ని మార్పులు చేసినా రాజ్యాంగానికి లోబడి ఉన్నా భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం రాజ్యాంగం"అని భారత రాష్ట్ర >>2



## నైరుతి బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

### దక్షిణ కోస్తాకు వర్షసూచన

**విజయవాడ, నవంబరు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** నైరుతి బంగాళాఖాతంలో మరో అల్ప పడీనం ఏర్పడింది. శ్రీలంక, హిందూ మహా సముద్రం పరిసర ప్రాంతాలలో ఈ అల్ప పీడనం కేంద్రీకృతమైంది. ఇది ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ గురువారం వాయుగుండంగా బలపడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఆ తర్వాత 48 గంటలల్లో ఇది ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి తీరాల వైపు >>2



## నకిలీ మద్యం కేసు

### జోగి రమేష్, సోదరుని పోలీసు విచారణ

**విజయవాడ, నవంబరు 26,ప్రభాతవార్త ప్రతినిధి:** నకిలీ మద్యం కేసులో మాజీమంత్రి జోగిరమేశ్, అతని సోదరుడు రాముల తొలి రోజు విచారణ ముగిసింది. నకిలీ మద్యం కేసులో జోగి సోదరులను కస్టడీకి ఇచ్చేందుకు విజయవాడ ఎక్సైజ్‌కోర్టు అనుమతినిచ్చింది. నెల్లూరు జైలునుంచి విజయవాడ సిట్ కార్యాలయానికి తీసుకురావడం వల్ల తొలిరోజు విచారణ జాప్యమైందని సంబంధిత అధికారులు తెలిపారు. తొలిరోజు కేవలం ఒక గంట సేపు విచారణ సాగింది. ఈ నెల 29 >>2

## తమిళనాట ఘోర ప్రమాదం ఇద్దరు పలాస వాసులు దుర్మరణం

### శబరిమలనుంచి వస్తుండగా ఘటన




**శ్రీకాకుళం, నవంబరు 26 ప్రభాతవార్త:** తమిళనాడు రాష్ట్రం రామేశ్వరం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పెదంచల, వీర రామ చంద్రపురం గ్రామాలకు చెందిన ఇద్దరు యువకులు మృతి చెందగా నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగాఉంది. అయ్యప్ప మాల ధరించి ఆరు గురు యువకులు శబరిమలై వెళ్లి అక్కడ నుంచి రామేశ్వరం దర్శించుకుని తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. మృతులు ఇల్లాకుల నవీన్ (24), పైడి సాయి >>2

## 'పల్లెపండుగ'తో గ్రామాలకు కొత్త రూపు



### రూ. 6787 కోట్ల వ్యయంతో సమగ్ర అభివృద్ధి

### 8571 కి.మీ కొత్త రహదార్ల నిర్మాణం

### మరో పదిహేనేళ్లు 'కూటమి' ప్రభుత్వానిదే

### శివకోడు 'పల్లెపండుగ-2'లో డిసిఎం పవన్

**రాజోలు, నవంబరు 26 ప్రభాతవార్త:** "రాష్ట్రంలోని గ్రామాల ముఖచిత్రాన్ని సంపూర్ణంగా మార్చివేసే లక్ష్యంతో 'పల్లెపండుగ 2.0'కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం" అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. "ప్రతి పల్లెకు సదుపాయం... ప్రతి కుటుంబానికి సౌభాగ్యం" లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 4 వేల కిలోమీటర్లు రోడ్లు నిర్మించినట్లే, పల్లెపండుగ 2.0లో రెండింతల అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. పల్లె పండగ 2.0 కార్యక్రమం ద్వారా 13,326 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.6,787 కోట్ల వ్యయంతో 53,382 అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ప్రతి గ్రామాన్ని ఒక అభివృద్ధి చిహ్నంగా తీర్చిదిద్దే సంకల్పంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సహకారంతో, సిఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో ముందుకు వెళ్తున్నామనిఅన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం శివకోడులో పల్లెపండుగ 2.0కార్యక్రమాన్ని ప్రారంభించారు. పల్లె పండుగ తొలి దశకు సంబంధించి చేపట్టిన పనులు ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ >>2

## 'కృష్ణా' హక్కులు వదులుకోం

### వాటాల కేటాయింపుపై పునఃసమీక్షకు అంగీకరించం

### రాష్ట్రం తరపున వాదనలు బలంగా వినిపించండి

### జలవనరుల శాఖ అధికారులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం



**విజయవాడ, నవంబరు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా నదీ జలాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉన్న హక్కులను ఎట్టిపరిస్థితుల్లో వదులుకునేది లేదని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దీనిపై బలమైన వాదనలు వినిపించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రానికి చేసిన నీటి కేటాయింపుల్లో ఎలాంటి మార్పులు చేసేందుకు వీలులేదని, చట్టపరంగా ఎపికి దక్కిన వాటాను యధాతథంగా కొనసాగించాల్సిందేనని సిఎం తేల్చి చెప్పారు. బుధవారం సచివాలయంలో జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా జలాల్లో మొత్తం 811 టిఎంసిల వాటా కలిగి ఉండగా... రాష్ట్ర విభజన అనంతరం కృష్ణా నదీ జల వివాదాల ట్రిబ్యునల్1 ఆంధ్రప్రదేశ్‌కు 512 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసిలు చొప్పున జలాలు కేటాయించిందన్నారు. అయితే రాష్ట్ర విభజన నేపథ్యంలో కృష్ణాజలాల కేటాయింపులను పునః సమీక్షించాలనడం సరికాదని సిఎంచెప్పారు. ప్రతీ ఏటా వేలాది టిఎంసిలజలాలు సముద్రంలో కలుస్తున్నందున వరదజలాల వినియోగంలో పొరుగు రాష్ట్రాలతో సామరస్య పూర్వకంగా వ్యవహరించాలని అధికారులకు సిఎం సూచించారు.

**అన్ని జిల్లాలకు నీటి భద్రతే లక్ష్యం**

రాష్ట్రాన్ని కరువు రహితంచేసేలా.. అన్ని జిల్లాలకు నీటి భద్రత కలిగించేలా.. సమర్థ నీటి నిర్వహణ చర్యలు చేపట్టాలని సిఎం అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం రిజర్వాయర్లలో నెలకొన్న నీటి నిల్వల వివరాల గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ యేడాది నవంబరు 25 నాటికి రాష్ట్రంలోని మేజర్, మీడియం, మైనర్ రిజర్వాయర్లలో ప్రస్తుతం 1,095 టీఎంసీల వరకు నీటి నిల్వలు ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లు అన్నీ కలిపి సామర్థంలో 83.43 శాతం మేర నిండాయనితెలిపారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసినా పలు రిజర్వాయర్లు పూర్తి స్థాయిలో నిండక పోవడానికి గల కారణాలపై శాస్త్రీయ అధ్యయనం జరపాలని అధికారులకు సూచించారు. గతఏడాది సగటున 7.45 మీటర్లలోతున భూగర్భ జలాలు ఉండగా...ఈ ఏడాది 6.8 మీట ర్లకు పెరిగాయి. కోస్తాంధ్రలో 6.77 మీటర్ల నుంచి 6.56 మీటర్లకు, రాయలసీమలో 9 మీటర్ల నుంచి 7.34 మీటర్లకు భూగర్భజలమట్టాలు పెరిగినట్టు అధికారులు సిఎంకి తెలిపారు. 8 మీటర్లకన్నా దిగువనఉన్న 5,697 గ్రామాల్లో భూగర్భ >>2

## గత ఐదేళ్ల పాలన మరిచారా?



### అరటి రైతుల పేరుతో మళ్లీ మోసగిస్తున్న జగన్

### ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఇవ్వని వైసిపి: మంత్రి అచ్చెన్నాయుడు


**విజయవాడ, నవంబరు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** కడప జిల్లాలో అరటి రైతుల పేరుతో మళ్లీ అబద్ధాల ప్రచారం ప్రారంభించిన జగన్ తీరు ప్రజలను మోసం చేసే మరో ప్రయత్నమే తప్ప వాస్తవాలతో ఎలాంటి సంబంధంలేదని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఐదేళ్ల పాటు వ్యవసాయ రంగాన్ని అధ్వాన్న స్థితికి నెట్టిన జగన్ ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం కామెడీగా ఉందన్నారు. జగన్ పాలనలోనే రైతులు వీధులపైకి వచ్చారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ అంటే ఏమిటో ఆయన ప్రభుత్వానికి తెలియదు. రైతులను ఆదుకోవాల్సి న ఆర్బీకేలను లంచాల గూళ్లుగా మార్చి అరటి, టమోటా, ఉల్లి వంటి పంటలను నేలమట్టం చేసిన ప్రభుత్వం జగన్‌దే అని మండిపడ్డారు. గత ఐదేళ్ల పాలనలో రైతులు కన్నీళ్లు పెట్టుకుని, ఎంత క్షోభకు గురయ్యారన్న విషయాన్ని గుర్తుచేసుకోవాలని అన్నారు. ఎగుమతుల పేరుతో జగన్ చెబుతున్న సంఖ్యలన్నీ వంద శాతం అబద్ధం. తన హయాంలో 3 లక్షల టన్నులు ఎగుమతి చేశామని చెప్పడం పూర్తిగా కల్పితం. కేంద్రం నుంచి అవార్డులు తీసుకువచ్చామన్న మాటకే ఎలాంటి రికార్డు లేదు. ఇదంతా జగన్ ప్రచార బృందం తయారు చేసిన అబద్ధాల మేళా మాత్రమే అని అన్నారు.

గత ప్రభుత్వ హయాంలో 2020-25 ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ పరిధికి సంబంధించి మొదటి దశలో 10 యూనిట్ల కోసం ప్రభుత్వం రూ.1250.29 కోట్ల పరిపాలనా ఆమోదం కూడా జారీ చేసినట్లు మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. రూ.2,500 కోట్లతో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేశామనేది కూడా పూర్తిగాఅవాస్తవమే. పత్రాల్లో మాత్రమే ప్రాజెక్టులు, నేలపై ఒక్క అడుగు కూడా ముందుకు వేయని ప్రభుత్వం తమ పాలనను గొప్పగా చెప్పుకోవడం హాస్యాస్పదం అని అన్నారు.

కూటమి ప్రభుత్వంపై నిందలు మోపే ముందు, ఆయన తన ఐదు సంవత్సరాల పాలనలో రైతులు అనుభవించిన నష్టాలను ఒకసారి వెనక్కి చూసుకోవాలి. ఈ ఏడాది రాయలసీమలో కడప, నంద్యాల, అనంతపురం జిల్లాలలో మొత్తం 40,000 హెక్టార్లలో అరటి సాగు జరిగింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 20 శాతం ఎక్కువ. రైతులు ప్రభుత్వంపై నమ్మకం పెట్టుకొని సాగు విస్తరించారు. ధరలు తగ్గడానికి కారణాలు అధిక వర్షాల వల్ల నాణ్యత తగ్గడం, ఉత్తరాది రాష్ట్రాలలో సాగు విస్తరణ, రెండో కోతపంట ఎగుమతులకు అనువుగాకపోవడం వంటి సహజ మార్కెట్ పరిస్థితులు. కానీ జగన్ ఇవన్నింటిని దాటికి పూర్తిగా రాజకీయ దాడులు చేయడం రైతులను ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించడమే. ప్రస్తుతం ఉత్తమ నాణ్యత గల అరటికాయకు కిలో రూ.7.50 నుండి రూ.8.00వరకు ధర రావడం, నాణ్యతలేని పంట టన్నుకు రూ.3,000 నుండి రూ.8,000 మధ్య పడటం సహజమే. రెండో కోతలో ఉన్న 17,000 హెక్టార్లలో పంటనాణ్యత సమస్యల వల్ల ఎగుమతులకు అనుకూలంగాలేదు. అయినా కూడా ప్రభుత్వం రైతులకు మంచి ధర కల్పించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తోంది. >>2

## నేలకొరిగిన అరటి రైతుల బతుకులు

### చంద్రబాబు తీరు మారకుంటే రైతులతో కలిసి ఉద్యమం: జగన్



**పులివెందుల నవంబరు 26, ప్రభాత వార్త :** వైఎస్సార్సీ ప్రభుత్వ హయాంలో రైతన్నల జీవనం బంగారు బాటలాగా సాగితే కూటమి ప్రభుత్వ పాలనలో రైతన్నల దుస్థితి అట్టడుగు స్థాయికి చేరుకుంది అని అరటిపంట చెట్టు మీదనే మాగి కుళ్లిపోతూ నెలపాలు అవడంతో రైతన్నల జీవితాలు నేలకొరుగుతు న్నాయనీ ,రైతన్నల ధరీకి కూడా గిట్టుబాటుధర చేరడంలేదు, రెండు సంవత్సరాలు పాలన పూర్తిఅయిన ఇన్పుట్ సబ్సిడీ, ఉచిత బీమాల ఊసే లేదని తీరు మారకపోతే రైతులతో కలిసి ఉద్యమం చేస్తామని మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం రెండవ రోజు పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డితో కలిసి అరటిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను అడిగి పంట నష్టాలను తెలుసుకున్నారు.

అరటి పంటను కొనుగోలు చేసే వ్యాపారులు ముందుకు రావడం లేదు అని అరటి కాయలు కోయడానికి అయ్యే ఖర్చు కూడా రావడం లేదు అని రైతులు మాజీ సీఎంకు వారి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2024లో ఇంటిగ్రేటెడ్ కోల్డ్ స్టోరేజ్ యూనిట్ ఏర్పాటు చేయడం జరిగిందని కరెంట్ బిల్లు ఎక్కువ వస్తుందని వాటిని ఆచరణలోనికి తీసుకురాక పోవడం దారుణమని అన్నారు. 600 మెట్రిక్ టన్ను స్టోరేజ్ చేసుకునే సామర్థం ఉందన్నారు. కేవలం విద్యుత్ ఛార్జీలు కట్టాల్సి వస్తుందని కోల్డ్‌స్టోరేజ్‌ను వినియోగంలోకి తీసుకురాలేద న్నారు. ఎరువులు కూడా బ్లాక్ లో కొనే పరిస్థితి రైతుకు వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వము వచ్చిన 18 నెలల్లో 16 సార్లు విపత్తులు రావడంవలన ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాల్సి ఉన్న ప్రభుత్వం రైతులకు బోడి సున్నా చుట్టింది అన్నారు. ఈ క్రాప్ చేసి వైసీపీ ప్రభుత్వంలో 84 లక్షల మందికి ఉచిత పంట బీమా కట్టడం జరిగిందని, ప్రస్తుతం 18 లక్షల మంది మాత్రమే బీమా కట్టుకోవడం జరిగిందన్నారు. రైతులు వేసిన పంటలకు ఈక్రాప్ చేసే పరిస్థితి కూడా లేదన్నారు. వైసిపి ప్రభుత్వంలో అరటిపంటను అనంతపురం , తాడపత్రి నుంచి ఢిల్లీ, బొంబాయి తదితర రాష్ట్రాలకు నేరుగా రైలు సర్వీసులు ఏర్పాటుచేసి 3 లక్షల టన్నులు ఎగుమతులు చేశామన్నారు. వైఎస్సార్సీలో ప్రభుత్వంలో అరటి పంటకు టన్ను రూ. 30000 ఉండేదని ప్రస్తుతం రూ .2000 కూడా అడిగేవారు లేదన్నారు.

## గ్రూప్-1 మెయిన్స్ అవకతవకలపై విచారణకు స్వతంత్ర కమిటీ: హైకోర్టు ఉత్తర్వులు 2లో



బుధవారం అసెంబ్లీ వద్ద మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులు



మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తున్న సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

# వీళ్లు విద్యార్థులా! ప్రజా ప్రతినిధులా?

## మాక్ అసెంబ్లీలో అద్భుత ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులు

### సిఎంగా మన్యంజిల్లా విద్యార్థి ఎం. లీలాగౌతం, ప్రతిపక్ష నేతగా సౌమ్య

**విజయవాడ,నవంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజాప్రతినిధుల తలపించే విధంగా ఆదర్శనీయరీతిలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శాసనసభా ప్రాంగణంలో విద్యార్థులు మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ కార్యక్రమ నిర్వహణతో రాష్ట్ర అసెంబ్లీ సరికొత్త అధ్యాయనికి తెరలేపింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు లోకేష్, కేశవ్, అనిత, రామానాయుడు, డోలా వీరాంజనేయ స్వామి, సంధ్యారాణి, సవిత తదితరులు హాజరయ్యారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలోని అసెంబ్లీ ప్రాంగణంలో ప్రత్యేకంగా వేసిన సెట్‌లో విద్యార్థుల మాక్ అసెంబ్లీ అసలు శాసనసభ తీరుకు ఏమాత్రం తీసిపోనట్లుగా సాగింది. మాక్ అసెంబ్లీలో సిఎంగా మన్యం జిల్లాకు చెందిన ఎం.లీలా గౌతం ప్రతిపక్ష నేతగా మన్యం జిల్లాకు చెందిన సౌమ్య,డిప్యూటీ సిఎంగా విశాఖ జిల్లాకు చెందిన కోడి యోగి,విద్యాశాఖ మంత్రిగా తిరుపతి జిల్లాకు చెందిన చిన్మయి,స్పీకర్‌గా కాకినాడ జిల్లాకు చెందిన స్వాతి వ్యవహరించారు. మాక్ అసెంబ్లీలో సామాజిక మాధ్యమాల నియంత్రణ,పర్యావరణ పరిరక్షణ బిల్లులపై స్వల్పకాలిక చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికార,విపక్షాలకు చెందిన ప్రజాప్రతినిధులు వ్యవహరించిన విద్యార్థులు మనం నిజమైన అసెంబ్లీలో ఉన్నామా ! అనే తలంపును కలిగించే రీతిలో సాగింది.. మాక్ అసెంబ్లీలో సామాజిక మాధ్యమాల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ బిల్లులపై స్వల్పకాలిక చర్చ నిర్వహించారు.

**మాక్ అసెంబ్లీ ద్వారా విద్యార్థుల వాదోపవాదాలు**

ప్రశ్నోత్తరాల్లో 10 ప్రశ్నలను సభ్యులు లేవనెత్తారు. వీటికి మంత్రులు సమాధానం ఇచ్చారు. శూన్య గంటలో 10 ప్రశ్నలు లేవనెత్తారు. విద్యార్థుల ఆన్‌లైన్ భద్రత, సామాజిక మాధ్యమాల నియంత్రణ, విద్యార్థి పర్యావరణ పరిరక్షణ బిల్లులను ప్రవేశపెట్టి, వాటిపై స్వల్పకాలిక చర్చ నిర్వహించారు. ప్రతిపక్షం సభకు హాజరైతే అసెంబ్లీలో ఎంత అర్థవంతమైన చర్చ జరపవచ్చో విద్యార్థులు వివరించిన తీరు ఆకట్టుకుంది. సభా గౌరవాన్ని కాపాడుతూ ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తే ప్రజలకు ఎలాంటి మేలు జరుగుతుందో మాక్ అసెంబ్లీ ద్వారా విద్యార్థుల వాదోపవాదాలు ఆలోచింపచేశాయి. ప్రజా ప్రతినిధులుగా తాము ఏమాత్రం తీసుపోమంటూ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన మాక్ అసెంబ్లీ మన్ననలు పొందుతుంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడితే తొలి శాసనసభ ఎలా జరుగుతుంది? ప్రొటెం స్పీకర్ నుంచి స్పీకర్ ఏ విధంగా బాధ్యతలు తీసుకుంటారు? ప్రశ్నోత్తరాల్లో అసలు ప్రశ్నలకు అనుబంధంగా సప్లిమెంటరీ ప్రశ్నలు సంధించే అవకాశాన్ని సభ్యులు ఏ విధంగా వినియోగించుకుంటారు? ఆ సమయంలో తమకు అవకాశం దక్కకపోతే జీరో అవర్ ఎలా వాడుకోవచ్చు? ఇలా అసెంబ్లీ వ్యవహారాలపై విద్యార్థులు నిర్వహించిన మాక్ అసెంబ్లీ అసలు ప్రజాప్రతినిధుల్నే ఔరా అనిపించిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**విద్యార్థులు ప్రవేశపెట్టిన బిల్లులు**

రాజకీయ విమర్శలు ఉండాలి కానీ అవి నిర్మాణాత్మకంగా సాగాలని విద్యార్థులు తమ ప్రదర్శన ద్వారా చాటారు. ప్రభుత్వ లోటుపాట్లు ఎత్తి చూపే సరైన వేదిక అసెంబ్లీ మాత్రమే అనే రీతిలో విద్యార్థులు ఒకరికొక్కరు పోటీపడినట్లుగా తమ తమ పాత్రలు నిర్వర్తించారు. ప్రతిపక్ష సభ్యులు స్పీకర్ పోడియం వరకూ వెళ్లి గొడవ చేయటం, మార్షల్స్ గొడవ చేసే సభ్యులను బలవంతంగా బయటకు తీసుకెళ్లటం వంటి దృశ్యాలు నవ్వులు పూయించాయి. విద్యార్థుల ఆన్‌లైన్ భద్రత, సామాజిక మాధ్యమాల నియంత్రణ, విద్యార్థి పర్యావరణ పరిరక్షణ బిల్లులను ప్రవేశపెట్టి, వాటిపై స్వల్పకాలిక చర్చ నిర్వహించారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా 45 వేల పాఠశాలల్లో ప్రత్యక్ష ప్రసారం జరిగేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. అసెంబ్లీలో బిల్లులు ప్రవేశపెట్టేటప్పుడు ఓటింగ్ జరిగిన శైలి, బిల్లుల ఆమోదం వంటి అన్ని ప్రక్రియలను విద్యార్థులు ఏమాత్రం తడబాటు లేకుండా సమర్థంగా నిర్వర్తించారు. సమావేశాల అనంతరం మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థి,విద్యారినీలు సీఎం చంద్రబాబు,స్పీకరు అయ్యన్న పాత్రుడు,మంత్రి నారా లోకేష్ తదితరులతో గ్రూప్ ఫోటో దిగారు.

**శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు, లోకేష్**

రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన భాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని సిఎం చంద్రబాబు అన్నారు. భారత ప్రజాస్వామ్యానికి ఇది శక్తిమంతమైన పునాది అన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణం,వికసిత భారత్ లక్ష్య సాధనలో రాజ్యాంగమే మార్గదర్శకమని పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. మన హక్కులకు పెద్ద దిక్కుగా నిలిచిన రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిద్దామని చెప్పారు. రాజ్యాంగ దినోత్సవాన్ని విద్యాశాఖ విన్నూత్నంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో స్టూడెంట్ అసెంబ్లీ నిర్వహిస్తున్నట్లు వివరించారు.

## రాజ్యాంగమే మూలం

>> పతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీ సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాల్ వేదికగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నేతృత్వంలో 75వ భారత రాజ్యాంగ దినోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి సిపి రాధాక్రిష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివన్ష నారాయణ్ సింగ్, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రులు జెపి నడ్డా, కిరణ్ రిజిజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన వారితో భారత రాజ్యాంగ ప్రవేశికను రాష్ట్రపతి చదివించారు. అనంతరం తెలుగు, ఒడియా, అస్సామీ, కశ్మీరీ, బోడో, పంజాబీ, నేపాలీ, మరాఠీ, మళయాలం భాషల్లో ప్రచురించిన భారత రాజ్యాంగ గ్రంధం డిజిటల్ వర్షన్‌లను ఈ సందర్భంగా రాష్ట్రపతి విడుదల చేశారు. "భారత్ కే సంవిధాన్ మే కళా ఔర్ కాలిగ్రఫీ" శీర్షికతో ఒక స్మారక బుక్‌లెట్‌ను రిలీజ్ చేశారు.

రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ... జాతీయతావాదం దిశగా పౌరులను నడిపే గొప్ప గ్రంథం. వలసవాద మనస్తత్వాన్ని త్యజించి, జాతీయతావాద ఆలోచనా వైఖరి దిశగా పౌరులను నడిపే గొప్ప గ్రంథం రాజ్యాంగం అని పేర్కొన్నారు. మహిళలు, యువత, ఎస్సీలు, ఎస్టీలు, రైతులు, మధ్యతరగతి, కొత్తగా మధ్యతరగతిలో చేరుతున్న వారు భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేస్తున్నారని రాష్ట్రపతి తెలిపారు.

"1949 సంవత్సరంలో సరిగ్గా ఇదే రోజున (నవంబరు 26), ఇదే భవనం (రాజ్యాంగ సభ సెంట్రల్ హాల్) వేదికగా భారత ప్రజలు రాజ్యాంగాన్ని ఆమోదించారు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక, కొంతకాలం పాటు తాత్కాలిక పార్లమెంటుగానూ రాజ్యాంగ సభ సేవలు అందించింది. భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్‌గా బాబా సాహెబ్ డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ వ్యవహరించారు. ఆయనే మన రాజ్యాంగ ప్రధాన రూపకర్త. ఈ గొప్ప చారిత్రక సందర్భం వేళ మీఅందరి నడుమ ఉన్నందుకు సంతోషిస్తున్నాను. దేశ ప్రజల వ్యక్తిగత, ప్రజాస్వామిక హక్కులకు సదా రక్షణ లభించాలని భారత రాజ్యాంగ రూపకర్తలు కోరుకున్నారు" అని రాష్ట్రపతి ముర్ము చెప్పారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాక్రిష్ణన్ మాట్లాడుతూ... ప్రవేశిక భారత రాజ్యాంగానికి ఆత్మ లాంటిది. భారత్ ఒక్కటే, సదా అది ఒక్కటిగానే ఉంటుందని రాజ్యాంగ ప్రవేశిక నిరూపించిందన్నారు. వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా భారత పౌరులంతా కలిసి పనిచేయాలి. ప్రజా ప్రతినిధులంతా ప్రజల సముచిత కోరికలు, డిమాండ్లను సాధించేందుకు కృషి చేయాలి. ఆ దిశగానే వారు అసెంబ్లీలు, పార్లమెంటులలో చర్చలు జరపాలి. ప్రజల భాగస్వామ్యం లేనిదే ఏ దేశమూ గొప్పదిగా ఎదగలేదు. మనమంతా మన పాత్రలను, బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా మాట్లాడుతూ... రాజ్యాంగాన్ని, దాని సందేశాన్ని దేశ ప్రజలంతా అనుసరిస్తే 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారుతుందన్నారు. ఇందుకోసం వికసిత భారత్ అనేది మనందరి ఏకైక లక్ష్యంగా మారాలని అభిప్రాయపడ్డారు.. రాజ్యాంగ లక్ష్యాలు, విలువలను మనం పాటిస్తేనే, వాటికి అనుగుణంగా నడుచుకుంటేనే వికసిత భారత్‌ను సాధించగలమన్నారు. అభివృద్ధి, న్యాయం, ఐక్యత, స్నేహభావం, మానవత్వం అనే అంశాల సమాహారంగా ఉండే వికసిత భారత్‌ను సాకారం చేద్దామని పిలుపునిచ్చారు.

## 'కృష్ణా' హక్కులు వదులుకోం

>> జలాలు పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ముఖ్యమంతి అధికారులకు చెప్పారు. మరోవైపు, పోలవరం ప్రాజెక్టు పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షి ంచారు. డయాఫ్రమ్ వాల్ పనులు 73 శాతం మేర పూర్తికాగా, వచ్చే ఏడాది ఫిబ్రవరి కల్లా నిర్మాణం పూర్తి చేస్తామని అధికారులు చెప్పారు. అలాగే బట్రస్ డ్యామ్ పనులు పూర్తిచేసినట్టు వివరించారు. డయాఫ్రమ్ వాల్ పనులు కొలిక్కి వస్తుండటంతో ప్రాజెక్టులో ప్రధాన భాగమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులు ఇప్పటికే ప్రారంభించినట్టు వివరించారు. పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ త్వరితగతిన పూర్తి చేయడానికి అవసరమైన భూసేకరణ తక్షణం చేపట్టాలని, ఆర్ ఆర్ ప్యాకేజ్‌ని నిర్వాసితులకు వేగంగా అందించాలని సిఎం సూచించారు.

## సర్వోన్నతం రాజ్యాంగం

>> నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. 'విజన్ ఉంటే సరిపోదు.దాన్ని అమలు చేయడం ముఖ్యం .నిరంతర శ్రమతోనే అనుకున్నది సాధించగలం.సరైన నిర్ణయాలు తీసుకుంటేనే ఏదైనా సాధ్యమవుతుంది. సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకొని ముందుకు వెళ్లాలి. చిన్న వయసులోనే నేను ఎంఎల్ఎ అయ్యాను. నాలుగో సారి సిఎంగా పనిచేస్తున్నాను. మాక్ అసెంబ్లీలో విద్యార్థులు చాలా బాగా మాట్లాడారు. విద్యార్థులు ఎక్కడా తడబడలేదు. బాధ్యత గుర్తు పెట్టుకునేలా...స్ఫూర్తినిచ్చేలా మాక్ అసెంబ్లీ నిర్వహించారు' అని సిఎం కొనియాడారు.

**రాజ్యాంగానికంటే ఎవరూ గొప్పకాదు**

భారతదేశ మనుగడ ఉన్నంతవరకూ అంబేద్కర్ అందరి గుండెల్లో చిరస్థాయిగా ఉంటారని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాజ్యాంగం గొప్పతనాన్ని ప్రతీ పౌరిడికీ అర్థమయ్యేలా చెప్పాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. రాజ్యాంగం అమలు చేసేవారు మంచివారు కాకుంటే దుష్ఫలితాలనిస్తుందని అంబేద్కర్ ఆనాడే చెప్పారని గుర్తుచేసారు. రాజ్యాంగానికంటే ఎవరూ గొప్పకాదని ప్రతీ ఒక్కరూ గ్రహించాలన్నారు. సాధారణ వ్యక్తి అయిన అబ్దుల్ కలాం రాష్ట్రపతి అయ్యారు.భారత రత్న పొందారు. పవర్ ఫుల్ రాష్ట్రపతిగా వ్యవహరించారు. ద్రౌపది ముర్ము గిరిజన మహిళ ప్రస్తుతం రాష్ట్రపతి అయ్యారు.నేనుకూడా సాధారణ కుంటుంబలోపుట్టి 4వసారి సీఎం అయ్యానంటే అది రాజ్యాంగం కల్పించిన అవకాశం రాజ్యాంగం హక్కులే కాదు,విధులు కూడా ఇచ్చింది. చాలా మంది హక్కుల కోసం పోరాడతారు,.కానీ విధులను గురించి పట్టించుకోరు. రాజ్యాంగ స్వరూపం చాలా గొప్పది. పార్లమెంట్, శాసన సభలు చట్టాలు చేస్తాయి. వ్యక్తిగత ప్రయోజనాల కోసం సభకు రాకూడదు. సమాజ హితం కోసం ప్రజాప్రతినిధులుగా రావాలి. వ్యక్తిగత కక్షల కోసం పోరాడాల్సిన అవసరం లేదు.ఏ దేశానికైనా పబ్లిక్ పాలసీలు అవసరం అన్నారు.

మాక్ అసెంబ్లీని ఎంతో చక్కగా విద్యార్థులు నిర్వహించారు. విద్యార్థులు మాక్ అసెంబ్లీలో అదరకొట్టారని సిఎం చంద్రబాబు అభినందించారు. సంక్షోభాలు ఎవరికైనా సహజమన్న చంద్రబాబు వాటిని ధైర్యంగా ఎదుర్కొని ముందుకు పోతేనే విజయాలు సాధిస్తామని చెప్పారు. మాక్ అసెంబ్లీలో తనకంటే సమర్థంగా విద్యార్థులు పాత్ర పోషించారని ప్రశంసించారు. ఒక్క విద్యార్థి కూడా తడబడకుండా కొత్త ఎమ్మెల్యేలకంటే బాగా ప్రదర్శన ఇచ్చారన్నారు. విద్యార్థుల ఆత్మస్థైర్యానికి అభినందనలు తెలిపారు. పాఠశాల విద్యాశాఖ రూపొందించిన బాలల రాజ్యాంగం పుస్తకాన్ని చంద్రబాబు ఆవిష్కరించారు. విద్యార్థులు మాక్ అసెంబ్లీ నిర్వహించిన తీరు చాలా అభినందనీయమన్నారు. విద్యార్థులు తక్కువ సమయంలోనే ఏవిధంగా ప్రవర్తించాలో అనుసరించి వండర్ ఫుల్‌గా వ్యవహరించారు. ప్రతి ఒక్కరిలో బాధ్యత, చైతన్యం రావడానికి సంవిధాన్ దివస్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామన్నారు.మన కోసం మనం భారత రాజ్యాంగాన్ని రాసుకున్నామని అన్నారు.

నిరంతరం శ్రమ చేయాలి. ప్రతి ఒక్కరికీ సంక్షోభాలు వస్తాయి...వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి. సరైన నిర్ణయం తీసుకుని ముందుకెళ్లాలి. అందువల్లే నేను 9 సార్లు ఎమ్మెల్యే అయ్యాను. 30 ఏళ్లకే నేను మంత్రి అయ్యాను..40 ఏళ్లకు సీఎం అయ్యాను అన్నారు. నా కంటే చిన్న వయసులోనే మీరు మాక్ అసెంబ్లీకి వచ్చి సమర్థవంతంగా నిర్వహించారుఅన్నారు. మా ఎమ్మెల్యేలు తడబడ్డా...మీరు మాత్రం తడబడలేదు. మీ కాన్ఫిడెన్స్‌కు అభినందనలు. అసెంబ్లీని మరిపించేలా సెటప్ వేసి మీ అందిరినీ ఎమ్మెల్యేలుగా చూస్తున్నాం. బాధ్యతను గుర్తుపెట్టుకోవడానికి ఈ మాక్ అసెంబ్లీ నిర్వహించుకున్నాం. దేశానికి ఆత్మగా భారత రాజ్యాంగం నిలిచిందిఅన్నారు. 1949 నవంబరు 26న ఆమోదం పొందింది అన్నారు.

## గ్రూప్-1 మెయిన్స్ అవకతవకలపై విచారణకు

# స్వతంత్ర కమిటీ: హైకోర్టు ఉత్తర్వులు

**విజయవాడ,నవంబరు26,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిపిఎస్సీ గ్రూప్1 మెయిన్స్ పరీక్షల్లో అక్రమాలనుతేల్చే విషయంలో హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. అందుకోసం హైకోర్టు విశ్రాంతన్యాయమూర్తి జస్టిస్ కెజి శంకర్ నేతృత్వం లోని స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఏపీ హైకోర్టు బుధవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలో జస్టిస్ కెజి శంకర్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. బార్‌కౌన్సిల్ మాజీ చైర్మన్ గంటా రామారావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వవైస్‌చాన్స్‌లర్ ప్రొ. రాజేంద్ర ప్రసాద్ సభ్యులుగా నియామించింది.హాయ్ ల్యాండ్‌లో జవాబు పత్రాలు మూల్యాంకనం జరిగిందా? ఓఎంఆర్ షీట్లపై మార్కులు నమోదు చేశారా? లేదా అనే విషయంపై అసలు వాస్తవాలు నిర్ధారించాలని ఈ కమిటీకి ఏపీ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కమిటీ సమక్షంలో జవాబు పత్రాలు, ఓఎంఆర్ షీట్లు పరిశీలించేందుకు ఇరువైపులా న్యాయవాదులకు అనుమతి ఇచ్చింది.

## పలాస వాసులు దుర్మరణం

>> (26)గా పోలీసులు గుర్తించారు. శబరి మల వెళ్లి తిరిగి వస్తుండగా కారు లారీఢీకొనడంతో జరిగినరోడ్డు ప్రమాదంలో ఇద్దరు పలాస మండలానికి చెందిన అయ్యప్ప స్వాములు దుర్మరణం పాలవ్వడంతో వీర రామచంద్రాపురం, పెదంచల గ్రామాలలో తీవ్ర విషాదం నెలకొంది. మరొకరి పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు.

## వారం - వర్జ్యం

27-11-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
సప్తమి రా.12.26
ధనిష్ఠ రా.2.29,అనూరాధ కార్తె
వర్జ్యం : ఉ.9.46-11.23
దు.ఉ.10.04-10.49, 2) మ.2.34-3.19
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** కుటుంబంలోని అనైక్యతను సర్దుబాటు చేసుకోలేరు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ఆరోగ్యంపట్ల చాలా జాగ్రత్త అవసరం.

**వృషభం:** బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. వస్తు లాభం.ముఖ్యమైన పనులు శ్రమానంతరం పూర్తిచేస్తారు.

**మిథునం:** సంఘంలో గౌరవం పెంపొందుతుంది. విద్య, ఉద్యోగ యత్నాలు కలిసి వస్తాయి. ప్రయాణాలు లాభిస్తాయి.

**కర్కాటకం:** నూతన సంస్థలు, పరిశ్రమలు ప్రారంభిస్తాయి. ముఖ్య విషయాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**సింహం:** పిసినారులను, మొండివారిని ఒప్పించడానికి మీరు చేసే యత్నాలు నల్లేరు మీద నడకలా సాగుతాయి.

**కన్య :** స్వయం ఉపాధి పథకాలు లభిస్తాయి. సాంకేతిక పరమైన కారణాల వలన అభిప్రాయ బేధాలు చోటుచేసుకుంటాయి.

**తుల :** వివాహాది శుభకార్యాలకు నిర్విఘ్నంగా పూర్తి చేయగలుగుతారు. క్రమశిక్షణకు ప్రాముఖ్యత నిస్తారు. ప్రయాణాలు అనుకూలం.

**వృశ్చికం:** వివాదాస్పద వ్యవహారముల పరిష్కారమునకు మీరు చేసి కృషి ఫలిస్తుంది. సోదరుల కలయిక వలన ఆనందం కల్గుతుంది.

**ధనుస్సు:** ఉపయుక్తమైన పరిచయాలు చోటు చేసుకుంటాయి. పోటీ పరీక్షలలో మంచి ఫలితాలను సాధిస్తారు. వస్త్రాలు కొనుగోలు.

**మకరం:** మీలో లౌక్యం లోపించనంత వరకూ ఈ రోజు చెప్పుకోదగిన ఇబ్బందులేవీ చోటు చేసుకోవు.సోదరుల నుండి శుభవార్తలు వింటారు.

**కుంభం:** కాంట్రాక్టు పనులలో ప్రత్యక్ష పర్యావేక్షణ అవసరమవుతుంది. ఇంటా బయటా ప్రోత్సాహం లభిస్తుంది.

**మీనం:** ముఖ్యులతో చర్చలు, సంభాషణలు భవిష్య కార్యక్రమాలు సంబంధించిన అంశాలు సున్నితమైన అంశాలతో ఉంటాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ఆంధ్రప్రదేశ్ లిక్కర్ కేసు నిందితులకు

# సుప్రీంకోర్టులో ఊరట

**విజయవాడ,నవంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి లిక్కర్‌కేసు నిందితులకు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. ఈ కేసులో సుప్రీం కోర్టును నిందితులు కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, బాలాజీ గోవిందప్ప ఆశ్ర యించారు. న్యాయస్థానంలో నిందితులు వేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా సుప్రీం కోర్టులో వాదనలు జరిగాయి. ఈ క్రమంలో సరెండర్ నుంచి నిందితులకు మినహాయింపు ఇచ్చింది న్యాయస్థానం. 10 రోజుల్లో కౌంటర్ దాఖలు చేయాలని సిట్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో రిజైండర్ దాఖలు చేసేందుకు ఐదు రోజుల సమయం కోరారు నిందితుల తరపు న్యాయవాదులు. డిసెంబరు 15వ తేదీకి కేసు విచారణ వాయిదా వేసింది. ఇటీవల లిక్కర్ కేసులో ఏపీ హైకోర్టు బెయిల్ రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును లిక్కర్ కేసు నిందితులు ఆశ్రయించారు.

## ఆర్ఎస్ఎస్ ప్రచారక్ రామ్ లాల్ జీతో

# మంత్రి నారా లోకేష్ భేటీ



**విజయవాడ, నవంబరు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) అఖిల భారతీయ సంపర్క్ ప్రముఖ్ రామ్ లాల్ జీతో విద్య, ఐటీ శాఖలమంత్రి నారా లోకేష్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. 2006-19 వరకు రామ్ లాల్ బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా(సంస్థ), ఆర్ఎస్ఎస్‌లో వివిధ ఉన్నత హోదాల్లో పనిచేశారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేశవ్యాప్తంగా వివిధ రంగాల ప్రముఖులతో ఆయన సమావేశం అవుతున్నారు. ఈ నేపథ్యంలో ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేష్‌తో పాటు పలువురు రాష్ట్ర మంత్రులతో ఆయన భేటీ అయ్యారు. మంత్రి నారా లోకేష్ స్వయంగా వెళ్లి రామ్ లాల్‌కు స్వాగతం పలికారు. దేశవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ చేపట్టిన కార్యక్రమాలు, సంస్థ విశిష్టతను ఈ సందర్భంగా రామ్ లాల్ వివరించారు. అనంతరం రామ్ లాల్‌ను మంగళగిరి శాలువాతో మంత్రి లోకేష్ ఘనంగా సత్కరించారు. బాలల రాజ్యాంగ పుస్తకాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కె.అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎన్ఎండీ ఫరూఖ్, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, ఎస్.సవిత, కొండపల్లి శ్రీనివాస్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, డోలా బాల వీరాంజనేయస్వామి, సత్యకుమార్ యాదవ్, ఆనం రాంనారాయణరెడ్డి, కొలుసు పార్థసారథి, వాసంశెట్టి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## 'పల్లెపండుగ'తో గ్రామాలకు కొత్త రూపు

>> "పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ బాధ్యతలు స్వీకరించిన తర్వాత పల్లెల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా రూపొందించిన అద్భుత కార్యక్రమం పల్లె పండగ. గ్రామీణాంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ఈ కార్యక్రమం గొప్ప మైలురాయిగా నిలిచిపోతుంది. ప్రజల సహకారంతో ప్రణాళికబద్ధంగా ముందడుగు వేసి గొప్ప విజయం సాధించాం" అని వివరించారు.

**పల్లె పండగ 2.0 ద్వారా రెండింతల అభివృద్ధి**

"పల్లె పండగ విజయం ఇచ్చిన స్ఫూర్తిని కొనసాగిస్తూ పల్లె పండుగ 2.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. పల్లె పండగ 1.0 కార్యక్రమం ద్వారా రూ.2,525 కోట్ల విలువైన పనులు టైం బౌండ్ విధానంలో పూర్తి చేశాం. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల కిలోమీటర్ల సిసి రోడ్లు నిర్మించాం. పాడి రైతుల కోసం 22,500 మినీ గోకులాలు ఏర్పాటు చేశాం. మూగజీవాల దప్పిక తీర్చడానికి 15 వేల నీటి తొట్టెలు నిర్మించాం. లక్షకు పైగా నీటి కుంటలు ఏర్పాటు చేశాం. ఇప్పుడు పల్లె పండగ 2.0 కార్యక్రమం ద్వారా రూ.5,838 కోట్ల అంచనా వ్యయంతో 8,571 కిలోమీటర్ల కొత్త రహదారులు నిర్మిస్తున్నాం. పాత రహదారులకు పునర్నిర్మాణం చేయబోతున్నాం. రూ.375 కోట్ల వ్యయంతో 25 వేల మినీ గోకులాలు, రూ.16 కోట్ల అంచనాతో 157 కమ్యూనిటీ గోకులాలు ఏర్పాటు చేస్తాం. రూ.4 కోట్ల వ్యయంతో 58 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశాం. పంచాయతీల పరిధిలో రూ.406 కోట్లతో 15 వేల కొత్త అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం. రూ.148 కోట్లతో డిపిఆర్సీ, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం చేయనున్నాం. వీటితోపాటు కోనసీమకు అదనంగా మరో రూ.100 కోట్లు నిధులు మంజూరు చేస్తున్నాం. వీటన్నింటికి నాబార్డు, ఏషియన్ ఇన్ఫ్రాస్టక్చర్ డెవలప్మెంట్ బ్యాంకుల నుంచి రుణ సహకారం తీసుకోవడంతో పాటు మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన, సాస్కీ వంటి పథకాల నుంచి నిధులు సేకరిస్తున్నాం" అని డిప్యూటీ సిఎం వివరించారు.

## గత ఐదేళ్ల పాలన మరిచారా?

>> మరోవైపు జగన్ చెబుతున్న మా హయాంలో 3 లక్షల టన్నులు ఎగుమతి చేశాం వంటి గణాంకాలు పూర్తిగా అబద్ధం. ప్రస్తుతం గడచిన రెండు నెలల్లో రోజుకు 700-800 టన్నులే ఎగుమతి అవుతున్నాయి. కేంద్రం నుంచి అవార్డులు తీసుకొచ్చామన్న మాటలకు ఎటువంటి రికార్డులు లేవు. బహిరంగ మార్కెట్ లో అంతర్జాతీయ అంశాలతో ముడిపడి ఉన్న పంటలకు ధర పెరిగితే మా వలనే పెరిగిందని మాట్లాడుతున్న అవగాహన లేని మాజీ సీఎం జగన్ అని ఎద్దేవా చేశారు.

గత ప్రభుత్వ పాలనలో ఖరీఫ్ 2019 తర్వాత స్వంత బీమా సంస్థతో పంట బీమా అమలు చేయాలనుకున్న ప్రయత్నం విఫలమై, రబీ 2018-19 తర్వాత ఏ రబీ సీజన్‌కూ బీమా పరిహారం చెల్లించకపోవడం వల్ల రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకున్న తర్వాత పథకాల సమర్థవంతమైన అమలు, పర్యవేక్షణ కోసం వ్యవసాయ, ఆర్థిక, పౌర సరఫరాల మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి, ఖరీఫ్ 2024లో ఈపంట ఆధారంగా ఉచిత పంట బీమాను అమలు చేయడంతో పాటు రబీ 2024-25 నుంచి స్వచ్ఛంద నమోదు విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతులకు సహాయపడేందుకు బలమైన చర్యలు చేపట్టింది. రాష్ట్ర ఉద్యాన శాఖ 'ఫ్రూట్ కేర్' యాక్టివిటీ చేపడుతున్న ప్రతి రైతుకు ఎకరాకు రూ.10,000/ చొప్పున రాయితీ ప్రోత్సాహకాలు అందిస్తోంది. నాణ్యమైన పంట పెంచేందుకు శిక్షణ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తోంది. ఉద్యానశాఖ జాయింట్ డైరెక్టర్ స్వయంగా అనంతపురం, నంద్యాల, కడప జిల్లాలలో పర్యటించి పంట పరిస్థితిని సమీక్షించారు. ప్రభుత్వ ప్రతినిధులు ఢిల్లీలో బయ్యర్ అండ్ సెల్లర్స్ మీట్‌నిర్వహించి దేశంలోని ప్రధాన మార్కెట్లతో ప్రత్యక్ష చర్చలు జరిపారు. ఆజాద్పూర్ మండి, హర్యానా సోనిపట్ అగ్రిగేటర్లతో జరిగిన సమావేశాల్లో వచ్చే 10-15 రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో కొనుగోలు ప్రారంభమవుతుందని కొనుగోలుదారులు హామీ ఇచ్చారు.

## జోగి రమేష్, సోదరుని పోలీసు విచారణ

>> వరకు మరో మూడు రోజులపాటు జోగి సోదరులను ఎక్సైజ్ అధికారులు విచారించనున్నారు. తొలిరోజు విచారణ ముగిసిన అనంతరం ఇద్దరికీ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఆపై జోగి సోదరులను విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. నకిలీ మద్యం కేసుకు సంబంధించి పలు అంశాలపై జోగి సోదరులను ఎక్సైజ్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. ఈ కేసులో ప్రధాన నిందితుడు జనార్ధనరావును ఇటీవల రెండు విడతలుగా కస్టడీలోకి తీసుకుని విచారించిన ఎక్సైజ్ అధికారులు కీలక విషయాలు రాబట్టారు. ఇందులో వెల్లడించిన అంశాల ఆధారంగా జోగి రమేశ్‌ను అధికారులు మిగతా మూడు రోజులపాటు మరోసారి ప్రశ్నించనున్నట్లు సమాచారం. నకిలీ మద్యం కేసులో నిందితులు జోగి రమేశ్ సోదరులను కస్టడీకి ఇస్తూ విజయవాడ ఎక్సైజ్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం విధితమే. వైఎస్సార్సీ జోగి రమేశ్, జోగి రాములను 4 రోజుల పాటు ఎక్సైజ్ అధికారుల కస్టడీకి న్యాయస్థానం అనుమతించింది. ఈ క్రమంలోనే నేటి నుంచి (ఈ నెల 26వ తేదీ) 29 వరకు జోగి సోదరులను అబ్కారి అధికారులు విచారించనున్నారు. అంతేకాకుండా 26వ తేదీ ఉదయం 10 నుంచి 29 సాయంత్రం 3 గంటల వరకు విచారించవచ్చని కోర్టు తెలుపగా, వారిని నెల్లూరు జైలు నుంచి విజయవాడకు తరలించగా విచారణ సమయం తగ్గినట్లు అధికారులు తెలిపారు. జోగి సోదరులు ఇద్దరు మకిలీ మద్యం కేసులో ఏ18, ఏ19 నిందితులుగా ఉన్నారు. విచారణకు ముందు వరకు జోగి సోదరులు నెల్లూరు కేంద్రకారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్ లో ఉన్నారు. ఈ కేసులో ఏ1 జనార్దన రావు, జోగి సోదరులకు మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలపై అధికారులు ప్రధానంగా దృష్టి పెట్టారు.


## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

>> కదులుతూ మరింత బలపడే అవకాశముందని పేర్కొన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరికలు జారీచేసింది. వాయుగుండం ప్రభావంతో గురు, శుక్రవారాల్లో దక్షిణ కోస్తాతోపాటు రాయలసీమ జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. అటు సెన్యార్ తుపాను ఇండోనేసియా వద్ద తీరందాటిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో ఉత్తరాంధ్రకు తుపాను పెనుముప్పు తప్పింది. మలక్కా జలసంధి ప్రాంతంలో తీవ్ర వాయుగుండం తుపాన్‌గా బలపడిందని విప త్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ తుపా నుకు సెన్యార్‌గా నామకరణం చేశారు. ఇది పశ్చిమవాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతూ ఈరోజు తుపానుగా బలపడిందని వెల్లడించింది. నైరుతి బంగాళాఖాతం, దక్షిణ శ్రీలంక మరియు హిందూ మహాసముద్రం మీదుగా అల్పపీడనం కొనసాగుతుందని విపత్తుల నిర్వ హణ సంస్థ పేర్కొంది. ఇది రాబోయే 12 గంటల్లో ఉత్తరవాయువ్య దిశగా కదులుతూ తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశం ఉందంది. ఆ తదుపరి 24 గంటల్లో వాయు గుండంగా బలపడే అవకాశం ఉందని వివరించింది.

## హక్కులతో పాటు విధులూ ఉంటాయి

### రాజ్యాంగ దినోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

**విజయవాడ, నవంబరు 26 ప్రభాతవార్త:** రాజ్ భవన్‌లోని దర్బార్ హాల్‌లో బుధవారం నిర్వహించిన 76వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన సందర్భంగా మాత్రమే కాకుండా, దేశ పౌరులలో రాజ్యాంగ విలువలను ప్రోత్సహించడానికి కూడా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని గవర్నర్ అబ్దుల్ నజీర్ తన ప్రసంగలో అన్నారు. భారత రాజ్యాంగంలో పొందుపరచబడిన ప్రాథమిక హక్కులు మరియు స్వేచ్ఛలను పరిరక్షి ంచడం లోనూ, సమ సమాజానికి నిర్మాణానికి, వ్యక్తిగత హక్కుల పరిరక్షి ంచడంలోనూ రాజ్యాంగం కీలక పాత్ర పోషిస్తుందని గవర్నర్ అన్నారు. భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కులకు ప్రత్యేక పాత్రను ఇచ్చినప్పటికీ, హక్కులు మరియు విధులు నాణేనికి రెండు వైపులా ఉంటాయని, ప్రజలకు సంక్రమించిన హక్కులతో పాటు సంబంధిత విధులు కూడా ఉంటాయని గమనించాలని గవర్నర్ అన్నారు. ముందుగా, గవర్నర్ అబ్దుల్ నజీర్ భారత రాజ్యాంగ ప్రధాన శిల్పి భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, రాజ్యాంగ ముసాయిదా కమిటీ సభ్యులకు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. తర్వాత రాజ్యాంగం ప్రియంబల్‌ను సమావేశానికి హాజరయిన అతిథులతో గవర్నర్ చదివించారు. ప్రథమ మహిళ సమీరా నజీర్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయ అధికారులు, వివిధ చట్టబద్ధ సంస్థల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్య దర్శి జి. అనంత



# ఏపి లింక్‌ను ఆర్థికంగా బలోపేతం చేయండి

**విజయవాడ, నవంబరు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ లాజిస్టిక్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ - ఏపీ లింక్ సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేయాలని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్రంలోని రహదారులను గుంతలు లేకుండా తీర్చి దిద్దడమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతా అంశమని సీఎం స్పష్టం చేశారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఆర్ అండ్ బి శాఖపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... "ప్రభుత్వం త్వరలో ఏర్పాటు చేయబోతున్న ఏపీలింక్ సంస్థ ద్వారా పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేయాలి. ఇప్పటి నుంచే దీనిపై ప్రణాళికలు రూపొందించాలి. లాజిస్టిక్స్ కార్పోరేషన్ ను బలోపేతం చేసే క్రమంలో రహదారులు భవనాల శాఖకు వివిధ మార్గాల్లో వచ్చే ఆదాయాలను ఎంత వరకు వినియోగించుకోవచ్చో చూడాలి. లాజిస్టిక్స్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తే సంస్థ ఆర్థికంగా బలోపేతం చేయడానికి మార్గం సుగమం అవుతుంది. అప్పుడు రాష్ట్రంలోని రహదారుల నెట్ వర్క్ తో పాటు ఇతర మౌలిక సదుపాయాలను అద్భుతంగా తీర్చిదిద్దవచ్చు."అని సీఎం చెప్పారు.

> సమర్థవంతంగా రోడ్ల నిర్వహణ..
> పాత్ హోల్ ఫ్రీ రహదారులే ప్రాధాన్యత:
> సిఎం చంద్రబాబు

రోడ్ల నిర్మాణంలో నాణ్యత... ఇంజనీర్లకు జవాబు దారీతనం"రోడ్ల నిర్మాణం, నిర్వహణ, పాత్స్ హోల్స్ ఫ్రీ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. రాష్ట్రంలో గుంతల రోడ్లు కన్పించకూడదు. రోడ్ల నిర్మాణంలో, నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు తప్పకుండా చూసుకోవాలి. అలాగే కాంట్రాక్టర్లు ఏదైనా తప్పు చేసినా... నాణ్యతలో రాజీ పడినా అలాంటి కాంట్రాక్టర్లను గుర్తించాలి. ఇక ఇంజనీర్లు కూడా జవాబు దారీ తనంతో పని చేయాలి. ఈ ఏడాది మార్చిలో ఆమోదించిన రోడ్ల నిర్వహణ, పాత్ హోల్స్ పనులు 10 నుంచి 15 శాతం మేర పనులు పూర్తయ్యాయి. అలాగే ఇటీవలే ఆమోదించిన పనులు వచ్చే నెల నుంచి ప్రారంభించేలా చర్యలు తీసుకోండి. ఇప్పటి వరకు ఆమోదాలు పొందిన పనులు వచ్చే ఏడాది నాటికి పూర్తయ్యేలా చూడాలి. అలాగే రోడ్ల పరిస్థితి ఎలా ఉందో ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేసుకోవాలి. దీని కోసం డ్రోన్లు, లైడార్ సర్వే అవసరమైతే శాటిలైట్ సర్వేల ద్వారా రోడ్ల పరిస్థితి ఎలా ఉందన్న అంశాలను పరిశీలించటంతో పాటు పనులు ఏ విధంగా జరుగుతున్నాయోననే విషయాన్ని గుర్తించాలి. దీని కోసం టెక్నాలజీని వినియోగించుకోవాలి. మొంథా తుఫానులో నష్టపోయిన రోడ్లు, బ్రిడ్జిల పునర్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. ఇప్పటికే కొన్నింటిని చక్కదిద్దాం... పెండింగులో ఉన్న పనులను కూడా వెంటనే చేపట్టాలి. పీపీపీ విధానంలో చేపట్టనున్న రోడ్ల జాబితా వెంటనే సిద్ధం చేయాలి. నిబంధనల ప్రకారం వయబులిటీ గ్యాప్ ఫండింగ్ ఏయే రోడ్లకు ఇవ్వగలమనేది పరిశీలించాలి. వైట్ టాపింగ్ రోడ్ల నిర్మాణంపై పైలెట్ ప్రాజెక్టులు చేపట్టాలి." అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

నేషనల్ హైవేల పనుల్లో జాప్యం జరగకూడదు "రాష్ట్ర రోడ్లతో పాటు... నేషనల్ హైవేల విషయంలోనూ అధికారులు దృష్టి పెట్టాలి. నిరంతరం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలి. భూసేకరణ మొదలుకుని ఇతర అంశాల్లో కేంద్రానికి పూర్తిగా సహకరించాలి. ఏ మాత్రం జాప్యం జరగడానికి వీల్లేదు. అలాగే స్టేట్ ఫస్ట్... డెవలప్మెంట్ ఫస్ట్ అనే విషయాన్ని ప్రజాప్రతినిధులు అంతా గుర్తించాలి." అని

# ఇక యేటా మాక్ అసెంబ్లీ

### - మహిళలను కించపరిచే చర్యలు లేకుండా విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలి :విద్యాశాఖ మంత్రి లోకేశ్

**విజయవాడ,నవంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళలను కించపరిచే చర్యలు లేకుండా విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రాథమిక హక్కులే కాదు, ప్రాథమిక బాధ్యతలనూ తెలుసుకోవాలన్నారు.ఏపీ అసెంబ్లీ ప్రాంగణంలో పాఠశాల విద్య నిర్వహించిన నమూనా శాసనసభ కార్యక్రమాన్ని ఉద్దేశించి నారా లోకేష్ మాట్లాడుతూ మాక్ అసెంబ్లీలో విద్యార్థులు చాలా బాగా మాట్లాడారు. ఏటా విద్యార్థులతో ఇలాంటి మాక్ అసెంబ్లీలు నిర్వహిస్తాం. చాగంటికి కేబినెట్ ర్యాంకు ఇచ్చి సలహాదారుగా నియమించాం. నైతిక విలువలపై ఇటీవల చాగంటితో సమావేశం నిర్వహించాం. ఒక నిర్ణయం తీసుకునేటప్పుడు బాగా ఆలోచించి తీసుకోవాలి. పెట్రోల్, ఫోన్, రవాణా ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందంటే చాగంటి వద్దన్నారు. మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించాం. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అనుసంధానం కావాలి. మహిళలను కించపరిచేలా మాట్లాడితే వెంటనే అడ్డుకోవాలి. మహిళలను గౌరవించడం పిల్లలకు చిన్నప్పటి నుంచే నేర్పాలి. పాఠ్యపుస్తకాల్లోనే కాదు అమలు చేయడం ముఖ్యం. తల్లికి చెప్పుకోగలిగే నిర్ణయమే ప్రజాప్రతినిధులు తీసుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు. మాక్ అసెంబ్లీ కార్య క్రమంలో పాల్గొన్న మంత్రి లోకేశ్ శాసనసభలో చర్చలు వాస్తవాలతో సాగాలి గానీ ఫ్రస్టేషన్‌తో కాదని తేల్చిచెప్పారు. ఆవేశాలు, ఎమోషన్లు నియంత్రించుకుంటేనే ప్రజాస్వామ్యాన్ని కాపాడగలమన్నారు. మాక్ అసెంబ్లీని ఈ ఒక్కసారికే పరిమితం చేయకుండా ఏటా కొనసాగిస్తా మన్నారు. మాక్ అసెంబ్లీకి 7 లక్షల మంది విద్యార్థులు పోటీ పడి ఇక్కడి వరకూ రావటం ఆనందంగా ఉందని మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. వివిధ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 175 నియోజకవర్గాల విద్యార్థులు ఇక్కడ పాల్గొన్నారని వెల్లడించారు. కార్యక్రమం నిర్వహణకు తెరవెనుక ఎంతో కష్టపడ్డామని తెలిపారు. తాను స్కూల్ కి వెళ్లేటప్పుడు మాక్ అసెంబ్లీ ఉండి ఉంటే అప్పుడే అసెంబ్లీ విధానాలు తెలుసుకునే అవకాశం కలిగేదన్నారు. తనకు దక్కని అవకాశం నేటి విద్యార్థులకు దక్కటం శుభపరిణామమని చెప్పారు. విద్యాశాఖ రూపొందించిన "బాలల రాజ్యాంగం" పుస్తకాన్ని ప్రతీ విద్యార్థి చదవాలని కోరారు. విద్యార్థుల ప్రతీ విజయంలో తల్లిదండ్రుల కష్టంకృషి ఎంతో ఉందన్నారు. అందరం కలసికట్టుగా వికసిత్ భారత్ నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ఎంతమంది రాజకీయ నాయకులవుతారు అని లోకేశ్ అడిగిన ప్రశ్నకు కేవలం ఆరుగురు విద్యార్థులు మాత్రమే చేతులెత్తారు. రాజకీయం ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమని లోకేశ్ విద్యార్థులకు సూచించారు. మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులు భవిష్యత్తులో చట్టసభల్లోకి రావాలని ఆకాంక్షించారు.



మాక్ అసెంబ్లీ సందర్భంగా మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి లోకేశ్

## భారత రాజ్యాంగాన్ని, కార్మిక హక్కులను కాపాడండి : కెవిపిఎస్

**విజయవాడ,నవంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** భారత రాజ్యాంగం కాపాడాలని, పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను రద్దు చేస్తూ కార్పోరెట్స్ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ వ్యతిరేకిస్తూ విజయవాడలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం స్మృతి వనం వద్ద కెవిపియస్.దళిత గిరిజన ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో " రాజ్యాంగ పీఠిక పఠనం" కెవిపియస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి అధ్యక్షతన జరిగింది. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరావు పీఠిక చదివి ప్రతిజ్ఞ చేయించగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండెమెడ క్రాంతి కుమార్, అలిండియా దళిత, గిరిజన, బలహీన మైనారిటీ సంఘాల అధ్యక్షులు బందెల కిరణ్ రాజ్, జైభీమ్ భారత్ పార్టీ మహిళా నాయకులు గ్రేష మేరి, కెవిపియస్ విజయవాడ నాయకులు చింతల శ్రీనివాస్, కొసనం వర్ధన్, వరప్రసాద్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

# తిరుమల సమాచారం

## వసతి సముదాయాల ఆధునీకరణకు

### దాత మంతెన రూ.9కోట్లు భూరి విరాళం



**తిరుమల,నవంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిపై అత్యంత భక్తివిశ్వాసాలు కలిగిన ఓ దాత తనవంతుగా భూరి విరాళాన్ని టిటిడికి అందించాడు. అమెరికాకు చెందిన ప్రవాసభారతీయుడు మంతెన రామలింగరాజు తన కుమార్తె మంతెన నేత్ర, అల్లుడు వంశీ గాదిరాజుల పేరుపై తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయాల ఆధునీకరణకు ఈ భారీ 9కోట్ల రూపాయలు విరాళాలను అందించారు. బుధవారం ఉదయం తిరుమల పద్మావతి అతిధి గృహంలో దాత మంతెన రామలింగరాజు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరిని కుటుంబసభ్యులతో కలసి అందజేశారు. ఈ సందర్భంగా దాతను టిటిడి అభినందించింది. 2012లో కూడా దాత రామలింగరాజు టిటిడికి 16.06కోట్లు విరాళంగా ఇచ్చారని తెలిపారు. తిరుమలలో భక్తులకు మౌళిక సదుపాయాల కల్పనలో తనవంతు సహకారం అందించేందుకు ముందుకు వచ్చిన ఆయనను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అభినందించారు. భవిష్యత్తులో టిటిడికి మరిన్ని విరాళాలందించాలని ఆయన ఆశించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు,టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి ఉన్నారు.

### అంతా మంచి జరగాలని ప్రార్థించాం - హైకోర్టు న్యాయమూర్తులు





**తిరుమల,నవంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం శుభమని, అందరికీ అంతా మంచిజరగాలని ఆకాంక్షించినట్లు హైకోర్టు న్యాయమూర్తులు తెలిపారు. బుధవారం ఉదయం హైకోర్టు న్యాయ మూర్తులు జస్టీస్ వి.గోపాలకృష్ణారావు, జస్టీస్ ఏవి శేషసాయి కుటుంబంతో కలసి బుధవారం ఉదయం తిరుమలకు వచ్చారు. ఉదయం స్వామివారి నైవేద్య విరామసమయంలో వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలోపల వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### భగవంతుని ఆశీస్సులందరిపై ఉండాలి:సినీదర్శకుడు శైలేష్‌కోలా

**తిరుమల,నవంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు సినీదర్శకుడు శైలేష్‌కోలాను తెలిపారు. బుధవారం ఉదయం ఆయన విఐపి బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## రాజధాని రైతుల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

### నిర్మాణాల నాణ్యత, వేగం విషయంలో రాజీ వద్దు

### అమరావతిలో పనుల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

**విజయవాడ, నవంబరు 26 ప్రభాతవార్త:** రాజధాని అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. గత పాలనలో ఇబ్బందులు ఎదుర్కొన్న రాజధాని రైతులకు న్యాయం జరగాలని సీఎం సూచించారు. బుధవారం సచివాలయంలో సీఆర్డీఏ పై సీఎం సమీక్ష నిర్వహించారు. గత పాలనలో రాజధాని కోసమే రైతులు సుదీర్ఘ పోరాటం చేశారని.. వారికి ఏమైనా సాంకేతిక పరమైన ఇబ్బందులు ఉంటే వాటిని తక్షణం పరిష్కరించాలని సీఆర్డీఏ, పురపాలక శాఖను ముఖ్యమంత్రి ఆదేశించారు. త్వరలో వారితో సమావేశమై ఇబ్బందులు తెలుసుకోవాలని పురపాలక శాఖ మంత్రికి, అధికారులకు స్పష్టం చేశారు. రైతులు త్యాగం చేసిన ప్రభుత్వానికి సహకరించిన రైతులకు ప్రభుత్వం తరపున అదే స్థాయి సహకారం అందాలని అన్నారు. అపరిష్కృతంగా ఏమైనా అంశాలు ఉంటే వాటిని కేబినెట్ ముందు ఉంచాలని ఆదేశించారు. రాజధానిలో నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేందుకు కార్యాచరణ చేయాలని సూచించారు. నిర్మాణాల నాణ్యత, వేగం విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని పేర్కొన్నారు. అంతిమంగా అమరావతి ప్రపంచ శ్రేణి నగరంగా తయారు కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ఈ సమీక్షకు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, సీఆర్డీఏ, పురపాలక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

### టైల్స్ ఫ్యాక్టరీలో గ్యాస్‌పేలి ఇద్దరు కార్మికులు మృతి: పలువురికి గాయాలు

**శ్రీకాళహస్తి,నవంబర్ 26 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మండలంలోని వెల్లంపాడు వద్ద ఏర్పాటు చేసిన సౌమ్య టైల్స్ ఫ్యాక్టరీలో బుధవారం గ్యాస్ పేలటంతో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. కొందరు కార్మికులు గాయపడి నెల్లూరుజిల్లా వెంకటగిరి ఆసుపత్రికి తరలించారు.మృతి చెందిన వారిలో చీరాలకు చెందిన పోతురాజు (30),ఒరిస్సాకు చెందిన అరబింద పాండే అనే (25) ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు.ప్రమాదం జరిగిన వెంటనే మేనేజ్‌మెంట్ స్పందించి గాయపడ్డ కార్మికులను ఆసుపత్రికి తరలించటానికి 108ను పిలిచారు.గ్యాస్ సిలిండర్ లీకేజితో పాటు ఒక్కసారిగా పేలిపోయినట్లు చెబుతున్నారు. దాంతో విధుల నిర్వహణలో ఉన్న కార్మికులు కకావికలమయ్యారు.సంఘటన సమాచారం తెలిసిన వెంటనే శ్రీకాళహస్తి డివైయస్ పి నరసింహామూర్తి రూరల్ ఎస్ఐ నరసింహారావులు చేరుకున్నారు. సంఘటన ఎలా జరిగిందనే విషయంపై చర్చించారు.బాధితులను ఆసుపత్రులకు తరలించటానికి చొరవ చూపారు.గాయపడిన వారిలో చంద్రగిరికి చెందిన బాలాజి,ఒరిస్సాకు చెందిన రంజన్ నాయక్‌లు ఉన్నారు. వారికి ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందిస్తున్నారు.

## వైకుంఠ దర్శనాల్లో సామాన్యభక్తులకే అధిక ప్రాధాన్యత

### - జనవరి 2నుండి 8వరకు టిక్కెట్ లేకున్నా సర్వదర్శనం
### - డిసెంబర్ 30నుండి జనవరి 1వరకు ఆన్‌లైన్‌లోనే ఇ డిప్ టోకెన్లు
### - టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు



**తిరుమల,నవంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:** వైఖానస ఆగమోక్తంగా పూజలందుకుంటున్న తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలను సామాన్యభక్తులకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు వెల్లడించారు. పదిరోజుల దర్శనాల్లో మొదటి మూడురోజులు (డిసెంబర్ 30 వైకుంఠ ఏకాదశి, 31 ద్వాదశి, జనవరి 1)మినహా మిగిలిన ఏడురోజులు టోకన్లు ,టిక్కెట్లు లేకున్నా దర్శనాలకు రావచ్చని సామాన్యభక్తులకు పిలుపునిచ్చారు. ఏడురోజులు ఆ వైకుంఠ ద్వార దర్శనాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బుధవారం ఉదయం తిరుమలలోని ఛైర్మన్ క్యాంప్ కార్యాలయంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సిపిఆర్‌ఒ డాక్టర్ తలారి రవి, పిఆర్‌ఒ నీలిమతో కలసి ఛైర్మన్ నాయుడు మీడియాప్రతినిధులతో మాట్లాడారు. డిసెంబర్ 30వతేదీనుండి 2026 జనవరి 8వరకు ఎంతో గొప్ప కార్యక్రమం జరుగనుందన్నారు. మొదటి మూడురోజులూ ఆన్‌లైన్‌ద్వారా టోక్లను బుక్‌చేసుకున్న వారికి మాత్రమే వైకుంఠద్వార దర్శనం కల్పిస్తామన్నారు. 182 గంటల్లో 164గంటలు సామాన్యభక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. జనవరి 2నుండి 8వరకు ఎస్ఇడి రోజుకు 15వేల టిక్కెట్లు, శ్రీవాణి రోజుకు వెయ్యిటిక్కెట్లు ఆన్‌లైన్‌లో జారీచేస్తామన్నారు. డిసెంబర్ 5వతేదీ ఉదయం 10గంటలకు శ్రీవాణి టిక్కెట్ కోటా, మధ్యాహ్నం 3గంటలకు ఎస్ఇడి 300 రూపాయలు దర్శన కోటా విడుదలచేస్తామన్నారు. తిరుమల,తిరుపతి,చంద్రగిరి, రేణిగుంట స్థానికులకు జనవరి 6,7,8తేదీలకు రోజుకు ఐదువేల టోకన్లు ఆన్‌లైన్‌లో జారీచేయడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 10వతేదీ స్థానికుల దర్శన కోటా విడుదలవుతుందన్నారు. భక్తులు టిటిడి సూచనలు పాటించి ప్రశాంతంగా దర్శనం చేసుకోవాలని బిఆర్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి మొదటిమూడురోజులు డిసెంబర్ 30,31, 2026 జనవరి 1వతేదీ దర్శన టోకెన్ల కోసం ఎలక్ట్రానిక్ డిప్ ద్వారానే టిటిడి టోకెన్లు జారీచేస్తుంది. నేటి నుండి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు డిసెంబర్ 1వతేదీ వరకు అవకాశం కల్పించింది. జనవరి 2వతేదీ నుండి 8వరకు పూర్తిగా ఎలాంటి టోకెన్లు.

## సాగుతున్న కల్తీ నెయ్యి కేసు! సిట్ దర్యాప్తులోనూ సూత్రధారుల గుట్టు బయటపడలేదా?

**తిరుపతి,నవంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:** తిరు మల లడ్డూప్రసాదాల తయారీకి 2020 నుండి 2024వరకు కల్తీనెయ్యి వినియోగించారనే ఆరోపణల పై సిబిఐ సిట్ అధికారుల లోతైన దర్యాప్తు కొనసాగుతూనే ఉందనేది భక్తుల్లో చర్చ మొదలైంది. కల్తీనెయ్యి బాగోతంలో కర్త,కర్మ,క్రియ ఎవరనేది దాదాపు సిట్ ఇప్పటికే ఆధారాలతో తేల్చేసినా సూత్రధారులు ఎవరనేది వెల్లడించకపోవడం వెనుక పెద్ద ట్విస్ట్ ఉందనే అనుమానాలు వినిపిస్తున్నాయి. ఈ కల్తీనెయ్యి కేసు దాదాపు పదకొండునెలలుగా లాగుతూనే ఉన్నారు. సుమారుగా 25మంది వరకు నిందితుల్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన సిట్ అధికారులు అసలు కీలక సూత్రధారులను తేల్చడంలో తాత్సారం ఎందుకనే విమర్శలు గుప్పుమంటున్నాయి. ఈ కేసులో తొలినుండి తీవ్రంగానే విచారణ సాగించిన సిట్ బృందం ఏఆర్ డెయిరీ ఎండి రాజశేఖరన్ ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబా డెయిరీకి చెందిన విపిన్‌జైన్, పోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక)సిఇఒఅపూర్వ వినయ్‌కాంత్‌చావ్డాలను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించింది. ఆపై వారిని సిబిఐ జాయింట్ డైరెక్టర్ వీరేశ్‌ప్రభు, డిఐజి మురలీరాంభా బృందం కస్టడీ.

## విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలి

**విజయవాడ, నవంబరు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యార్థులు భవిష్యత్ రాజకీయాల్లో కీలకపాత్ర వహించి, సమాజంలో మార్పు తీసుకురావాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆకాంక్షించారు. భారత రాజ్యాంగ దినోత్సవం (సంవిధాన్ దివస్) సందర్భంగా రాష్ట్ర శాసనసభ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. అంతకుముందు విద్యార్థులచే నిర్వహించిన నమూనా అసెంబ్లీ కార్యక్రమాన్ని తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... యువగళం పాదయాత్ర సమయంలో రాజ్యాంగ పుస్తకం పట్టుకుని తిరిగాను. పాదయాత్ర సమయంలో నన్ను అడ్డుకున్న పోలీసులకు ఆర్టికల్ 19లో పొందుపర్చిన రైట్ టు ఫ్రీడమ్ గురించి చెప్పాను. వారు అదంతా మాకు తెలీదు, ఎస్పీతో మాట్లాడమని చెప్పేవారు. పిల్లలకు చిన్న వయసులోనే రాజ్యాంగ హక్కులు, బాధ్యతల గురించి తెలియజేయాలని ఆనాడే నిర్ణయించుకున్నాను. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నేను రాజకీయాల్లోకి వచ్చా. నేను స్టాన్ ఫోర్డ్ ప్రవేశపరీక్ష సందర్భంగా రాసిన వ్యాసంలో ప్రజాసేవ, పాజిటివ్ లీడర్ షిప్ తో సమాజంలో మార్పువస్తుందని రాశాను. మీరు భవిష్యత్తులో ఏ వృత్తిలోకి వెళ్లినా నైతికతను వీడొద్దు. రాజకీయాల్లో పాజిటివ్ లీడర్ షిప్ తేవడానికి కృషిచేయండి. ప్రపంచంలో ఏ దేశంలోకి వెళ్లినా భారతదేశం, ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణంగా నిలబడాలని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు. "రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో 7లక్షల మందితో పోటీపడి మీరంతా ఇక్కడకు రావడం చాలా ఆనందంగా ఉంది. మనసులో ఒకటి సాధించాలి అనుకున్నపుడు దాని వెనుక ఎంతో కష్టం ఉంటుంది. ఈ కార్యక్రమాన్ని అసెంబ్లీ ప్రాంగణంలో పెట్టాలని పోరాడాను. ఈ రోజు మనం చూసింది లివింగ్ క్లాస్ రూమ్ ఆఫ్ డెమోక్రసీ. శాసనసభ కార్యకలాపాలన్నీ మీరు ఈరోజు చూశారు. అనేక ప్రశ్నలు, బిల్లులు తెచ్చారు. ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమం చేయాలన్నది మన ప్రభుత్వ లక్ష్యం. రైతుల సమస్యలు, పిల్లలు సెల్ ఫోన్ ఎడిక్షన్, యాంటీ డ్రగ్స్ క్యాంపెయిన్ పై నమూనా అసెంబ్లీలో మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు

## అయిదు బిసి కులాల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్లకు ఛైర్మన్ల నియామకం

**విజయవాడ,నవంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** అయిదు బీసీ కులాల సంక్షేమ, అభివృద్ధి కార్పోరేషన్లకు ఛైర్మన్లను నియమిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.బిసి సంక్షేమ శాఖ ఎక్స్అఫిషీమో కార్యదర్శి ఈ ఉత్తర్వులు జారీ చేసారు. భట్రాజు సంక్షేమాభివృద్ధి కార్పోరేషన్ ఛైర్మన్‌గా వెంకటేశ్వరరాజు, పెరిక సంక్షేమాభివృద్ధి కార్పోరేషన్ ఛైర్మన్‌గా వీరభద్రరావు,షేక్ సంక్షేమాభివృద్ధి కార్పోరేషన్ ఛైర్మన్‌గా షేక్ ముక్తార్, కుర్ని- కరికాల భక్తుల సంక్షేమాభివృద్ధి కార్పోరేషన్ ఛైర్మన్‌గా మినప్ప, రెడ్డిక సంక్షేమాభివృద్ధి కార్పోరేషన్ ఛైర్మన్‌గా శంకర్‌రెడ్డిని నియమించినట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

వీరు ఈ పదవుల్లో రెండేళ్ళపాటు కొనసాగుతారని వెల్లడించింది.


**నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్** NIWAS HOUSING FINANCE

(పూర్వపు) ఇండోస్టార్ హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా తెలిసినది, NHFPLగా ఇటుపై రిఫర్ చేయబడును)
నమోదిత కార్యాలయం-కార్యాలయం : యూనిట్ నెం.305, 3వ అంతస్తు, వింగ్ 2/E, కార్పొరేట్ ఎవెన్యూ, అంధేరీ ఘట్‌కోపర్ లింక్ రోడ్, చాకల, అంధేరీ (ఈస్ట్), ముంబై-400093

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్టు చట్టం 2002 సెక్షన్ 13(2) క్రింద ప్రకటన

NHFPL ఈ క్రింది రుణగ్రహీతలకు నివాసిత గృహాల యొక్క తనఖా పై గృహ రుణం/తనఖా రుణం/నిర్మాణ రుణం మంజూరు చేసింది. నేషనల్ హౌసింగ్ బ్యాంక్ / RBI యొక్క మార్గదర్శకాలు మరియు ఆదేశాలను అనుసరించి సదరు రుణాలు తిరిగి చెల్లింపులు సక్రమంగా లేకపోవడంతో వారి ఖాతాలను ఫైనల్‌గా నిరర్థక ఆస్తులుగా వర్గీకరించడమైనది. అందువలన NHFPL సర్ఫాసి చట్టం 2002 యొక్క 13(2) సెక్షన్ క్రింద హక్కులను వినియోగిస్తూ వారికి చట్ట ప్రకారం నోటీస్ జారీ చేస్తూ ఆ రుణగ్రహీతలను రుణ బకాయి మొత్తాలను వారికి ఎదురుగా పేర్కొన్న రుణ బకాయి మొత్తం డిమాండ్ నోటీస్ తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా పిలుపు ఇవ్వడమైనది. ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలకు ఇందుమూలముగా ఈ ప్రచురణ ద్వారా పిలుపు ఇచ్చునది ఏమనగా వారికి ఎదుటగా పేర్కొన్న రుణ బకాయి మొత్తాలను తదుపరి ఛార్జీలు మరియు తిరిగి చెల్లింపు వరకు అయిన వడ్డీతో సహా సదరు డిమాండ్ నోటీస్ తేదీ నుండి **60 రోజులలోగా** చెల్లించవలసినదిగా ఇందుమూలముగా పిలుపు ఇవ్వడమైనది. విఫలమైతే NHFPL చట్టప్రకారం బకాయి మొత్తం రికవరీకి ఆస్తుల స్వాధీనం, డిస్పోజ్/అమ్మకం అన్నీ లేదా ఏదైనా తదుపరి చర్యలకు ఉపక్రమించి చెల్లించవలసిన రుణ బకాయి మొత్తాన్ని రుణ ఒప్పందం యొక్క చట్ట నిబంధనల ప్రకారం తిరిగి వసూలుకు ఉపక్రమిస్తుందని ఇందుమూలముగా హెచ్చరించడమైనది. రుణగ్రహీతలు ఆస్తుల యొక్క ఓనర్‌షిప్‌పై థర్డ్ పార్టీ ఆసక్తి సృష్టించడం లేదా పరాధీనం చేయడం వంటి చర్యలు చేపట్టవద్దని హెచ్చరిస్తూ అదుపు చేయడమైనది.

| క్ర. సం. | స్థానం / రుణ ఖాతా నంబర్ | రుణగ్రహీత పేరు/సహ-రుణగ్రహీతలు/ హామీదారు | NPA తేది | డిమాండ్ నోటీస్ ప్రకారం మొత్తం & తేది |
|---|---|---|---|---|
| 1. | కడప LNCUDLAP-07230034065 | 1. మండ వెంకట రమణ (రుణగ్రహీత) 2. మండ రమేష్ (హామీదారుడు) | 07-నవంబర్-2025 | 14.11.2025 రూ.616803/- 12-నవంబర్-2025 నాటికి |
| | ఆస్తి వివరణ: సర్వే సం.434-3, కొలత 80 చ.గ. ఇ.సం.00, బీదవండ్లపల్లి గ్రామం, దాచపల్లి రామాపురం మండలం, అన్నమయ్య-516504, ఆం.ప్ర. రాష్ట్రం. అదంతా కలిగి ఉన్న ఆస్తి యొక్క మొత్తం అదంతా. ఈ క్రింది సరిహద్దులచే: దక్షిణం: ఎం. లక్ష్మిమ్మ ఇల్లు, పడమర: రోడ్, తూర్పు: శ్రీనివాసులు ఇల్లు, ఉత్తరం: ఎం. నరేష్ ఇల్లు, కొలతలు: తూర్పు-పడమర: 40 అ., ఉత్తరం-దక్షిణం: 18 అ. మొత్తం భూమి విస్తీర్ణం: 80 చ.గ. నిర్మిత ఏరియా Gf. 550 చ.అ. | | | |
| 2. | ప్రొద్దటూరు LNPROLAP-08230034457 | 1. డి. చెనమ్మ (రుణగ్రహీత) 2. దలాయి మనోహర్ (సహ-రుణగ్రహీత) | 07-నవంబర్-2025 | 14.11.2025 రూ.662643/- 12-నవంబర్-2025 నాటికి |
| | ఆస్తి వివరణ: సర్వే సం.185, ఇ.సం.2/19, యర్రగుడిపాడు గ్రామ పంచాయతీ గ్రామం, కమలాపురం మండలం, కడప-516289, కొలత చ.186.8 చ.గ లేదా 1681.2 చ.అ. ఇ.సం.2/19 వద్ద ఉన్న, యర్రగుడిపాడు గ్రామ పంచాయతీ గ్రామం, కమలాపురం మండలం, కడప, ఆం.ప్ర. రాష్ట్రం, కలిగి ఉన్న ఆస్తి యొక్క మొత్తం అదంతా. ఉత్తరంచే: శాంతమ్మ ఇల్లు, దక్షిణంచే: రోడ్, తూర్పుచే: రోడ్, పడమరచే: వరదా చెన్నయ్య ఇల్లు, ఇంటి కొలతలు: ACC తూర్పు-పడమర: 12.3 అ. ఉత్తరం-దక్షిణం: 21 అ. లేదా 186.8 చ.అ. ఇంటి కొలతలు-ACC తూర్పు-పడమర: 15 ఉత్తరం-దక్షిణం-21 లేదా 573 SFT. | | | |
| 3. | ప్రొద్దటూరు LNPROLAP-04240043112 | 1. చాలకలి జగన్ (రుణగ్రహీత) 2. చాకలి లక్ష్మీ దేవి (సహ-రుణగ్రహీత) | 07-నవంబర్-2025 | 17.11.2025 రూ.464157/- 12-నవంబర్-2025 నాటికి |
| | ఆస్తి వివరణ: సర్వే సం.290, ఇ.సం.10/145, బ్లాక్ సం.10, మోరగుడి గ్రామ పంచాయతీ & గ్రామం, జమ్మలమడుగు మండలం, కడప-516434 కొలతలు 92 చ.గ. లేదా 828 చ.అ. మోరగుడి వద్ద ఉన్న, జమ్మలమడుగు, కడప జిల్లా-516434, కలిగి ఉన్న ఆస్తి యొక్క మొత్తం అదంతా. ఈ క్రింది సరిహద్దులు: ఉత్తరంచే: రాస్తా, దక్షిణంచే: సుబ్బారాయుడు ఇల్లు, తూర్పుచే: దూదేకుల మట్టి మునెమ్మ స్థలం, పడమరచే: కుమ్మర వీర భద్రయ్య స్థలం. | | | |

ప్రదేశం : కడప, ఆంధ్రప్రదేశ్
తేది : 27.11.2025

సం/ అధీకృత అధికారి
నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున

వార్త

ధైర్యంతో అన్ని సమస్యల్ని పరిష్కరించుకోవచ్చు. కనుక ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యాన్ని కోల్పోరాదు.

-రోజర్

# 'తైల' సంస్కారం!

కారణాలేవైనా భారత్ మాత్రం అమెరికా 'తైల' సంస్కారానికి సై అనక తప్పలేదు. అంతర్జాతీయ వాణిజ్యంలో ఎవరు తక్కువ ధర ఆఫర్ చేస్తే వారితోటే వాణిజ్య సంబంధాలు మెరుగుపరుచుకుంటారు. వారి మధ్య జరిగే వాణిజ్య ఒప్పందం సజావుగా సాగేలా చూసుకుంటారు. ఏ మాత్రం బెడిసి కొట్టినా సంక్షోభం ఎదుర్కోవాల్సి వస్తుంది. రష్యా నుంచి భారత్ చమురు కొంటోందంటే అది మనకు లాభసాటి కనుకనే. అలాంటి చమురు దిగుమతుల విషయంలో అమెరికా హెచ్చరికలను తొలుత భారత్ పట్టించుకోలేదు. ససేమిరా! అంది. అయినా పట్టు వదలని విక్రమార్కుని వలె అమెరికా అధ్యక్షుడు పదేపదే 'రష్యా చమురు' భారత్‌కు రాకుండా చేయడంలో ఒక విధంగా చెప్పాలంటే భారత్‌ను మెస్మరైజ్ చేశారు. ఎంతకూ వినకపోయేసరికి ట్రంప్ దృష్టి రష్యా చమురు సంస్థలపై ఆంక్షల వైపు మళ్లించింది. 'రష్యా చమురు' నిలిపివేత ప్రతిపాదన అమెరికాదే కానీ ముందెన్నడూ నోరు విప్పని భారత్ 'రష్యా చమురు' దిగుమతులను తగ్గించేసింది. అమెరికా చమురు సంస్థలతో జత కట్టింది. పైకి చెప్పుకోకపోయినా చమురు దిగుమతుల్లో మార్పులు జరిగిపోయాయి. రష్యా ప్రధాన చమురు సంస్థలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆంక్షలు విధించిన నేపథ్యంలోనే రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలు పలు ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాయి. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉక్రెయిన్ మీద యుద్ధాన్ని ఆపకపోవడం, తన మధ్యవర్తిత్వాన్ని అవమానించడంతో ట్రంప్‌కు పుతిన్ మీద ఉన్న కోపం అంతా ఇంతా కాదు. అందుకేనేమో చమురు రవాణా చేసే సూపర్ ట్యాంకర్ల చార్జీలు అమాంతం పెంచుతున్నాట్లు వాటి యాజమాన్యం ప్రకటించినట్లు అవే ఇప్పుడు అమలులో ఉన్నాయని అంతర్జాతీయ మీడియా సంస్థ కథనాలు పేర్కొంటున్నాయి. ఈ ధరలు అయిదు రెట్లు అధికంగా ఉన్నాయి. అయినా మింగలేక కక్కలేని పరిస్థితి భారత్‌ది. ఈ ఆంక్షలు నవంబరు 21 నుంచే అమల్లోకి తెచ్చారు. రష్యాలోని రాస్‌నెఫ్ట్, లుకాయిల్‌లనే చమురు సంస్థలపై ట్రంప్ ఆంక్షలు బాగా పనిచేశాయి. చమురు రవాణా చార్జీల పెంపు చమురు దిగుమతుల మీదపడింది. ఆయా సంస్థల నుంచి చమురు కొనుగోళ్లు జరుపుతున్న భారత్, చైనా రిఫైనరీలు కాస్తంత అప్రమత్తమయ్యాయి. ఆ ఖర్చులు భరించలేక రష్యా చమురు దిగుమతులను భారత్ తగ్గించుకొంది. పరోక్షంగా రష్యా చమురుకు భారత్ మంగళం పాడినట్లే! ఇదే సమయంలో భారత్ తదితర మధ్య ప్రాచ్య దేశాలు అమెరికా ఉత్పత్తిదారుల నుంచి చమురు కొనుగోళ్లకు భారత్, చైనాలు ఉత్సుకత చూపుతున్నాయి. మధ్య ప్రాచ్యం నుంచి చైనాకు 2 మిలియన్ బ్యారెళ్ల చమురు రవాణా ధర 576 శాతం పెరిగింది. భారత్‌కు కూడా రవాణా ధర పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఐదేళ్ల తర్వాత ఈ ధర ఐదు రెట్లు పెరిగినట్లు అంచనా. ఈ యేడాది రష్యా నుంచి భారత్ ముడి చమురు దిగుమతులు రోజుకి సగటున 1.7 మిలియన్ బ్యారెళ్లగా ఉంది. కాగా డిసెంబరు, జనవరి నెలల్లో ఈ దిగుమతులుఎంతో కొంత తగ్గే అవకాశముంది. సమీప కాలంలో రోజుకు 4 లక్షల బ్యారెళ్లకు తగ్గిపోయే అవకాశముంది. రష్యా చమురు కొనుగోళ్లలో ఒక ట్రంప్‌కు తప్ప ఏ దేశానికి ఎలాంటి అభ్యంతరం లేదు. ముందుగా రష్యా ఇంధన సరఫరా వ్యవస్థపై ఉక్రెయిన్ డ్రోన్‌ల దాడి ప్రధానంగా చర్చించుకోవాలి. దాంతో డ్రోన్‌ల దాడితో రష్యాలో చమురు కొరత ఏర్పడింది. దాదాపు 5వ వంతుకు చమురు శుద్ధిసామర్థ్యం పడిపోయింది. ఈ యేడాది చివర వరకు ఆంక్షలు కొన సాగుతాయని భావించిన రష్యా తాము సరిపడ చమురు నిల్వలు సమకూర్చుకునేంతవరకు ఇంధన ఎగుమతులను నిలిపివేసింది. సరఫరా వ్యవస్థలో అంతరాయాలు కలగడంతో కొన్ని చమురు శుద్ధి కర్మాగారాలను మూసివేసేందుకు నిర్ణయించింది. రష్యా నుంచి ముడి చమురు దిగుమతి చేసుకుంటున్నారన్న ఒకే ఒక కారణం చేతభారత్‌పై అమెరికా 25 శాతం ప్రతీకార సుంకాలు విధించింది. అంతకు ముందు కూడా 25 శాతం వడ్డన. కాగా ఇదే సందర్భంలో వెనెజువెలా, ఇరాన్‌ల నుంచి చమురు దిగుమతి చేసుకునేందుకు అనుమతినివ్వాలని భారత్ అమెరికాను కోరింది. భారత్ పెద్ద ఎత్తున రష్యా చమురు దిగుమతి చేసినందునే వాటిని శుద్ధి చేసి ఇతరత్రా అమ్ముకోవడంలో భారత్‌కు ఆర్థిక లబ్ధి చేకూరుతోంది. అమెరికాకు మనపై ఇదే అక్కసు. ఇతర దేశాలు కూడా చమురు తక్కువ ధరకే అందిస్తున్నందున ప్రస్తుత పరిస్థితులలో భారత్‌కు ఎవరి దగ్గర కొన్నామంచిదే. కానీ అంతర్జాతీయ సమాజం, అగ్ర రాజ్యాధిపతి ఆదేశాల నుంచి భారత్ నవ్వులపాలుచేసుకోకుండా వ్యవహరించాల్సి ఉంది. ముడిచమురు అవసరాల్లో 7.9శాతం రష్యా నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. రష్యా చమురును పూర్తిగా ఆపేస్తే భారత్ ఇంధన బిల్లు 9 బిలియన్ డాలర్ల మేర భారమవుతుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. 2026-27లో 11.7 బిలియన్ డాలర్లకు చేరుతుంది. ఇంత సంక్లిష్ట పరిస్థితులనెదుర్కొంటూ కూడా తాజాగా భారత్‌కు రష్యా ప్రభుత్వం భారీ తగ్గింపు ఇచ్చింది. పోటాపోటీగా ఎగుమతుల వ్యూహ ప్రతివ్యూహాలు నడుస్తున్నాయి. రష్యా అయినా, అమెరికా అనుకూల చమురు దేశాలైనా, వెనెజువలా వంటి ఇతర చమురు బావులున్న దేశాలైనా భారత్‌కు సరసమైన ధరకు చమురు సరఫరా చేయగల్గుతున్నాయి. అదే యుద్ధం సద్దుమణిగితే కూడా ఇదే ధరలకు దిగుమతి ఎగుమతులు జరుగుతాయా అన్నది దైవాధీనమే!

కల్లోలంగా ఉన్న కొలనులో నిశ్చలమైన ప్రతిబింబం కనబడదు. అలాగే నిలకడలేని మనసులో శాంతి నిలబడదు.



కె. స్టాన్ స్లావిస్కి

ఘర్షణల వల్ల శక్తి వృథా అవుతుంది. హెచ్చుతగ్గులు వస్తాయి. ఆందోళనలు చెలరేగుతాయి. అశాంతి కలుగుతుంది.



ఐ.జాన్సన్

## ప్రజావాక్కు



### మార్గదర్శకాలు కావాలి

దేశ ప్రజాస్వామ్యవ్యవస్థకు మూలస్తంభంభారత రాజ్యాంగం. ఇది పౌరుల హక్కులను రక్షించడంతో పాటు, సమాజం సక్రమంగా నడవడానికి అవసరమైన బాధ్యతలను కూడా నిర్వచిస్తుంది. రాజ్యాంగం 1950 జనవరి 26న అమల్లోకి రావడం ద్వారా భారతదేశం ప్రజాస్వామ్య గణరాజ్యంగా ప్రపంచంలో ప్రత్యేకస్థానం పొందింది. రాజ్యాంగం అందించిన మౌలిక హక్కులు ప్రతి పౌరుడి వ్యక్తిత్వ వికాసానికి పునాది. వాటిలో మాటస్వేచ్ఛ, వ్యక్తిగత స్వేచ్ఛ, సమానత్వం, విద్య, మతాచారాల స్వేచ్ఛ, దోపిడీ నుండి రక్షణ వంటి హక్కులు సమాజాన్ని న్యాయ పథంలో నడిపించే శక్తులుగా నిలుస్తాయి. ఈహక్కులు పౌరులకు నిగర్వణ లేకుండా ఆలోచించే, అభివ్యక్తి చేసే స్వేచ్ఛను ఇస్తాయి. ఇవే ప్రజాస్వామ్యం సజీవంగా ఉండడానికిప్రధాన కారణం. అయితే హక్కులు ఎంత ముఖ్యమో, బాధ్యతలు అంతే ప్రాముఖ్యం కలిగినవి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### వికలాంగులకు ఉచిత బస్‌పాస్ ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్రంలోని బస్సులలో మహిళలకు ఆధార్ కార్డుతో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లుగానే వికలాంగులకు కూడా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వలన చాలా మేలు జరుగుతుంది. వికలాంగులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించినట్లయితే ప్రయాణపరంగా ఎంతో మేలు కలుగుతుంది. ప్రస్తుతం వికలాంగుల మహిళలు ఉచిత ప్రయాణం చేస్తున్నారు. పురుష వికలాంగులు వివిధ పనుల నిమిత్తం వివిధ ప్రాంతాలకు ప్రయాణం చేయడం సులువు అవుతుంది.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

### ప్రజాస్వామ్యం అంధకారంలోకి

భారతదేశంలో ప్రజాస్వామ్యం అంధకారంలోకి వెళుతుంది. ప్రజలపై రాజకీయ శక్తుల అఘాయిత్యాలు అధికమై ప్రజలు స్వేచ్ఛగా స్వతంత్రంగా నివసించలేక తీవ్ర వేదనలకు గురిఅవుతున్నారు. దేశంలోవ్యవస్థలు చట్టాలు కూడా నేరస్తులకురాజకీయశక్తులకు అనుకూలంగా వత్తాసు పలుకుతూ ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్నాయి. ప్రజలు శాంతియుతంగా స్వేచ్ఛగా బతికిననాడే ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకోవచ్చు.

- డి చాంద్ బాషా, కర్నూలు

### కల్తీ నూనె విక్రయాల జోరు

వంట నూనెల ధరలు విపరీతంగా పెరిగిపోతుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్నిజిల్లాలలో కల్తీనూనె విక్రయాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు వినవస్తున్నాయి. కొంతమంది వ్యాపారులు కల్తీనూనె విక్రయిస్తున్నారు. అధికారులు మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించి వెళ్తున్నారే తప్ప కల్తీ నూనె విక్రయాలను అరికట్టలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, వివిధ ప్రాంతాలనుంచి డ్రమ్ములు, క్యాన్లలో నూనెను వివిధ ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. అలాగే లూజు నూనెపేరుతో విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాలో గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది వ్యాపారులు నకిలీనూనెను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నాణ్యమైన నూనెనా, కల్తీనూనెనా తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడిందని వినియోగదారులు వాపోతున్నారు.

- కామిడి సతీశ్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

### భద్రతా సహకారం

ఆపరేషన్ సింధూర్ విజయానికి మూలం భారత రక్షణ వ్యవస్థలో పెరిగిన స్వదేశీ సామర్థ్యం. ఒకప్పుడు ఇతర దేశాల ఆయుధాలు, అనుమతులు, సరఫరాలపై ఆధారపడినభారత్, ఇప్పుడు స్వయంగా అభివృద్ధి చేసుకున్నహెలికాప్టర్లు, సమాచార పరికరాలు, రక్షణ సాధనాలతో వేగంగానిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకుంది. ఈస్వావలంబన వల్లే ఆపరేషన్‌లో ఎలాంటి అంతరాయం లేకుండాస్పష్టతతో, ధైర్యంతో చర్యలు చేపట్టగలిగారు. విదేశాంగ శాఖపాత్ర కూడా ఎంతో ముఖ్యమైనది. శత్రుదాడుల మధ్యం చిక్కుకున్న పౌరులను కాపాడడం కేవలం సైనిక శక్తితో సాధ్యంకాదు. భౌగోళిక అవగాహన, ఇతర దేశాలతో సమన్వయం, స్థానిక అధికారులతో నిరంతరచర్చలు, భద్రతా సహకారం రక్షణ చర్యను సజావుగా నడిపించేందుకు అవసరం.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### సేంద్రియ ఎరువులే శరణ్యం

అమెరికా ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తూ నైతికంగా ఒడిపోతోంది. అమెరికాలోదాదాపు20శాతం సాగుఅయ్యే బీటీ మొక్కజొన్నను మన నెత్తిన దిగుమతుల పేరిట రుద్దాలి అని చూస్తున్నారు. మన దేశంలో మొక్కజోన్న ఎక్కువగా పండే మహారాష్ట్ర, కర్ణాటక, వంటి రాష్ట్రాలు రైతుల నెత్తిన భారీ పిడుగు పడనుంది. మరి అమెరికాకు సందు ఇస్తే మరిన్ని దిగుమతులు మన నెత్తిన పెట్టె అవకాశం ఉంది. కాబట్టి భారత్ ఇప్పుడే జాగ్రత్త పడాలి.

- భారత అవినాష్, జనగామ

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విద్యతోపాటు క్రీడా స్ఫూర్తి అవసరమే

***తెలుగు రాష్ట్రాల్లో కూడా ప్రభుత్వాలు క్రీడలకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారునికి పోలీస్ శాఖ ఉద్యోగంలో అత్యున్నతమైన హోదా కలిగిన ప్రభుత్వ ఉద్యోగాన్ని కల్పించింది. రాజకీయంగా మాజీ క్రికెటర్ కెప్టెన్‌కు స్వతహాగా ఎమ్మెల్సీతోపాటు మంత్రి పదవి ఇవ్వడం కూడా క్రీడాకారుల ఔన్నత్యాన్ని పెంచే విధంగా ఉండడమే కాకుండా ప్రభుత్వాలు క్రీడలపై అందిస్తున్న ప్రోత్సహం క్రీడల పట్ల క్రీడాకారులకు ఆసక్తి పెరిగేందుకు ఆస్కారం ఉంటుందేమో. ఏది ఏమైనా ఆధునిక సాంకేతిక నాగరిక ప్రపంచంలో భావితరాలకు వివిధ క్రీడలపై అవగాహనతో పాటు క్రీడాకారులకు మరింత ఆదరణ పెరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.***

దాడిశెట్టి శ్యామ్ కుమార్

క్రీడలు శారీరక పెరుగుదలకు మనోవికాసానికి ఉల్లాసానికి ఉత్సాహానికి ప్రతిరూపంగా నిలుస్తున్నాయి. పూర్వకాలం నుండే బోధన అభ్యసనతోపాటు ఆటల పోటీలు నిర్విరామంగా కొనసాగుతూ వస్తున్నాయి. అయినప్పటికీ క్రీడల్లో రాణించడం వల్ల ఎలాంటి ప్రయో జనాలు ఉంటాయో అనే సంశయం చాలామందిలో లేక పోలేదు. ఆటల్లో రాణించే వారికి చదువుల్లో ఎంతో కొంత ఇబ్బంది ఉంటుందనే భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేసేవారు లేకపోలేదు. ఆటల వల్ల వచ్చే ప్రయోజనాల కన్నా చదువులపై శ్రద్ధ వహిస్తే ఎక్కువగా ఉపాధి అవకాశాలు ఉంటాయనే అపోహలు ఉన్నవారు క్రీడలో పాల్గొనడానికి వెనుకంజ వేస్తున్నారు కానీ ఆటలు వీక్షించడానికి ఆసక్తి కనబరిచే వారే అధికంగా ఉండడం విశేషం. దేశంలో అన్ని రకాల క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు అభిమానులు అధికంగానే ఉంటున్నారు. ఆధునిక సాంకేతిక నాగరిక ప్రపంచంలో వివిధ క్రీడలకు మరింత ఆదరణ పెరగాల్సిన అవసరం ఉంది. చదివే పరమార్థం అనుకునే వారు ఆటల పట్ల ఆసక్తి చూపడం అనేది చాలా తక్కువే అయినా, చదువుతూ కూడా జాతీయ అంతర్జాతీయ క్రీడా పోటీల్లో గొప్పగా రాణించిన వ్యక్తులు దేశంలో లేకపోలేదు. ప్రతిభగల క్రీడా శిక్షకుల మార్గదర్శకత్వంతో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వివిధ క్రీడాంశాల్లో అనేక మంది ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగి దేశానికి కీర్తిని తీసుకువస్తూ ప్రజల ఆదరాభిమానాలు పొందుతున్న క్రీడాకారులు దేశంలోనూ రాష్ట్రంలోనూ అనేక మంది ఉన్నారు. అలాంటి వారికి ప్రభుత్వాలు అత్యుత్తమ పురస్కారాలతో సత్కరించడంతోపాటు ప్రభుత్వ శాఖల్లో గౌరవప్రదమైన ఉద్యోగాలను కల్పిస్తుండడం విశేషం. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పలు క్రీడాంశాల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన వారి కోసం పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్ కింద ప్రభుత్వ సంస్థల్లో కూడా ప్రత్యేకంగా స్పోర్ట్స్ రిజర్వేషన్ కింద ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ అవుతున్నాయి. అంతే కాకుండా రాష్ట్రాలలో అత్యున్నతమైన ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఆయా రాష్ట్రాలకు అనుగుణంగా స్పోర్ట్స్ రిజర్వేషన్ శాతం ఉంటుంది. నేషనల్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఒలంపిక్స్ నుండి మొదలుకొని ఆసియా క్రీడలు జాతీయ అంతర్జాతీయ క్రీడల్లో క్రీడాకారులు పాల్గొనే విధంగా ప్రోత్సహిస్తూ ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. రాష్ట్రస్థాయిలో స్పోర్ట్స్ అథారిటీక్రీడాకారుల సంక్షేమానికి అభివృద్ధికి చేయూత ఇస్తూ వివిధ క్రీడాంశాల్లో క్రీడాకారులు నైపుణ్యాన్ని వెలికి తీసే విధంగా కృషి చేస్తున్నాయి. అంతర్జాతీయ జాతీయ క్రీడాకారులను తయారు చేయడానికి ఆటల్లో అనుభవజ్ఞులైన వారితో శిక్షణను అందిస్తున్నాయి. అంతర్జాతీయ క్రీడల్లో క్రీడాకారుల సామర్థ్యాలు దేశంఉనికిని ప్రపంచవ్యాప్తం చేస్తాయి. దేశంలో చాలా వరకు అథ్లెటిక్స్ సాంప్రదాయ క్రీడలు కబడ్డీ, కోకో, బ్యాడ్మింటన్



లాంటి వాటితో పాటు ప్రజాదరణ పొందిన హాకీ, క్రికెట్ ఫుట్బాల్ లాంటిఆటల్లో అత్యున్నత స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను తయారు చేసే విధంగా ప్రత్యేక స్పోర్ట్స్ స్కూల్స్‌తో పాటు జాతీయ అంతర్జాతీయ ఆటలకుకేంద్రంగా దేశంలోని అనేక రాష్ట్రాల్లో క్రీడా ప్రాంగణాలు వేదికగా ఉంటున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కూడా అత్యధికంగా అనేక క్రీడాంశాల్లో నైపుణ్యాలను కనబరిచే క్రీడాకారులు లేకపోలేదు. భారత యోజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ వివిధక్రీడల్లో క్రీడాకారుల నైపుణ్య సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు అవసరమైన శిక్షణనుఇస్తూ జాతీయ అంతర్జాతీయ క్రీడల పోటీలకు క్రీడాకారులను సన్నద్ధం చేస్తుంది. అంతేకాకుండా ప్రభుత్వాలు వివిధ క్రీడా అంశాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు అత్యుత్తమ పురస్కారాలుఅందిస్తున్నాయి. ఉన్నతమైన హోదా కలిగిటువంటి ఉద్యోగాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పోర్ట్స్ రిజర్వేషన్ కింద భర్తీ చేస్తున్నాయి. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాల స్థాయిలోనే క్రీడా వ్యవస్థను అభివృద్ధి పరిచే విధంగా విద్యార్థులు వివిధ రకాల ఆటలపట్ల ఆసక్తి చూపేందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు విశాలమైన ఆట స్థలాలతోపాటు పాఠశాలల్లో ఫిజికల్ డైరెక్టర్లను నియ మించడం జరుగుతుంది. కావలసిన క్రీడా సామాగ్రిని కొనుగోలుకు ప్రత్యేక బడ్జెట్‌ని కేటాయిస్తుంటారు. పాఠశాల లో తరగతి గదికి పరిమితమే కాకుండా క్రీడలపట్ల ఆసక్తి ఉన్నవారికి కూడా మంచి భవిష్యత్తు ఉంటుందనే వాదనలువినిపిస్తున్నా చదువులతో పాటు క్రీడలపై విద్యార్థులకుఆసక్తి పెంచడమే కాకుండా అత్యుత్తమ క్రీడాకారులను రూపొందించే విధంగా ప్రభుత్వాలు క్రీడలకొరకు ప్రత్యేకమైన బడ్జెట్‌ని కేటాయిస్తూ స్పోర్ట్స్‌కు అత్యంత ప్రాధాన్యతను ఇస్తుండడం విశేషం. రాష్ట్రస్థాయిలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఉపాధి అవకాశాలకు కొదవలేదు. బ్యాంకింగ్ రంగం, ఎయిర్ ఫోర్స్, రైల్వేలు, పోలీస్ శాఖ, ఆర్మీ తదితర కేంద్ర రాష్ట్రప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ రిజర్వేషన్ కింద ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు క్రీడాకారులకు ప్రత్యేకంగా కల్పిస్తున్నాయి. క్రీడలు పురాతన కాలం నుండి ప్రత్యేక ఆదరణ పొందుతున్నాయి. జాతీయ అంతర్జాతీయంగా దేశభక్తిని ప్రతిబింబించేలా చేయడమే కాకుండా దేశ సమైక్యత, జాతీయ వాదాన్ని బలపరుస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో ప్రజాదారణ పొందిన క్రీడాకారులకు కేంద్ర రాష్ట్రప్రభుత్వాల్లో వివిధశాఖల్లోఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉండటం ఒక ఎత్తు అయితే దేశంలో క్షేత్రస్థాయిలో కొన్నిసార్లు అనుకోనిరీతిలో చట్టసభల్లో కూడా అవకాశాలు వెతుక్కుంటూ వస్తుండడం విశే షం. తెలుగు రాష్ట్రాల్లో కూడా ప్రభుత్వాలు క్రీడలకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారునికి పోలీస్ శాఖ ఉద్యోగంలో అత్యున్నత మైన హోదా కలిగిన ప్రభుత్వ ఉద్యోగాన్ని కల్పించింది. రాజకీయంగా మాజీ క్రికెటర్‌కెప్టెన్‌కు స్వతహాగా ఎమ్మెల్సీతోపాటు మంత్రి పదవి ఇవ్వడం కూడా క్రీడాకారుల ఔన్నత్యాన్ని పెంచేవిధంగా ఉండడమే కాకుండా ప్రభుత్వాలు క్రీడలపై అందిస్తున్న ప్రోత్సహం క్రీడల పట్ల క్రీడాకారులకు ఆసక్తి పెరిగేందుకు ఆస్కారం ఉంటుందేమో. ఏదిఏమైనా ఆధునిక సాంకేతిక నాగరిక ప్రపంచంలో భావి తరాలకువివిధ క్రీడలపై అవగాహనతో పాటు క్రీడాకారులకు మరింత ఆదరణ పెరగాల్సిన ఆవశ్యకత ఎంతైనాఉంది. ●

# ప్రాణాలతో చెలగాటమాడుతున్న మెడికల్ మాఫియా!

మహమ్మద్ ఆరిఫ్

వైద్యం వ్యాపారం కాకూడదు. అది మానవ సంక్షేమానికి పునాది కావాలి. ప్రతి మెడిసిన్ మనిషి కోసం తయారు కావాలి. కానీ మనుషులను బలితీసుకోవద్దు. మెడికల్ ఎథిక్స్‌లో భాగంగా ప్రముఖ అంతర్జాతీయ వైద్య నిపుణులు చేసే వ్యాఖ్యలివి. కానీ ప్రపంచవ్యాప్తంగా దీనికి పూర్తి విరుద్ధంగా జరుగుతున్నది. ప్రతి దేశంలోనూ ఇలాంటి పరిస్థితే కనిపిస్తున్నది. ఇటీవల కరీంనగర్‌లో వెలుగుచూసిన ఘటన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలను తీవ్ర ఆందోళనలోకి నెట్టింది. వైద్య శిబిరాల పేరుతో మెడికల్ క్లినికల్ ట్రయల్స్ మాఫియా అమాయకులను టార్గెట్‌గా చేసుకొని ప్రయోగాలు చేస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతుండడం ఆందోళనకు గురిచేస్తున్నది. ఇలాంటి వాటిని నియంత్రించడంలో డీసీజీఐ వంటి సంస్థలు విఫలమవుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఏదైనా ఔషధానికి సంబంధించి ట్రయల్స్‌ను ముందుగా జంతువులపై చేస్తారు. అక్కడ సక్సెస్ అయితే ఆ తర్వాత తగిన పరిహార హామీతో, రోగి అంగీకారాన్ని తీసుకొని కఠిన నిబంధనలను అనుసరించి మనుషులపై చేస్తారు. అయితే అలాంటిదేమీ చేయకుండానే వైద్యశిబిరాలు, ఆర్థిక సాయం వంటి వాటితో మెడికల్ మాఫియా పేదలను టార్గెట్‌గా చేసుకొని డైరెక్ట్‌గా మనుషులపైనే ఔషధ ప్రయోగాలను అక్రమంగా, రహస్యంగా చేస్తున్నట్టు తెలుస్తున్నది. గతంలో కరీంనగర్‌లోని కొత్తపల్లికి చెందిన కొందరు యువకులు ఔషధ ప్రయోగాల్లో పాల్గొని తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అందులో ఒకరు మతిస్థిమితం కోల్పోయినట్టు అతడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈఅంశం 2017లో సంచలనం సృష్టించింది. తాజాగా కూడా ఓ వ్యక్తి తనపై ఔషధ ప్రయోగాలు చేశారని పోలీసులను ఆశ్రయించడం చర్చనీయాంశంగా మారింది. అయితే వెలుగులోకి రాని ఘటనలు ఎన్నో ఉంటాయనే చర్చ ఉన్నది. క్లినికల్ ట్రయల్స్ ద్వారా ఔషధాలు, టీకాలు కనుగొనడం మానవాళికి మేలు చేసినా, నైతిక నియమాలు పాటించకుండా చేసిన ప్రయోగాలుఎంతో ప్రాణనష్టాన్ని, వైకల్యాలను మిగిల్చాయి. 2006లో లండన్‌లో ఆరుగురు ఆరోగ్యకరమైన వాలంటీర్లకు యాంటీబాడీ



డ్రగ్ ఇచ్చిన కొన్ని నిమిషాల్లోనే వారి రోగనిరోధక వ్యవస్థ నాశనం అయింది. వీరంతా బతికినా, తీవ్రమైన శారీరక వైకల్యం, అవయవాల వైఫల్యానికి గురయ్యారు. 2016లో ఫ్రాన్స్‌లో జరిగిన న్యూరో డిసార్డర్ డ్రగ్ ట్రయల్‌లో ఆరుగురు వాలంటీర్లలో ఒకరు మరణించగా, మిగిలిన ఐదుగురు మెదడు సంబంధిత రోగాలకు గురయ్యారు. ఇలా ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది వేలాది మంది మరణిస్తూనే ఉన్నారు. భారతదేశం గ్లోబల్ క్లినికల్ ట్రయల్స్ రాజధానిగా మారుతున్నదనే ఆందోళన వ్యక్తమవుతున్నది. తక్కువఖర్చు, అధిక సంఖ్యలో పేద జనాభా, తగినంత అవగాహన లేమి దీనికి ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్ సీఓ) డేటా ప్రకారం 2021 నుంచి 2025 జులై వరకు దేశవ్యాప్తంగా 1,705 మంది క్లినికల్ ట్రయల్స్‌లో మరణించారు. ఇది రోజుకు ఒక మరణానికి సమానం. అంతేకాకుండా ఏడువేల మందికి పైగా తీవ్రఅస్వస్థతకు గురికాగా, చాలా మంది శాశ్వత వికలాంగులుగా మారారు. 2005 నుంచి 2012 మధ్యకాలంలో 2600 మందికిపైగా మరణించారు. సుమారు 12వేల మంది తీవ్రమైన దుష్ప్రభావాలకు గురయ్యారు. వీటిలో 80 మరణాలు, 500కు పైగా తీవ్ర దుష్ప్రభావాలు నేరుగా మనుషులపై ఔషధాలు ప్రయోగించడం కారణంగానే జరిగాయని తేలింది. 2005-2013 వరకు 2644 మంది మరణించగా, ఇందులో కేవలం17మందికి మాత్రమే పరిహారం అందింది. 2010లో గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 24 వేల మంది బాలికలపై హెచ్‌పీవీ వ్యాక్సిన్ ట్రయల్స్ జరగ్గా ఏడుగురు మరణించడం తీవ్రవివాదాన్ని సృష్టించింది. తల్లిదండ్రుల నుంచి సమ్మతి లేకుండా, నైతిక నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలు వచ్చాయి. అక్రమ క్లినికల్ ట్రయల్స్ ప్రాణాలను బలి తీసుకోవడం, వైకల్యాలను మిగల్చడం మాత్రమే కాకుండా సమాజంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతాయి. పేద, సాధారణ ప్రజలు వైద్యం చేయించుకోవడానికి కూడా భయపడే పరిస్థితి వస్తుంది. వైద్యులు, ఆస్పత్రులపై నమ్మకం పోతుంది. సరికొత్త ఔషధాలు, చికిత్సలు మానవాళికి అవసరం. కానీ వాటి కోసం చేసే ప్రయోగాలు నైతిక నియమాలు, మానవ హక్కుల పరిధిలోనే జరగాలి. అమాయకుల ప్రాణాలను పణంగా పెట్టి సంపాదించే లాభాల కంటే మానవత్వం, భద్రతకే అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. అక్రమాలకు పాల్పడే మెడికల్ మాఫియాను కఠినంగా శిక్షించడం, క్లినియర్ ట్రయల్స్ నియంత్రణను మరింత పటిష్టం చేయడం తక్షణ కర్తవ్యం. ●

# బీసీలపై కపట ప్రేమ ఇంకా ఎన్నాళ్లు?

డా. కావలి చెన్నయ్య

ఈ మధ్య తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థలు, విద్యా, ఉపాధి, ఉద్యోగాలలో ఇవ్వదలచిన 42 శాతం రిజర్వేషన్లను బీసీ వ్యతిరేకులు కోర్టు ద్వారా అడ్డుకున్నారు. రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్డ్‌లో చేర్చితే తప్ప ఈ రిజర్వేషన్లకు రక్షణ ఉండదు. 56 శాతం పైగా ఉన్న బీసీలకు 60 శాతం రిజర్వేషన్ కల్పించినప్పుడే సమన్యాయం జరుగుతుంది. ఎందుకంటే 8 శాతంగా ఉన్న సామాజిక ఉన్నత వర్గాల వారికి 10 శాతం ఇచ్చారుకాబట్టి. జనాభా దామాషా ప్రకారం వారి వారి జనాభాలకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పిస్తే సమాజంలో అందరికీ సమన్యాయం జరిగినట్లే. ఇప్పుడు ప్రభుత్వాన్ని నడిపిస్తున్న పార్టీ మేము బీసీలకు స్థానికసంస్థలలో 42శాతం సీట్లు ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. అన్ని రాజకీయపార్టీలు నిజంగా బీసీలకు న్యాయం చేయాలంటే అందరూ కలిసి పార్లమెంటులో చట్ట సవరణ చేసి చట్ట సభలో కూడా బీసీలకు రిజర్వేషన్లు కల్పించినప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుంది. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నడిపిస్తున్న పార్టీ అది నాయకుడు తెలంగాణలో స్థానిక సంస్థలలో బీసీలకు కల్పిస్తామన్న 42 శాతం రిజర్వేషన్లను హైకోర్టు నిలిపి వేసినప్పుడు ఎందుకు పార్లమెంటులో ప్రస్తావించలేదు. దీనిని బీసీలు గమనించాలి. స్వతంత్ర భారతదేశ సామాజిక రాజకీయ ఆర్థిక పురోగాభివృద్ధిని పరిశీలిస్తే న్యాయం స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం అనే నాలుగు స్తంభాలు భారత రాజ్యాంగానికి మూలాధారం. అధికరణ 14,16 ప్రకారం ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు కల్పించాలని భారత రాజ్యాంగంలో పొందుపరచబడింది. దేశ శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలను పరిశీలిస్తే సమానత్వం బోధించే ఏ వ్యవస్థలో కూడా సమానత్వం మచ్చుకైన కనిపించదు. నేటి లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్‌లను తెచ్చి సమస్త వ్యవస్థలను సామాజిక ఉన్నత వర్గాల చేతుల్లోకి తీసుకున్నారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే నేటివరకు ఉత్పత్తి కులాలకు ఉపాధి కరువవడం, ఆ ఉత్పత్తి వ్యవస్థలు ఉత్పత్తులు అన్నీ బడుగు బలహీన వర్గాలకు అందకుండా కొందరి చేతుల్లో గుత్తాధిపత్యానికి గురవుతున్నాయి. వివిధ రాష్ట్రాలలో కొన్ని కులాలు రాష్ట్ర బీసీ జాబితాలో ఉన్న కేంద్ర ఓబీసీ జాబితాలో మాత్రం లేవు అంటే వీరికి కేంద్ర ప్రభుత్వ విద్యా ఉద్యోగాలలోఓబీసీ రిజర్వేషన్లు వర్తించవు. అన్ని రాష్ట్రాలలో కలిపి సుమారుగా 3150 బీసీ కులాలు ఉంటే కేంద్ర జాబితాలో 2479 కులాలు మాత్రమే ఉన్నాయి. ఇక్కడ కేంద్రం లెక్కల ప్రకారం ఓబీసీలు 52శాతం కానీ రాష్ట్రాల లెక్కల ప్రకారం బీసీలు 56శాతం. దీనంతటి కారణం కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ లేకపోవడంగా భావించవచ్చు. రాజ్యమేలుతున్నది





ఉన్నత సామాజిక వర్గం కాబట్టి జనగణన చేయకుండానే 8 శాతం ఉన్న ఉన్నత సామాజిక వర్గాలవారికి 10శాతం రిజర్వేషన్లను ఈడబ్ల్యూఎస్ (ఎకనామికల్లి వీకర్ సెక్షన్స్) పేరు మీదుగా కేంద్రం ప్రత్యేకంగా 103వ రాజ్యాంగ సవరణ చేసి కల్పించారు. దేశ జనాభాలో 56శాతంకి పైగా ఉన్న బీసీలకు కేవలం 27శాతం మాత్రమే రిజర్వేషన్లు దక్కడం ఎంత అన్యాయం. బీసీలు రిజర్వేషన్లు పెంచమని అడిగితే ప్రతిభ పాడైపోతుందని మొత్తుకున్నారు. కానీ ఉన్నత సామాజిక వర్గాల వారి విషయానికొస్తే వారు రిజర్వేషన్ల కింద లబ్ధిపొందిన ప్రతిభ పాడుకాదు. ఇక ఉన్నత న్యాయస్థానాలలో ఉన్నది వారే కాబట్టి రిజర్వేషన్లు 50 దాటరాదని తీర్పునిచ్చుకున్నారు. ఈడబ్ల్యూస్ రిజర్వేషన్ల విషయానికి వస్తే మాత్రం ఏ న్యాయ పరిమితులు వర్తించవు. అందుకే ఉన్నత న్యాయస్థానాలలో కొలీజియం వ్యవస్థను ఎత్తివేసి బీసీలకు రిజర్వేషన్లు కల్పించినప్పుడు మాత్రమే బీసీలకు న్యాయం జరుగుతుంది. లేనియెడల ఉన్నత న్యాయస్థానాలలో బీసీల ప్రాతినిధ్యం శూన్యం. ఈడబ్ల్యూఎస్ పొందడానికి వర్తించే అర్హతలను పరిశీలిస్తే కుటుంబ ఆదాయం 8 లక్షల లోపుఉండాలి( అది ఎనిమిది లక్షల ఆదాయం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ ఎవరైనా ఇప్పటివరకు ఉన్న లెక్కల ప్రకారం ఆదాయపు పన్ను కట్టాల్సిందే), 5 ఎకరాల వరకు వ్యవసాయ భూమి ఉండవచ్చు. నివాస స్థలం మున్సిపాలిటీలలో 1000 అడుగుల వరకు ఉండవచ్చు, మునిసిపాలిటీ బయట ఉన్న నివాస స్థలం 200 గజాల వరకు ఉండవచ్చు. ఆస్తి పరిమితులు రాష్ట్రాలను బట్టి మారవచ్చు. కానీ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఈ కోటా కింద రిజర్వేషన్ సదుపాయాలు పొందడానికి వీలు లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో బీసీల కంటే తక్కువ మార్కులు వచ్చినా విద్యా, ఉద్యోగాలలో ఉన్నత సామాజిక వర్గాల వారికి మాత్రం ప్రాతినిధ్యం దక్కుతూనే ఉన్నది. పుడమి పైనున్న సమస్త సిరిసంపదలను సృష్టిస్తూ 80-90శాతం పైగా ఉన్న సబ్బండ వర్గాలకు సంబంధించిన అన్ని కులాలకు లేదా ఏకులానికి సరియైన కనీస ప్రాతినిధ్యం ఏ వ్యవస్థలో కూడాలేదు. అన్నీ ఉన్నత సామాజికవర్గాల చేతుల్లోనే బంధించబడ్డాయి. ఆర్థిక, ఉద్యోగ ఉపాధి, రాజకీయ, పారిశ్రామిక, సేవా లాంటి రంగాలు పూర్తిగా వారిగుప్పిట ఉన్నాయి. బీసీలకు తాత్కాలికంగా గొర్రెలు, బర్రెలు, చేపలు, పనిముట్లు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నాయి ప్రభుత్వాలు. ఫలితంగా బీసీల ప్రశ్నించే తత్వానికి పాతరేస్తున్నారు. ఎట్టి కష్టం ఎంత చేసినా వేసారి పోవడమే తప్ప ఒరిగిందేమీ లేదు. బీసీ నాయకులు, మేధావులు రాజ్యాధికారమే పరమావధిగా పనిచేసినప్పుడు కొండంత బీసీ బలగం అండగా నిలుస్తూ బీసీ వ్యతిరేకులు సృష్టించే గండాల సుడిగుండాల నుండి దాటిస్తారు. లభ్యమవుతున్న సమాచారం మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1956 నుంచి 2014 వరకు శాసన సభకు జరిగిన ఎన్నికల్లో సుమారు 1375 మంది ఎమ్మెల్యేలు అయితే అందులో రెడ్లు 658, కమ్మలు 549 కానీ రాష్ట్ర జనాభాలో బీసీలు 56 శాతంగా ఉండి 139కులాలు కలిగి కేవలం 498 మంది మాత్రమే! హైదరాబాద్ రాష్ట్రం, ప్రత్యేక ఆంధ్ర, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో బీసీని ముఖ్యమంత్రి కానివ్వలేదు. శాసనమండలి సభ్యుల, లోక్సభ సభ్యుల, రాజ్య సభ సభ్యుల విషయంలో బీసీల పరిస్థితి ఇంకా దారుణం. అందుకే బీసీలు మేలుకొని తమ హక్కులకై ఐకమత్యంగా అలుపెరగని పోరాటం చేయాలి. ●



# పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ జైలులో హత్యకు గురయ్యారా?

## ఆడియాలా జైలువద్ద ఇమ్రాన్ సోదరీమణులపై పోలీసుల దాడి

### పిటిఐ కార్యకర్తలను కూడా చెల్లాచెదురుచేసిన జైలు అధికారులు

### హత్యచేసారనే నిష్పాక్షిక విచారణ జరపాలని సోదరీమణుల డిమాండ్

**రావల్పిండి, నవంబరు 26:** పాక్ మాజీ ప్రధాని, పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ పార్టీ అధినేత హత్యకు గురయ్యారంటూ ప్రచారం జరుగుతున్నది. జైలులో ఉన్న ఆయనను హింసించి చంపారని నిఘా సంస్థ ఐఎస్ఐ, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ ఈ కుట్రకు పాల్పడ్డారన్న వార్తలు వైరల్‌గా మారాయి. అయితే, ఈ వార్తలో ఎంత వరకు నిజం ఉన్నది అన్నది మాత్రం తెలియలేదు. పాక్ ప్రభుత్వం ఈ అంశంపై స్పందించలేదు. ఇందుకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. అయితే, ఇమ్రాన్ ఖాన్ సోదరిమణులు, ఇతర కుటుంబ సభ్యులను మంగళవారం జైలులోకి అనుమతించకపోవడంతో అనుమానాలకు తావిచ్చింది. ఇమ్రాన్ ముగ్గురు సోదరీమణులు ఆయన్ను కలిసేందుకు ప్రయత్నించారు. ముఖ్యంగా నొరీన్ ఖాన్, అలీమా ఖాన్, ఉజ్మా ఖాన్‌లు సోదరుడి కోసం జైలు వద్దకు వెళ్లగా తమపై పోలీసులు తీవ్రంగా దాడి చేశారని ఆరోపించారు. రావల్పిండిలోని అదియాలా జైలు వెలుపల తమను, తమ పార్టీ పాకిస్థాన్ తెహ్రీక్‌ఎఇన్సాఫ్ (పిటిఐ) మద్దతుదారులను పోలీసులు హింసించారని ఆరోపించారు. గత మూడు వారాలకు పైగా తమ సోదరుడిని కలిసేందుకు అనుమతించకపోవడంతో ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన చెందుతూ తాము శాంతియుతంగా నిరసన తెలియజేసినట్లు వివరించారు. కానీ పంజాబ్ పోలీసులు మాత్రం తమపై ఉద్దేశపూర్వకంగానే దాడి చేశారని ఇమ్రాన్ ఖాన్ సోదరీమణులు ఆరోపించారు. ఈ ఘటనపై పంజాబ్ పోలీసు చీఫ్ ఉస్మాన్ అన్వర్‌కు రాసిన లేఖలో ఈ హింస ఘోరమైనది పణాళికాబద్ధమైనది, ఎలాంటి ప్రేరణ లేకుండా పోలీసు సిబ్బందితో నిర్వహించబడింది" అని పేర్కొన్నారు. నిరసన తెలుపుతున్న సమయంలో రోడ్లను గానీ, ప్రజల కదలికలను గానీ తాము అడ్డుకోలేదని నొరీన్ నియాజీ తెలిపారు. అలాగే ఎలాంటి హెచ్చరిక లేకుండా ఆ ప్రాంతంలోని వీధి దీపాలు అకస్మాత్తుగా ఆపేశారు. ఉద్దేశపూర్వకంగా ఆ ప్రాంతాన్ని చీకట్లోకి నెట్టారు. దాని తర్వాత పంజాబ్ పోలీసు సిబ్బంది ఘోరమైన, ప్రణాళికాబద్ధమైన దాడి చేశారు" అని నొరీన్ వివరించారు. 71 ఏళ్ల తనను జుట్టు పట్టుకుని బలంగా నేలపైకి తోసి, రోడ్డుపై లాక్కెళ్లారని, దీని ఫలితంగా తనకు గాయాలు అయ్యాయని నొరీన్ తీవ్రంగా ఆరోపించారు. జైలు బయట ఉన్న ఇతర మహిళలను కూడా చెంపదెబ్బలు కొట్టి, ఈడ్చి పారేశారని పేర్కొన్నారు. మరోవైపు బహుళ కేసుల్లో దోషిగా తేలిన పీటీఐ చీఫ్ ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి అదియాలా జైలులో ఉన్నారు. అయితే తాజాగా ఆయనకు నెల రోజులకు పైగా అప్రకటిత సమావేశ నిషేధం విధించారు. ఇది చాలదన్నట్లుగా ఆయన చనిపోయారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. కానీ దీనిపై జైలు అధికారులు మాత్రం అస్సలే స్పందించడం లేదు.

# యూరి జలవిద్యుత్ కేంద్రంపై పాక్ దాడిని తిప్పికొట్టిన సిఐఎస్ఎఫ్

### సాహస వీరులకు సిఐఎస్ఎఫ్ డిజి పురస్కారాలు



**జమ్మూకాశ్మీర్, నవంబరు 26:** భారత భద్రతా దళాల వీరత్వం, ధైర్యసాహసాలకు సంబంధించిన మరో ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సుమారు ఆరు నెలల క్రితం జమ్మూకశ్మీర్‌లోని ఉరి జల విద్యుత్ కేంద్రంపై పాకిస్థాన్ జరిపిన దాడిని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) సిబ్బంది సమర్థంగా తిప్పికొట్టారు. ఈ ఘటనలో అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించి, 250 మంది పౌరుల ప్రాణాలను కాపాడిన 19 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బందికి డైరెక్టర్ జనరల్ (డీజీ) డిస్క్ పురస్కారాలు ప్రకటించడంతో ఈ విషయం వెలుగుచూసింది. ఈ ఏడాది మే 7న పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుని భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. దీనికి ప్రతీకారంగా పాకిస్థాన్, నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంబడి భీకరంగా కాల్పులు జరిపింది. బారాముల్లా జిల్లాలోని జీలం నదిపై ఉన్న ఉరి జల విద్యుత్ ప్రాజెక్టును ధ్వంసం చేసేందుకు డ్రోన్లతో దాడికి పాల్పడింది. ఈ దాడిని పసిగట్టిన కమాండెంట్ రవి యాదవ్ నేతృత్వంలోని 19 మంది సీఐఎస్ఎఫ్ బృందం వెంటనే అప్రమత్తమైంది. ప్రాజెక్టు పరిసరాల్లోకి ప్రవేశించిన శత్రు డ్రోన్లను జామర్లు, కాల్పులతో కూల్చివేశారు. అదే సమయంలో ప్రాజెక్టు సమీపంలోని నివాసాలపై పాక్ సైన్యం మోర్టార్ షెల్స్‌తో దాడి చేయడంతో, సీఐఎస్ఎఫ్ సిబ్బంది ప్రాణాలకు తెగించి సహాయక చర్యలు చేపట్టారు. సమీపంలోని ఇళ్లకు వెళ్లి నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) సిబ్బందితో పాటు 250 మంది పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ఆపరేషన్‌లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. గాఢ నిద్రలో ఉన్న కుటుంబాలను నిద్రలేపి, జరుగుతున్నది వివరించి తరలించడమే మాకు కాస్త కష్టంగా అనిపించిందని ఈ పురస్కారం అందుకున్న వారిలో ఒకరైన ఏఎస్ఐ గుర్జీత్ సింగ్ తెలిపారు. 2016లో ఉరి సైనిక స్థావరంపై జరిగిన దాడి తర్వాత ఈ ప్రాంతంలో మరో పెద్ద దాడిని సీఐఎస్ఎఫ్ సిబ్బంది తమ ధైర్యంతో నివారించారు.




## టెక్కీల్లో పెరుగుతున్న అభద్రత..లేఆఫ్‌ల దారిలో హెచ్‌పి!

**న్యూఢిల్లీ, నవంబరు 26:** టెక్ రంగంలో ఉద్యోగాల కోతల పరంపర కొనసాగుతూనే ఉంది. ఆర్థిక మాంద్యం భయాలతో మొదలైన ఈ ప్రక్రియ, ఇప్పుడు కృత్రిమ మేధ (ఏఐ) వైపు మళ్లుతోంది. తాజాగా, ప్రపంచ ప్రఖ్యాత పీసీ, ప్రింటర్ల తయారీ సంస్థ హెచ్‌పీ (హెచ్‌పి) కూడా భారీ లేఆఫ్‌లను ప్రకటించి టెక్ వర్గాల్లో కలకలం రేపింది. రాబోయే రెండు, మూడేళ్లలో సుమారు 6 వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు కంపెనీ అధికారికంగా వెల్లడించింది. 2028 ఆర్థిక సంవత్సరం నాటికి తమ ప్రపంచవ్యాప్త ఉద్యోగుల సంఖ్యను 4,000 నుంచి 6,000 వరకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు హెచ్‌పీ తెలిపింది. ఈ కోతలు సంస్థ మొత్తం సిబ్బందిలో దాదాపు 10 శాతానికి సమానం. కంపెనీ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడంతో పాటు, ఉత్పత్తుల అభివృద్ధిలో కృత్రిమ మేధ వినియోగాన్ని గణనీయంగా పెంచేందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు యాజమాన్యం తెలిపింది. గతేడాది ఆర్థిక అనిశ్చితి కారణాలతో వేలాది మందిని తొలగించిన టెక్ కంపెనీలు, ఇప్పుడు ఏఐని అందిపుచ్చుకునే క్రమంలో మళ్లీ ఉద్యోగులపై వేటు వేయడం ఆందోళన కలిగిస్తోంది. హెచ్‌పీ లేఆఫ్‌ల ప్రకటన వెలువడిన వెంటనే మార్కెట్‌లో ఆ కంపెనీ షేర్ల విలువ పడిపోవడం గమనార్హం. ఈ పరిణామం టెక్ ఉద్యోగుల్లో నెలకొన్న అభద్రతాభావాన్ని మరింత పెంచుతోంది. ప్రపంచ ప్రఖ్యాత పీసీ, ప్రింటర్ల తయారీ సంస్థ హెచ్‌పీ 2028 నాటికి ప్రపంచవ్యాప్తంగా 6 వేల మంది ఉద్యోగులను తొలగించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపింది. కంపెనీలోని మొత్తం ఉద్యోగుల్లో సుమారు 10లేదా 12 శాతంగా లేఆఫ్‌లుంటా యని అంచనా. ప్రొడక్ట్ డెవలప్ మెంట్, ఇంటర్నల్ ఆపరేషన్స్, కస్టమర్ సపోర్ట్ వంటి విభాగాల్లో ఈ కోతలు ఉండనున్నట్లు సంస్థ సీఈఓ ఎన్రిక్ లారెస్ వెల్లడించారు. హెచ్‌పీకి ప్రపంచ వ్యాప్తంగా 58వేల మంది ఉద్యోగులున్నారు.

# రంగంలోకి దిగిన రాహుల్ గాంధీ

**బెంగళూరు, నవంబరు 26:** కర్ణాటకలోకాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు పూర్తయిన వేళ పార్టీలో సంక్షోభం మరింత ముదిరింది. సీఎం కుర్చీ కోసం అంతర్గత కుమ్ములాటలు మరింత తీవ్రమయ్యాయి. అధికార మార్పిడిపై ఉధృతంగా ఊహాగానాలు సాగుతున్న నేపథ్యంలో నాయకత్వ మార్పు చుట్టూ జరుగుతున్న ప్రచారానికి కాంగ్రెస్ అధిష్ఠానం ముగింపు పలికేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. డిసెంబర్ 1న పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభానికి ముందే కర్ణాటకలో రాజకీయ పరిస్థితులపై కాంగ్రెస్ హైకమాండ్ ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. సీఎం మార్పు అంశం నేపథ్యంలో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే రాహుల్ గాంధీతో చర్చలు జరపనున్నట్లు తెలిసింది. ఈ చర్చ తర్వాత సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వీరిద్దరినీ ఈనెల 28 లేదా 29న ఢిల్లీకి పిలిపించే అవకాశం ఉందని సమాచారం. మరోవైపు సీఎం మార్పుపై సిద్ధరామయ్య, డీకే చేసిన ప్రకటనలపై ఖర్గే తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినట్లుగా సదరు వర్గాలు తెలిపాయి. దీంతో ఈ వ్యవహారాన్ని తొందరగా ముగించాలని హైకమాండ్ భావిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభానికి ముందే దీనిపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి పీఠం కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య పోరు కొనసాగుతుండగా ఉప ముఖ్యమంత్రికి పదోన్నతి కల్పించాలని కోరేందుకు ఆయన మద్దతుదారులు ఢిల్లీకి క్యూ కడుతున్నారు. కాగా పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తే ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతానని సిద్ధరామయ్య సోమవారం వెల్లడించారు. ఇప్పటికే ఢిల్లీలో మకాం వేసిన కొందరు ఎమ్మెల్యేలకు అదనంగా

## రెండు వర్గాలతో విస్తృతంగా చర్చలు

డీకే శిబిరానికి చెందిన మరో ఆరుగురు ఎమ్మెల్యేలు సోమవారం ఢిల్లీ చేరుకోగా మరికొందరు కూడా హస్తిన బాట పట్టనున్నట్లు తెలుస్తోంది. కాగా నాయకత్వ మార్పుపై పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందని, దాన్ని తనతోపాటు డిప్యూటీ సీఎం కూడా అంగీకరించక తప్పదని సిద్ధరామయ్య విలేకరులకు చెప్పారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి మేము కట్టుబడి ఉంటాం. రేసులోకి హోం మంత్రి నవంబర్ 20వ తేదీతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లు పూర్తి కావడంతో ముఖ్యమంత్రి మార్పు జరగవచ్చని జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. మరోవైపు తాను కూడా ముఖ్యమంత్రి రేసులో ఉన్నానంటూ మాజీ కేపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర హోం మంత్రి జీ పరమేశ్వర ప్రకటించడం కలకలం రేపుతోంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాటలు తనకు వేద వాక్యం లాంటివని శివకుమార్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు గురించి జోరుగా ఊహాగానాలు సాగుతున్న



నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయిస్తే తాను ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతానని, అధిష్టానం తీసుకునే ఏ నిర్ణయానికైనా తాను, డీకే శివకుమార్ కట్టుబడి ఉండాల్సి ఉంటుందని సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలపై సోమవారం విలేకరులు ప్రశ్నించినపుడు తాను కూడా ముఖ్యమంత్రి ప్రకటనతో ఏకీభవిస్తున్నానని డీకే చెప్పారు.



# ఢిల్లీ పేలుడు కేసులో మరొకరి అరెస్టు

### ఉమర్‌నబీకి రవాణా వసతులు కల్పించిన వ్యక్తిని పట్టుకున్న ఎన్ఐఎ

**న్యూఢిల్లీ, నవంబరు 26:** ఢిల్లీ పేలుళ్లకేసులో ఎన్ఐఎ మరొకరిని అరెస్టుచేసింది. ఆత్మాహుతి బాంబరు ఉమర్ ఉన్‌నబీకి రవాణా సౌకర్యాలు, ఇతర మౌలికవసరులు కల్పించినట్లుగా భావించిన 32 ఏళ్ల ఫరీదాబాద్ నివాసిని అరెస్టు చేసింది. మహ్మద్ సోయబ్ అనే ఈ యువకుడు ఫరీదాబాద్‌లోని ధౌజ్‌గ్రామస్తుడు. ఆత్మాహుతి బాంబర్ నబీని కొన్ని రోజులపాటు వసతి కల్పించడంతోపాటు ఎంతో కష్టమైన రవాణా ఏర్పాట్లుకూడా పర్యవేక్షించాడు. ఉమర్‌ఉన్‌నబీ కదలికలు మొత్తంపర్యవేక్షించినట్లు తేలింది. కాగా ఢిల్లీ పేలుళ్లకేసుకు సంబంధించి ఇప్పటివరకూ ఆరుగురిని అరెస్టుచేసిన ఎన్ఐఎ తాజాగా ఏడో వ్యక్తిని అరెస్టుచేసింది. మంగళవారం రాత్రి ఎన్ఐఎ బృందాలు అందిన సమాచారమేతో సోయబ్‌ను స్థానిక పోలీసుల సహకారంతో అదుపులోకి తీసుకున్నారు. ఆతనిపై కేసు నమోదుచేసినట్లు ఎన్ఐఎ వెల్లడించింది. ఎలాంటి అడ్డంకులు లేకుండా ఉమర్‌నబీ రాకపోకలకు సహకరించాడు. ఇపుడు ఎన్ఐఎ వీరందరికీ బయటి శక్తుల సహకారం అందుతుందా అన్న అంశంపై దృష్టిపెట్టింది. పాకిస్తాన్ జైషే వంటి ఉగ్రసంస్థల సహకారం ఉన్నట్లుగా ముందునుంచే ఎన్ఐఎ అనుమానిస్తోంది. ఆదిశగా కూడా దర్యాప్తును వేగవంతంచేసారు. ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్; జమ్ము కాశ్మీర్‌లలో దాడులు నిర్వహించారు. డిజిటల్ ఫరికరాలు, కమ్యూనికేషన్ రికార్డులు, చేతిరాత పత్రాలు స్వాధీనంచేసుకున్నారు.

## పాన్ మసాలా పారిశ్రామికవేత్త చౌరాసియా

# కోడలు ఆత్మహత్య



**న్యూఢిల్లీ,నవంబరు 26:** దేశ రాజధాని ఢిల్లీలో ఓ బిజినెస్ టైకూన్ కోడలు ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. పాన్ మసాలా బ్రాండ్‌తో పాపులర్ అయిన ప్రముఖ వ్యాపారవేత్త కమల్ కిషోర్ చౌరాసియా కోడలు దీప్తి చౌరాసియా (40) దక్షిణ ఢిల్లీలోని నివాసంలో బలవన్మరణానికి పాల్పడింది. దీప్తి చౌరాసియా కమల్ కిషోర్ కుమారుడు హర్‌ప్రీత్‌ను 2010లో వివాహం చేసుకుంది. ఈ జంటకు 14 ఏళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. అయితే, నిన్న మధ్యాహ్నం సమయంలో ఆమె తన నివాసంలో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడినట్లు తెలిసింది. ఆమె గదిలో సూసైడ్ నోట్ కూడా లభించింది. అందులో తన మరణంతో ఎవరికీ సంబంధం లేదని రాసింది. అంతేకాదు, 'రిలేషన్‌లో ప్రేమ, నమ్మకం లేకపోతే, ఇక జీవితానికి అర్థం ఏముంది?' అని తన నోట్‌లో రాయడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సూపర్‌బగ్స్ కట్టడికి నేషనల్ యాక్షన్ ప్లాన్!

**న్యూఢిల్లీ, నవంబరు 26:** ప్రజారోగ్యానికి పెను సవాలుగా మారుతున్న యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) సమస్యను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభు త్వం పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకొచ్చింది. శక్తిమంతమైన యాంటీబయాటిక్స్‌కు కూడా లొంగని మొండి సూక్ష్మజీవుల (సూపర్‌బగ్స్) వ్యాప్తిని అరికట్టడమే లక్ష్యంగా 2025-29 కాలానికి 'నేషనల్ యాక్షన్ ప్లాన్ ఆన్ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఎన్‌ఏపీఏఎంఆర్) 2.0'ను విడుదల చేసింది. ఈ ప్రణాళిక ప్రధానంగా ఆరు కీలక అంశాలపై దృష్టి సారించనుంది. ఈ కొత్త విధానంలో భాగంగా యాంటీబయాటిక్స్ వాడకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించనున్నారు. పాఠశాల విద్యార్థుల నుంచి ఆరోగ్య కార్యకర్తల వరకు అందరికీ దీనిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. అదే సమయంలో, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయాటిక్స్ అమ్మడాన్ని పూర్తిగా నిషేధించనున్నారు. దేశవ్యాప్తంగా ల్యాబ్‌ల సామర్థ్యాన్ని పెంచి, ఏ ప్రాంతంలో ఏ బ్యాక్టీరియా మందులకు లొంగడం లేదనే దానిపై నిఘా చేస్తారు. ఆసుపత్రుల్లో పరిశుభ్రతా ప్రమాణాలు పెంచడం ద్వారా ఇన్ఫెక్షన్ల వ్యాప్తిని అరికట్టాలని లక్ష్యం పెట్టుకున్నారు. దీనివల్ల అనవసర మందుల వాడకం తగ్గుతుంది. పాత మందులు పనిచేయని కారణంగా, కొత్త యాంటీ బయాటిక్‌లు, టీకాలు, డయాగ్నస్టిక్ కిట్‌ల అభివృద్ధి కోసం పరిశోధనలను ప్రోత్సహించనున్నారు.

# శాస్త్ర, సాంకేతికతలోనూ ఆత్మనిర్భర్

**- రూ.7,280 కోట్లతో రేర్ ఎర్త్ ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ - రూ.9,858 కోట్లతో పుణె మెట్రో పొడిగింపునకు ఓకే - రూ.1,324 కోట్లతో బదల్‌పూర్ - కర్జత్ రైల్వేలైన్ - రూ.1,457 కోట్లతో ద్వారక - కనాలస్ రైల్వే లైన్ డబ్లింగ్ - కేంద్ర మంత్రివర్గ సమావేశం - వివరాలు వెల్లడించిన మంత్రి అశ్వినీ వైష్ణవ్**




**న్యూఢిల్లీ, నవంబరు 26:** స్వయం సమృద్ధి, క్లీన్ ఎనర్జీ లక్ష్యాలకు అనుగుణంగా కేంద్రం ప్రోత్సాహమిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉపయోగించే బలమైన అయస్కాంతాలలో ఆర్ఇఎంపి(రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ ప్రొడక్షన్)లు ఉన్నాయి. ఈవీ మోటార్లు, విండ్ టర్బైన్లు, డ్రోన్లు, ఉపగ్రహాలు, వైద్య పరికరాలకు ఇవే కీలకం. దేశీయ సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించడం, సరఫరా గొలుసులను బలోపేతం చేయడం, నెట్ జీరో 2070 లక్ష్యాలకు మద్దతు ఇవ్వడం కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ ప్రొడక్షన్(ఆర్ఇఎంపి) ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఈ పథకం ముఖ్యోద్దేశ్యం... శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవడాన్ని తగ్గించి.. స్వదేశంలోనే దీనిని అభివృద్ధి చేసుకోవడమే. ఈ దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. దాంతో రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ ప్రొడక్షన్ (ఆర్ఇఎంపి) పథకానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. ఈ పథకానికి బడ్జెట్‌లో రూ.7,280 కోట్లు కేటాయించింది. భారత్‌లో హైటెక్ మాగ్నెట్లను తయారు చేయడమే దీని లక్ష్యం. ఈ మాగ్నెట్లను ఎలక్ట్రిక్ వాహనాలు, మొబైల్ ఫోన్లలో ఉపయోగిస్తారు. ఈ చర్య సాంకేతికంగా బలమైన, ప్రపంచ వ్యాప్తంగా పోటీతత్వ తయారీ స్థావరాన్ని నిర్మించడంలో సహాయపడుతుందని, 2047నాటికి వికసిత్ భారత్ విస్తృత దార్శనికతకు మద్దతు ఇస్తుందని ప్రభుత్వం తెలిపింది. ఈ సాహసోపేత నిర్ణయంతో ఉద్యోగాల కల్పనతోపాటు పెట్టుబడులను ఆకర్షించడం,

ప్రపంచ అరుదైన భూమి అయస్కాంత మార్కెట్‌లో భారత్ కీలక పాత్ర పోసించనుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కేంద్ర కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియా సమావేశంలో వెల్లడించారు.

రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ ప్రొడక్షన్ (ఆర్ఇఎంపి)కు రూ.7,280 కోట్లు కేటాయించిందని తెలిపారు. పుణె నగరంలో మెట్రో రైలు పొడిగింపునకు రూ.9,858 కోట్లు కేటాయించినట్లు వివరించారు.

# బ్రెజిల్ మాజీ అధ్యక్షుడికి 27 యేళ్ల జైలు



**బ్రాసి లి యా, న వంబరు 26:** బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారోకు 27 ఏళ్ల జైలు శిక్ష ఖరారైంది. 2022 ఎన్నికల్లో ఓటమి తర్వాత అధికారాన్ని నిలుపుకోవడానికి కుట్ర పన్నారన్న కేసులో ఆయన దాఖలు చేసిన అప్పీల్‌ను దేశ అత్యున్నత న్యాయస్థానం మంగళవారం తిరస్కరించింది. శిక్షను వెంటనే అమలు చేయాలని ఆదేశించడంతో ఆయన జైలు జీవితం గడపడం అనివార్యమైంది. గత శనివారం గృహ నిర్బంధంలో ఉన్న బోల్సోనారో, తన కాలికి ఉన్న యాంకిల్ మానిటర్‌తో ట్యాంపరింగ్ చేశారన్న ఆరోపణలతో పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు.

తాను వాడే మందుల వల్ల భ్రాంతులు, భయాందోళనలు కలుగుతున్నా యని, ఆ పరికరం ద్వారా తనపై గూఢచర్యం చేస్తారేమోనన్న అనుమానంతో అలా చేశానని ఆయన అధికారులకు తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో ఆయన ఆరోగ్య కారణాలతో గృహ నిర్బంధాన్ని కోరుతూ చేసిన విజ్ఞప్తిని కూడా కోర్టు తోసిపుచ్చింది. సెప్టెంబర్‌లో వెలువడిన తీర్పులో బోల్సోనారోతో పాటు ఆయన ఏడుగురు మిత్రులను సుప్రీంకోర్టు దోషులుగా నిర్ధారించింది.

ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడం, అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డ సిల్వా ప్రమాణ స్వీకారానికి ముందే ఆయనను హత్య చేయడం, సుప్రీంకోర్టును రద్దు చేసి సైన్యానికి అధికారాలు కట్టబెట్టడం వంటి భారీ కుట్రకు పాల్పడినట్లు ప్రాసిక్యూటర్లు కోర్టుకు ఆధారాలు సమర్పించారు. ఈ అరెస్టుపై బోల్సోనారో మిత్రుడైన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, ఇది చాలా విచారకరమని వ్యాఖ్యానించారు. మొదట్లో ఈ కేసును ఉపసంహరించుకోవాలని బ్రెజిల్‌పై ఒత్తిడి తెచ్చిన ట్రంప్ ప్రభుత్వం, ఆ దేశ దిగుమతులపై 50 శాతం వరకు సుంకాలను సైతం విధించింది. అయితే, ఇటీవలి కాలంలో అమెరికా ఈ ఒత్తిడిని తగ్గించి బ్రెజిల్‌తో చర్చలను పునరుద్ధరించింది.

# సంక్షిప్తంగా..

## వందేళ్లు పూర్తిచేసుకున్న యుపిఎస్‌సి




**న్యూఢిల్లీ, నవంబరు 26:** దేశంలో ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు అత్యున్నత ప్రామాణికంగా నిలిచే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) వందేళ్లు పూర్తి చేసుకుంది. ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని పురస్కరించుకుని దేశ రాజధాని ఢిల్లీలో శతవార్షికోత్సవం ఘనంగా ప్రారంభమైంది. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. న్యూఢిల్లీలోని భారత మండపంలో జరిగిన ప్రారంభో త్సవంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సదస్సులో యూపీఎస్సీ ప్రస్తుత ఛైర్మన్, సభ్యులతో పాటు అన్ని రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఛైర్మన్లు, సభ్యులు, మాజీ ఉన్నతాధికారులు, నిపుణులు పాల్గొంటున్నారు. ఈ వేడుకలను కేవలం ఉత్సవాలకే పరిమితం చేయకుండా, నియామక ప్రక్రియలను బలోపేతం చేయడంపై దృష్టి సారించారు.

## బురఖాను నిషేధించాలంటూ సెనేటర్ నిరసన



**కాన్‌బెర్రా, నవంబరు 26:** ఆస్ట్రేలియా పార్లమెంట్ లో బురఖాపై వివాదం నెలకొంది. దేశంలో బురఖాను నిషేధించాలని డిమాండ్ చేస్తూ ఓ మహిళా సెనేటర్ బురఖా ధరించి పార్లమెంట్ కు హాజరుకావడంపై తోటి సభ్యులు అభ్యంతరం తెలిపారు. బురఖాను నిషేధించాలన్న ఆమె ప్రతిపాదనను తిరస్కరించారు. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన స్పీకర్.. సదరు సెనేటర్ ను మూడు నెలల పాటు సస్పెండ్ చేశారు. ఆస్ట్రేలియాలో బురఖాను, ముఖాన్ని పూర్తిగా కప్పి ఉంచే వస్త్రాలను నిషేధించాలని డిమాండ్ చేస్తూ సెనేటర్ పౌలిన్ హాన్ సన్ (71) పార్లమెంట్ లో ఓ బిల్లును ప్రవేశ పెట్టారు. ఈ బిల్లుపై చర్చకు కూడా తోటి సెనేటర్లు అంగీకరించకపోవడంపై మండిపడ్డ హాన్ సన్ దీనికి నిరసనగా తల నుంచి పాదం వరకు కప్పి ఉంచే బురఖా ధరించి పార్లమెంట్ కు వచ్చారు.

## ఎవరు ఎన్నికైనా కలిసి పనిచేయాల్సిందే : శశిథరూర్



**న్యూఢిల్లీ,నవంబరు 26:** ప్రజాస్వామ్యంలో ఎవరు ఎన్నికైనా వారితో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ పార్టీ ఎంపీ శశిథరూర్ అభిప్రాయపడ్డారు. ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని, కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశంసిస్తున్నారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. కొందరు కాంగ్రెస్ నేతలు ఆయనపై విమర్శలు కూడా చేశారు. ఈ నేపథ్యంలో దుబాయ్‌లో ఉన్న శశిథరూర్ కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై స్పందించారు. ప్రతి ఒక్కరూ ఒకే సిద్ధాంతాలను అనుసరిస్తూ కేంద్రానికి సహకరించకపోతే కొన్ని పనులు ముందుకు సాగవని ఆయన అన్నారు. కేవలం సైద్ధాంతిక స్వచ్ఛతతోనే దేశం అభివృద్ధి చెందదని, పరస్పర సహకారంతోనే ఇది సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా ఎన్నికైనప్పుడు వారితో కలిసి పనిచేయాలని ఆయన సూచించారు.

## అధికారిక బంగ్లాలను ఖాళీచేయాలని లాలూకు నోటీసులు!



**పాట్నా, నవంబరు 26:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, అంతర్గత కలహాలతో సతమతమవుతున్న ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబానికి నితీశ్ కుమార్ ప్రభుత్వం మరో షాక్ ఇచ్చింది. ఆయన భార్య, మాజీ సీఎం రబ్రీ దేవి, కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌లను తమ అధికారిక బంగ్లాలను ఖాళీ చేయాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. పాట్నాలోని 10 సర్క్యులర్ రోడ్‌లో ఉన్న బంగ్లాలో రబ్రీ దేవి గత 20 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. ఆర్జేడీ పార్టీ కీలక సమావేశాలు, కార్యకలాపాలకు ఇదే కేంద్రంగా ఉండేది. ఇప్పుడు ఈ బంగ్లాను ఖాళీ చేయాలని ప్రభుత్వం ఆదేశించడం రాజకీయంగా హాట్ టాపిక్ అయింది. అదేవిధంగా, లాలూ పెద్ద కుమారుడు, మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్‌ను కూడా ఆయన నివాసముంటున్న బంగ్లాను ఖాళీ చేయాలని ఆదేశించారు.



రాజ్యాంగ స్ఫూర్తి కొనసాగిస్తామని ఏపి జెన్‌కో ఎండి నాగలక్ష్మి తదితరులు ప్రమాణం చేస్తున్న దృశ్యం

## భారత రాజ్యాంగం స్ఫూర్తితో ఉద్యోగులు ప్రజా సేవకు అంకితం కావాలి

విజయవాడ, నవంబరు 26 ప్రభాతవార్తప్రతినిధి: భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ రూపొందించిన భారత రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకొని విద్యుత్ ఉద్యోగులు ప్రజాసేవకు అంకితం కావాలని ఏపీ జెన్కో ఎండీ ఎస్.నాగలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక విద్యుత్ సౌధలో సంవిధాన్ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి ఏపీజెన్కో ఎండీతో పాటు ఏపీట్రాన్స్కో జెఎండీ జి సూర్యసాయి ప్రవీణ్ చంద్, ఏపీ ట్రాన్స్కో, ఏపీ జెన్కో డైరెక్టర్లు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏపి ట్రాన్స్కో జెఎండీ భారత రాజ్యాంగ పీఠికను చదివి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎండీ నాగలక్ష్మి మాట్లాడుతూ, భారత రాజ్యాంగ రూపకల్పనలో, భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది వేసిన డా. బిఆర్ అంబేడ్కర్ మహోన్నత సేవలను గుర్తుచేశారు. ఏపీ ట్రాన్స్కో డైరెక్టర్లు ఏకేవీ భాస్కర్, జెవి రావు, ట్రాన్స్కో అదనపు కార్యదర్శి పెద్ది రోజా, ఏపీ జెన్కో డైరెక్టర్లు ఎం.సుజయ్‌కుమార్, అశోక్‌కుమార్ రెడ్డి, ఉష, సిఈలు, ఎస్ఈలు, సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.




కంచికచర్లలో సభలో ప్రసంగిస్తున్న నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూప రాణి

## భారత రాజ్యాంగం ప్రపంచానికి తలమానికం

విజయవాడ, నవంబరు 26 ప్రభాతవార్త ప్రతినిధి: భారత రాజ్యాంగం ఇంత బలంగా ఉందంటే దానికి ముఖ్య కారణం బాబాసాహెబ్ అంబేద్కర్ అని నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూప రాణి అన్నారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ సభ బుధవారం కంచికచర్ల మండల ప్రజా పరిషత్ మీటింగ్ హాల్లో కవి, రచయిత తంగిరాలసోని అధ్యక్షతన జరిగింది. ముందుగా భారత రాజ్యాంగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ రచన సమయంలో ప్రపంచ రాజ్యాంగాలను అధ్యయనం చేసి, ఏది మంచి ఉందో, అది సేకరించి మన రాజ్యాంగంలో పొందుపరిచారని, అందుకే మన రాజ్యాంగం ఇప్పటికీ పటిష్టంగా ఉందన్నారు. ప్రపంచానికి తలమానికంగా నిలిచిందన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్తూ రాజ్యాంగ ప్రియాంబుల్ సభలో అందరి చేత చదివించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధికారి దేవరపల్లి వెంకటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ జి. విజయ్‌కుమార్, కె.వి మెడికల్ కాలేజీ కరస్పాండెంట్ కెవి కృష్ణ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బుద్ధిస్ట్ మహామంత్ర కర్ల రవికుమార్, దొడ్డ ఇమ్మానియేలు, పళ్ళెం సుబ్బారావు, గాయకులు బురుగు వర్మ, పిల్లి స్వామి దాసు, పుల్లారావు, సత్యనారాయణ, శేషం స్వామి, బెజ్జం భూషణం, మాదాసు రాజేష్, మండల ప్రజా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

## గోవా అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా ఎపి శకటం

సచివాలయం, నవంబరు 26 ప్రభాతవార్త: గోవాలో అంతర్జాతీయ చలన చిత్రోత్సవం 2025ను నవంబర్ 20నుంచి 28 వరకు నిర్వహిస్తున్నారని, ఇందులో ఎపి నుంచి ప్రత్యేక శకటం 20వ తేదిన నిర్వహించిన ప్రారంభోత్సవ పెరేడ్‌లో ప్రదర్శించామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర, టివి, నాటకరంగ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ తెలిపారు. భారత ప్రభుత్వ ప్రసార మంత్రిత్వ శాఖ సెక్రటరీ సంజయ్ జాజు ఆహ్వానం మేరకు 20 నవంబర్ 2025 నుండి గోవాలో ప్రారంభమైన అంతర్జాతీయ చలనచిత్ర వేడుకల ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్రం నుండి 50వసంతాలు పూర్తి చేసుకున్న ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర టివి మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ నుండి మొట్టమొదటి సారిగా "ది హీయర్ బీట్ ఆఫ్ ఇండియన్ సినిమా అండ్ టూరిజమ్" థీమ్‌తో ప్రతే ్యక శకటం 20మంది దూప్ లైవ్ నటీనటులతో ప్రత్యేక ఆకర్ణణతో చిత్రోత్సవాల పెరేడ్‌లో కనువిందు చేశాయన్నారు. రాష్ట్రంలోని సినిమా షూటింగ్ లోకేషన్లక సంబంధించిన ఛాయా చిత్రాలను గండికోట, అరకు, బొర్రా గుహలు, పాపికొండలు, లేపాక్షి నంది, క్యాపిటల్ సిటీ ఆఫ్ అమరావతి, ఎర్రమట్టి దిబ ్బలు తదితర అందమైన అటవీ పర్యాటక ప్రాంతాలను శకటంలో ప్రదరి ్శంచారన్నారు. ఈ చలన చిత్రోత్సవ వేడుకలకు తెలుగు సినిమా కథానాయకుడు, శాసనసభ్యులు, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ, నటి శ్రీలేఖ పాల్గొన్నారు. గోవా రాష్ట్ర గవర్నర్ అశోక్ గజపతిరాజు, ఆ రాష్ట్రముఖ్యమంత్రి, నేషనల్ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు జాతీయస్థాయి నటీ నటులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర టివి మరియు నాటక రంగ అభివృద్ధి సంస్థ తరపున మేనేజర్ ఎం.శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు. ఈ ప్రారంబోత్సవ వేడుకల్లో రాష్ట్ర శకటంతోపాటు కర్నాటక, గోవా, నేషనల్ ఫిలిమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు చెందిన శకటాలు ప్రదర్శనలో పాల్గొన్నాయి.

## లేబర్ కోడ్స్ తక్షణమే రద్దు చేయాలి

### కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఆందోళన

విజయవాడ, నవంబరు 26 ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్స్ అమలకు ఇచ్చిన నోటిఫై ఫైల్స్ తక్షణమే రద్దు చేయాలని కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ సంఘాలు నాయకులు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాడే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 చట్టాల్లో 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్పు చేసి మోడీ ప్రభుత్వం అమలకు నోటిఫై చేసిందన్నారు. ఉత్పత్తిలో కీలకమైన కార్మిక వర్గం, రైతాంగం, వ్యవసాయ కూలీల ప్రయోజనాల కంటే పెట్టుబడు దారులు, వ్యవసాయ కూలీల ప్రయోజనాల కంటే పెట్టుబడుదారులు, కార్పొరేట్లు ప్రయోజనాలే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం పనిచేస్తుందనడానికి లేబర్ కోడ్స్ అమలే నిదర్శనం అన్నారు. లేబర్ కోడ్స్‌తో యజమానులకు తప్ప, కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. కార్మిక, రైతులకు నష్టం చేసే లేబర్ కోడ్‌లను, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలని లేకుంటే మోడీకి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

# ప్రజల అభీష్టాన్ని మన్నించండి!

● కైకలూరును కృష్ణా జిల్లాలో విలీనం చేయాలి ● సిఎంకు పెదపాలపర్రు, కోడూరు గ్రామస్తులు వినతి

విజయవాడ, నవంబరు 26 ప్రభాతవార్త ప్రతినిధి: వైసీపీ ప్రభుత్వ కాలం నాటి జిల్లాల పునర్ విభజన పరంగా ఏర్పడిన సమస్యలు తాజా పునర్ విభజన ప్రక్రియలోనూ పరిష్కారం కాకపోవటంతో, ముదినేపల్లి మండలం పెదపాలపర్రు, కోడూరు గ్రామాల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించేందుకు ప్రముఖులు కృషి చేయాలని, సీఎం స్వయంగా వాస్తవ పరిస్థితులను సమీక్షించాలని స్థానిక ప్రజలు వేడుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయా గ్రామాల ప్రజలు సీఎం చంద్రబాబుకు వినతి పత్రాన్ని పంపించారు. వైసీపీ చేపట్టిన అస్తవ్యస్థ పునర్ వ్యవస్థీకరణ ఫలితంగా అప్పటి వరకు కృష్ణ జిల్లాలో ఉన్న కైకలూరు నియోజకవర్గం ఏలూరు జిల్లాలో చేరింది. అది సరైన నిర్ణయం కాదని నియోజక వర్గం ప్రజలు నెత్తి నోరు బాదుకున్న ఫలితం లేకపోయింది. ఎన్నికల సమయంలో చంద్ర బాబు నాయుడు తిరిగి కైకలూరును కృష్ణా జిల్లాలో విలీనం చేస్తామని గట్టి హామీ ఇవ్వడంతో సమస్యకు పరిష్కారం లభిస్తుందని అంతా భావించారు. తరువాత ప్రభుత్వం మారింది. మంచి ప్రభుత్వ పాలనలో తప్పక మంచి రోజులు వస్తాయని భావించారు. కైకలూరు శాసన సభ్యుడు కామినేని శ్రీనివాస్ సైతం ఈ విషయంపై మంత్రివర్గ ఉపసంఘానికి లేఖ రాశారు. మంత్రి వర్గం సైతం ఈ ప్రతిపాదనను ఆమోదించింది. కానీ ప్రజల ఆకాంక్షకు విరుద్ధంగా మంగళవారం సీఎం దగ్గర జరిగిన చర్చలలో ఈ అంశాన్ని పక్కన పెట్టేసారు. గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల మార్పు విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ కైకలూరు విషయంలో పార్టీలకు అతీతంగా అందరూ తమ నియోజక వర్గాన్ని కృష్ణాలో విలీనం చేయాలని కోరినా పాలకుల చెవికెక్క లేదు. ఇక్కడ కైకలూరు నియోజకవర్గ స్థాయి వ్యవహారం ఒక ఎత్తు కాగా, ఈ నియోజక వర్గంలోని ముదినేపల్లి మండలం పెదపాలపర్రు, కోడూరు గ్రామాల ఇబ్బందులు వర్ణాతీతమనే చెప్పాలి. కైకలూరు నియోజకవర్గంను కృష్ణా జిల్లాలో కలిపేందుకు అడుగు పడని తాజా పరిస్థితులలో, కనీసం ఈ రెండు గ్రామాలను ప్రజా సౌలభ్యం దృష్ట్యా గుడివాడ రూరల్ మండలంలో కలిపి, కృష్ణా జిల్లాలో కొనసాగించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన నాటి పునర్ వ్యవస్థీకరణ ఫలితంగా ఈ గ్రామాలు పరిపాలనా సౌలభ్య రహితంగా మారిపోయాయి. పెదపాలపర్రు, కోడూరు గ్రామాలకు నాటి రెవిన్యూ డివిజన్ కేంద్రం గుడివాడ ఐదు నుండి ఏడు కిలోమీటర్ల దూరంలో, జిల్లా కేంద్రం మచిలీపట్నం 30 కిలోమీటర్ల దూరంలో ఉండేది. కైకలూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న ఈ గ్రామాలను ఏలూరు జిల్లాకు మార్చటం వల్ల రెవిన్యూ డివిజన్ కేంద్రం, జిల్లా కేంద్రం దాదాపు 70కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏలూరుకు మారిపోయ్యాయి. నిజానికి రెండు దశాబ్దాల క్రితం జరిగిన మండలాల పునర్ విభజన అనాలోచితంగా, అసమగ్రంగా సాగింది. గుడివాడకు అతి సమీపంలో ఉన్న పెదపాలపర్రు, కోడూరు గ్రామాలను గుడివాడ రూరల్ మండలంలో కాక, ముదినేపల్లిలో చేర్చారు. పెదపాలపర్రు సరిహద్దులు పంచుకున్న మోటూరు, కల్వపూడి అగ్రహారం, పర్నాస గ్రామాలు గుడివాడ రూరల్ మండలంలో ఉన్నాయు. గుడివాడ నుండి ముదినేపల్లి మార్గంలో జాతీయ రహదారి వెంబడి ప్రయాణం ప్రారంభిస్తే పెదపాలపర్రు గ్రామం ముందుగా వస్తుంది. తరువాత గుడివాడ పట్టణానికి దూరంగా ఉన్న కల్వపూడి అగ్రహారం, పర్నాస గ్రామాలు వస్తాయి. కానీ ఆశ్చర్య పోవాల్సిన విషయం ఏమిటంటే గుడివాడకు అతి సమీపంలో ఉన్న పెదపాలపర్రు గ్రామం ముదినేపల్లి మండలంలోనూ, దూరంగా ఉన్న గ్రామాలు గుడివాడ రూరల్ మండలంలో ఉన్నాయి. ఇటువంటి పరిస్థితి రాష్ట్రంలో మరెక్కడా ఉండక పోవచ్చు. ఈ ప్రత్యేక సమస్యను ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం పరిష్కరించ వలసిన అవసరం ఉంది. ఈ గ్రామాలను దత్తత తీసుకున్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు శాఖలు గుడివాడ పట్టణంలోనూ, గుడివాడ రూరల్ మండలం మోటూరులో ఉన్నాయి. ఈ గ్రామాలకు చెందిన రైతుల బ్యాంకు ఖాతాలు పూర్తిగా గుడివాడ పట్టణంలోని కెడిసిసిబి బ్యాంకులో ఉండగా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సైతం గుడివాడే కేటాయించబడి ఉంది. ఉద్యోగ అవకాశాల పరంగా కృష్ణా, ఏలూరు జిల్లాలు రెండు జోన్ల పరిధిలో ఉంటే వీరి పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. లోకల్ స్టేటస్ విషయంలోనూ సమస్యలు తలెత్తుతాయి. ఈ నేపథ్యంలో నియోజక వర్గంలోని ప్రతి ఒక్కరూ కోరుతున్న విధంగా కైకలూరును కృష్ణా జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తున్నారు. ఇది సాధ్యం కాకపోతే కనీసం ముదినేపల్లి మండలం పెదపాలపర్రు, కోడూరు గ్రామాలనైనా పూర్వం మాదిరి కృష్ణా జిల్లాలో కొనసాగించాలని కోరుతున్నారు. పెనమలూరు, గన్నవరం తరహాలో చూడవద్దని కోరుతున్నారు. ఇది నియోజక వర్గ ప్రజల ఉమ్మడి ఆకాంక్ష మాత్రమే కాదని, తమది కృష్ణా జిల్లా అని చెప్పుకోవటం ఆత్మ గౌరవం వంటిదన్నది ఇక్కడి భావనగా ఉంది. ఈ సమస్య స్పష్టంగా సీఎం దృష్టికి చేరితే ఆయన తప్పక స్పందిస్తారన్న ఆశాభావం ఇక్కడి ప్రజల్లో ఉంది.

## దుర్గమ్మ ఆలయంలో వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారి కల్యాణం



ఇంద్రకీలాద్రి, నవంబరు 26 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో బుధవారం మార్గశిరమాసం శుద్ధషష్ఠి సందర్భంగా శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల కల్యాణోత ్సవం నిర్వహించారు. స్కందషష్టి సందర్భంగా నిర్వహించిన కల్యాణోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఇఓ వికె శీనానాయక్, చైర్మన్ రాధాకృష్ణ, పాలకమండలి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**వేదపరిరక్షణకు విరాళం:**

దుర్గమ్మవారి ఆలయం నేతృత్వంలోని వేదపరిరక్షణ ట్రస్ట్‌కు రు.1,11,116ల విరాళం బుధవారం విజయవాడకు చెందిన బి రాజేంద్రప్రసాద్, శివపార్వతి కుటుంబసభ్యులు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసి, దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు అందించారు.

# క్రీడల అభివృద్ధికి సహాకరించండి

**కేంద్ర క్రీడాశాఖ మంత్రిని కోరిన రాష్ట్ర మంత్రి టిజి భరత్**



సచివాలయం, నవంబరు 26 ప్రభాతవార్త: క్రీడల్లో కర్నూలు జిల్లాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర శాఖమంత్రి మను ్సఖ్ మాండవీయను కోరినట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ తెలిపారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి కర్నూలు జిల్లాకు సంబంధించి క్రీడల అభివృద్ధికోసం తీసుకోవాల్సిన చర్యలపై ఆయన చర్చించారు. రాయలసీమకు ప్రధాన ప్రాంతీయ కేంద్రంగా, ఏపిలో అభివృద్ధి చెందుతున్న ఆర్థిక, విద్యా కేంద్రంగా ఉన్న కరూ ్నలు, క్రీడా నైపుణ్య సమూహంగా మారడానికి బలమైన సామర్థ్యాన్ని కలిగి ఉందని వివరించారు. ఖేలో ఇండియా కింద కర్నూలు జిల్లాలో స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం రూ.45.16 కోట్ల విలువైన ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని ఆయనకు వివరాలు ఇచ్చారు. ఇండోర్ స్పోర్ట్స్ హాల్స్, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, ఫుట్‌బాల్ టర్ఫ్, స్క్వాష్ కోర్టు అవసరమని కేంద్ర మంత్రిని కోరారు. ఈ సౌకర్యాలు యువ ప్రతిభను పెంపొ ందించడమే కాకుండా స్థానిక ఉద్యోగాలను సృష్టిస్తాయని, యువతకు బలమైన క్రీడా పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తాయన్నారు. వీటన్నింటిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి టిజి భరత్ పేర్కొన్నారు. కర్నూలు జిల్లాను క్రీడల పరంగా అన్ని విధాల అభివృద్ధి చెసేందుకు తాను కృషి చేసినట్లు చెప్పారు. జిల్లా నుండి క్రీడాకారులు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు అన్ని విధాల సహాకారం అందిస్తానని చెప్పారు.

## నెల్లూరు జిల్లాలో టిడిపి నేత గొట్టిపాటి ప్రసాద్ దారుణ హత్య



జలదంకి (నెల్లూరు), నవంబరు 26, ప్రభాతవార్త: జలదంకి మండలం గట్టుపల్లి చింతలపాలెంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గొట్టిపాటి ప్రసాద్ నాయుడు దారుణహత్యకు గురయ్యాడు. గ్రామంలోని తన కోళ్ల ఫారంలో పనులు చేస్తుండగా గుర్తు తెలియని దుండగులు కోళ్లు కావాలంటూ వచ్చి ఈ హత్యకు పాల్పడినట్లు చెప్పుకుంటున్నారు. ఈ దారుణ హత్య మండలంలో కలకలం రేపింది. ఎవరు ఎందుకు హత్య చేసి ఉంటారన్న అనుమానంతో చర్చ సాగుతుంది. ఇది రాజకీయ హత్య వ్యక్తిగతంగా జరిగిన మర్డరా అంటూ మండలవాసులు చర్చించుకుంటున్నారు. పట్టపగలు కోళ్ల ఫారం సమీపంలో దాదాపు 200 మంది పైగా ఓ కర్మ కతువుల్లో నిమగ్నమైన సమయంలో కూతవేటు దూరంలో ఈ హత్య జరగడం సంచలనం రేపింది. గుర్తుతెలియని ఇద్దరు యువకులు కోళ్లు కావాలంటూ ప్రసాద్ నాయుడుతో మాట్లాడటం అక్కడ ఉన్న మరో వ్యక్తి గమనించారని చెప్పుకుంటున్నారు. ఆవ్యక్తి వేరే పని కోసం గ్రామంలోనికి వెళ్ళగా ఈ స్వల్ప సమయంలోనే హత్య జరిగిందని అంటున్నారు. ఈ విషయం మండలంలో దావనముల వ్యాపించింది. ఎస్సై లతీఫ్ ఒనిసా తన సిబ్బందితో హుటాహుటిన చింతలపాలెం వెళ్లారు. దేహాన్ని పరిశీలించారు. కావలి డిఎస్పి శ్రీధర్ సిఐలు వెంకటనారాయణ, గిరిబాబు, ఫిరోజ్ ఖాన్, రాజేశ్వరరావులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్స్ టీం వచ్చి వివరాలు సేకరించారు. డాగ్ స్వార్డ్ ఆ ప్రాంగణంలో తిరిగి స్థానిక రామాలయం వద్దకు వెళ్ళింది. ఈ సందర్భంగా డి.ఎస్.పి మాట్లాడుతూ అన్ని కోణాలలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



## బిల్లులు లేని సిగరెట్లు పట్టివేత

### - రూ.20 లక్షల సరుకు స్వాధీనం

నెల్లూరు క్రైమ్, నవంబరు 26 ప్రభాతవార్త: బిల్లులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న సిగరెట్ ప్యాకెట్లు, గుట్కా ప్యాకెట్లను నెల్లూరు విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. నెల్లూరు సిటీలోని జేమ్స్ గార్డెన్, వెంకట్రామాపురం రెండవ వీధిలోని ఓ పార్సెల్ సర్వీస్ నందు అక్రమంగా బిల్లులు లేకుండా సిగరెట్లు, పాన్ మసాలాలు రవాణా అవుతున్నాయని నమ్మదగ్గ సమాచారం మేరకు బుధవారం జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు, రాష్ట్ర బిళీగి అధికారులు కలిసి సంయుక్తంగా ఆకస్మిక దాడులు నిర్వహించి సోదాలు జరిపారు. అనుమానాస్పదంగా వున్న 27 కార్టన్ బాక్సులను గుర్తించి తనిఖీ చేయగా అందులో 24 బాక్సుల సిగరెట్స్ 3 బాక్సుల పాన్ మసాలా ప్యాకెట్లు ఉన్నాయి. ట్రాన్స్పోర్ట్ సర్వీస్ వారిని బిల్లులు చూపించమని కోరగా వారు ఎటువంటి బిల్లులు లేవని తెలిపారు. వెంటనే అధికారులు వాటిని స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలు నిమిత్తం జీఎస్టీ కార్యాలయానికి తరలించారు. సరుకు మొత్తం విలువ సుమారు రూ.20 లక్షలుగా ఉంటుందని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ నరసింహారావు, డిసిటిఓలు విష్ణు, సుబ్బారావులు పాల్గొన్నారు.



## శ్రీశైల మల్లన్న హుండీ ఆదాయం రూ.7.27 కోట్లు

శ్రీశైలంప్రాజెక్టు, నవంబరు 26 ప్రభాతవార్త: శ్రీశైలం మల్లన్న హుండి ఆదాయం గత ఏడాది కార్తికమాసం కంటే ఈ ఏడాది కార్తికమాసం హుండి ఆదాయం రికార్డు బ్రేక్ చేసిందని శ్రీశైలదేవస్థానం ఈఓ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఏడాది కార్తికమాసం హుండి ఆదాయం రాబడి పెరిగిందన్నారు. శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల దర్శన బాగ్యం కోరకు రెండు తెలుగు రాష్ట్రాలే కాకుండా దేశ విదేశాల నుండి ఇతర రాష్ట్రాల నుండి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుందన్నారు. భక్తుల సంఖ్య రెట్టింపు ఉండడంతో క్షేత్ర ప్రాశ్యస్తం నలుదిశలు వ్యాపిస్తుందన్నారు. ఈ క్రమంలోనే మంగళవారం నిర్వహించిన హుండీల లెక్కింపు ద్వారా దేవస్థానానికి రూ.7,27,26,400/-ల నగదు రాబడిగా లబించిందన్నారు. కాగా ఈ హుండిల రాబాడిని భక్తులు గత 33 రోజుల్లో సమర్పించడం జరిగింది. గత ఏడాది కార్తికమాసంలో రూ.5,96,92,376/-లు రాబడిగా లబించడం జరిగిందన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.1,30,34,024/-ల అధిక రాబడిగా లబించడం విశేషం అన్నారు. ఈ నగదుతో పాటు 117గ్రాముల 800 మిల్లిగ్రాముల బంగారం, 7కేజిల 230 గ్రాముల వెండి లబించాయన్నారు. అదేవిధంగా 646-యుఎస్ఏ డాలర్లు, 120-యుఏఈ దిర్హమ్, 85-సౌదిరియాల్స్, 136-కత్తార్ రియాల్స్, 30-సింగపూర్ డాలర్లు, 25-ఆస్ట్రేలియా డాలర్లు, 85-ఇంగ్లాడు పౌండ్స్, 200-ఓమన్ బైసా, మొదలైన విదేశీ కరెన్సీ కూడా ఈ హుండిల లెక్కింపులో లభించాయన్నారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేప్పట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈవో ఎం.శ్రీనివాసరావు, డిఈఓ ఆర్.రమణమ్మ, పలువురు శాఖాధిపతులు, ఆయా విభాగాల పర్యవేక్షకులు, సిబ్బంది, శివసేవకులు, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ హరిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆగ్నేయ గణపతి ఆలయ కుంబాభిషేకంలో పాల్గొన్న నాయకులు అధికారులు

## శ్రీకాళహస్తిలో ఆగ్నేయ గణపతి ఆలయ కుంభాభిషేకం పూజలు ప్రారంభం

శ్రీకాళహస్తి, నవంబరు 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న నవసంది వినాయకులలో ఒకటైన బేరివారి మండపం కూడలిలో వెలసిన ఆగ్నేయ గణపతి ఆలయ జీర్ణోద్ధారణ గావించారు. ఈ ఆలయ కుంబాభిషేకం కార్యక్రమాలను మంగళవారం రాత్రి నుంచి బేరివారి మండపం వద్ద భక్తి శ్రద్దలతో ప్రారంభించారు. రాబోవు మహాశివరాత్రి సందర్భంగా తొమ్మిది మంది గణపతి ఆలయాలు ఉండాలి కాబట్టి ఆగ్నేయ గణపతి ఆలయాన్ని పునర్నిర్మించారు. నూతన ఆలయంలో వినాయక విగ్రహా ప్రతిష్ట దేవాలయ కుంబాభిషేకంకు శ్రీకారం చుట్టారు. వేదపండితుల వేద మంత్రాలతో సంప్రదాయ బద్దంగా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. హోమాలు ఏర్పాటు చేసి పూజలను ప్రారంభించారు. రెండవ రోజు బుధవారం కార్యక్రమాల్లో విశేష పూజలు, హోమాలు వైదిక క్రతువులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్ సారథ్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఉప ప్రధానార్చకులు దక్షిణామూర్తి, ఆలయపౌరోహితులు అర్ధగిరి, వేదపండితులు గోవింద శర్మ, ఈస ందర్భంగా ఆగ్నేయ గణపతి విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యురాలు కోలా విశాలాక్షి, ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, డిప్యూటి ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ కుమార్, తెలుగుదేశం నాయకులు దుర్గాప్రసాద్, వజ్రం కిషోర్, దేవస్థానం సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ రఘురామ టార్చర్ కేసులో ఐపిఎస్ సునీల్‌కు నోటీసులు

### డిసెంబర్ 4న గుంటూరు సిసిఎస్‌కు రండి

### ఎస్పీ దామోదర్ తాఖీదులు




విజయవాడ, నవంబరు 26 ప్రభాతవార్త ప్రతినిధి: అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజును గత వైసీపీ ప్రభుత్వంలో టార్చర్ చేసిన కేసులో ఇవాళ మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. తనపై కస్టడీలో దాడి చేసిన వారిపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఇప్పటికే ఆయన అసంతృప్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇవాళ ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐపీఎస్ అధికారికి సమన్లు పంపింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఐపీఎస్ పీవీ సునీల్ కుమార్ సీఐడీ చీఫ్‌గా పనిచేశారు. అప్పట్లో రఘురామకృష్ణంరాజు వైసీపీ ఎంపీగా ఉన్నారు. వైసీపీ నుంచి గెలిచి సొంత ప్రభుత్వంపై నిత్యం విమర్శలకు దిగేవారు. ఈ క్రమంలోనే రఘురామరాజుపై రాజద్రోహం ఆరోపణలతో కేసు నమోదు చేసి అరెస్టు చేసింది. అనంతరం గుంటూరు సీఐడీ కస్టడీలోకి తీసుకున్న రఘురామపై అక్కడ పోలీసులు దాడి చేసారు. అనంతరం గుంటూరు ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడి డాక్టర్లు కూడా ఆయనకు గాయాలేవీ కాలేదని తప్పుడు రిపోర్టులు ఇచ్చారు. ఈ వ్యవహారంపై రఘురామ సుప్రీంకోర్టు వరకూ వెళ్లి సికింద్రాబాద్ ఆర్మీ ఆస్పత్రిలో మరోసారి పరీక్షలు చేయించుకునేందుకు అనుమతి తెచ్చుకున్నారు. అలాగే బెయిల్ కూడా తెచ్చుకున్నారు. ఆ తర్వాత టీడీపీలో చేరిన రఘురామరాజు.. అప్పట్లో తనపై దాడి చేసిన పోలీసులపై కూటమి సర్కార్ వచ్చాక చర్యలు తీసుకుంటారని ఆశించినా పోలీసులు నామమాత్రంగా కేసు నమోదు చేసి వదిలేశారు. దీనిపై రఘురామ చాలా కాలంగా అసంతృప్తిగా ఉన్నారు. ముఖ్యంగా తనపై దాడి చేయించినట్లు ఆరోపిస్తున్న ఐపీఎస్ పీవీ సునీల్ కుమార్‌ను కనీసం నోటీసులు ఇచ్చి విచారణకు సైతం పిలిపించకపోవడంపై అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు పోలీసులు ఎట్టకేలకు రఘురామ కేసుపై కదిలారు. ఆయనపై దాడి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌ను వచ్చే నెల 4న విచారణకు హాజరుకావాలని నోటీసులు పంపారు. ఈ మేరకు గుంటూరు సీసీఎస్ స్టేషన్‌కు విచారణకు రావాలని ఎస్పీ దామోదర్ నోటీసుల్లో పేర్కొన్నారు.

## రైతులకు ఎలాంటి ఆందోళన వద్దు... పంటలకు భరోసా కల్పిస్తాం

# పంటలన్నింటికీ మద్దతు ధర దక్కాల్సిందే

● ధాన్యం కొనుగోళ్లలోనూ... చెల్లింపుల్లోనూ ఇబ్బంది తలెత్తకూడదు ● రైతులకు గోనె సంచుల సరఫరాలో లోపాలు ఉండొద్దు
● పత్తి, అరటి, మొక్క జొన్న రైతుల కష్టాన్ని అధిగమించేందుకు చర్యలు ● రైస్ మిల్లర్లు, ట్రేడర్లు, ఎగుమతిదారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించండి
● వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల సమీక్షలో సిఎం చంద్రబాబు ● పత్తి కొనుగోళ్లల్లో ఇబ్బందులపై కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ కార్యదర్శికి సిఎం ఫోన్




విజయవాడ, నవంబరు 26 ప్రభాతవార్త: రాష్ట్రంలో పండుతున్న అన్ని పంటలకు ధరలు తగ్గకుండా... ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా... రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లల్లోనూ... చెల్లింపుల్లోనూ ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని ఆదేశించారు. బుధవారం సచివాలయంలో వ్యవసాయ, పౌరసరఫరాల శాఖపై ముఖ్యమంత్రి సమీక్షించారు. అలాగే పత్తి, అరటి, జొన్న వంటి పంటలు సాగు చేసే రైతులకు ఉన్న ఇబ్బందులను అధిగమించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రబీ సీజన్‌లో 50.75 లక్షల టన్నుల మేర ధాన్యాన్ని సేకరించాలనే అంచనాలు పెట్టుకున్నట్టు అధికారులు వివరించారు. ధాన్యం కొనుగోళ్ల నిమిత్తం రూ.13,451 కోట్లు చెల్లింపులు జరపాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "చెల్లింపుల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలి. రెండు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన చెల్లింపుల ప్రక్రియను పూర్తి చేయాలి. దీనికి సంబంధించిన నిధుల విషయంలో ఆర్థిక శాఖతో సమన్వయం చేసుకోవాలి. భారీ వర్షాలు ఉంటాయనే వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా గోనె సంచులను రైతులకు అందించాలి." అని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

### సమీక్ష నుంచే కేంద్ర కార్యదర్శికి ఫోన్

పత్తి కొనుగోళ్లల్లో సీసీఐ తెచ్చిన కొత్త విధానాల వల్ల ఇబ్బందులు వస్తున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. దీంతో సమీక్ష నుంచే కేంద్ర టెక్స్‌టైల్స్ కార్యదర్శి నీలం రావుతో ముఖ్యమంత్రి మాట్లాడారు. పత్తి కొనుగోళ్ల విషయంలో ఎదురవుతున్న సమస్యను వివరించారు. కొత్తగా తెచ్చిన విధానాల వల్ల రాష్ట్రంలోని పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నారని నీలంరావుకు ముఖ్యమంత్రి వివరించారు. అలాగే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్ష సూచన ఉండడంతో సమస్యను త్వరితగతిన పరిష్కారించాలని కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ కార్యదర్శిని సీఎం కోరారు. అనంతరం సమీక్షలో సీఎం మాట్లాడుతూ..."పత్తి కొనుగోళ్ల అంశంలో ఎదురవుతున్న ఇబ్బందుల విషయంలో కేంద్రంతో నిత్యం సంప్రదింపులు జరపాలి. ఈ మేరకు కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు, ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలుకు బాధ్యతలు అప్పజెప్పాలి. అరటి, జొన్న ధరలపై ఉన్న సమస్యలను అధిగమించాలి. వీటికి సంబంధించి స్థానిక ట్రేడర్లు, ఎగమతి దారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించాలి. అలాగే ధాన్యం కొనుగోళ్ల విషయంలోనూ రైస్ మిల్లర్లతో సంప్రదింపులు జరపాలి. వాతావరణాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేయాలి. భారీ వర్షాలు, వచ్చే అవకాశం ఉంటే.. రైతులను అలెర్ట్ చేయడంతోపాటు పంటలను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి." అని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సమీక్షలో వ్యవసాయ, పౌర సరఫరాల శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## రాజధానిలో వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణకు

# నేడు భూమిపూజ

● రెండు దశల్లో రూ.260 కోట్లతో అభివృద్ధి పనులు ● ఆలయ ప్రాకారం, మహా రాజగోపురం, మండపాలు, ఆంజనేయస్వామి ఆలయాల నిర్మాణం
● మాడ వీధులు, అన్నదాన కాంప్లెక్స్ తదితర నిర్మాణాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా శంకుస్థాపన

విజయవాడ, నవంబరు 26 ప్రభాతవార్తప్రతినిధి: అమరావతి రాజధాని వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేపు ఉదయం 10.30 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. రూ.260 కోట్లతో రెండు దశల్లో చేపట్టనున్న పనులకు సీఎం చేతుల మీదుగా భూమిపూజ జరుగనుంది. మొదటి దశలో రూ.140 కోట్లు వ్యయంతో వివిధ పనుల్ని చేపట్టనున్నారు. రూ.92 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారం నిర్మించనున్నారు. ఏడంతస్తుల మహా రాజగోపురం, ఆర్జిత సేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథ మండపం, ఆంజనేయ స్వామి ఆలయం, పుష్కరిణి, కట్ స్టోన్ ఫ్లోరింగ్ నిర్మిస్తారు. వీటి నిర్మాణాలకు రూ. 48 కోట్లు ఖర్చు కానుంది. ఇక రెండోదశ పనులను రూ.120 కోట్లతో చేపట్టనున్నారు. శ్రీవారి ఆలయ మాడ వీధులు, అప్రోచ్ రోడ్లు, అన్నదాన కాంప్లెక్స్, యాత్రికులకు విశ్రాంతి భవనం, అర్చకులు, సిబ్బందికి క్వార్టర్స్, రెస్ట్ హౌస్, పరిపాలనా భవనం, ధ్యాన మందిరం, వాహనాల పార్కింగ్ వంటి పనులను చేపట్టనున్నారు. ఇప్పటికే ఆలయ నిర్మాణం మొదటి విడత పూర్తైన నేపథ్యంలో రేపు శంకుస్థాపన అనంతరం రెండు, మూడవ విడత పనులు చేపట్టనున్నారు. 4వ విడత పనుల్ని త్వరలోనే చేపట్టి టెండర్లు పిలుస్తారు.

### ఆలయ విస్తరణకు గత ప్రభుత్వంలో గ్రహణం

తిరుమల తరహాలో రాజధాని అమరావతిలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించాలని 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. కృష్ణా నది తీరాన అత్యద్భుతంగా వేంకటేశ్వర దేవాలయ నిర్మాణానికి 25.417 ఎకరాలు కేటాయించి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక గత పాలకులు ఆలయ విస్తీర్ణాన్ని కుదించారు. కేటాయించిన భూమిలోనూ కోత పెట్టడంతో పాటు విస్తరణ పనులు రద్దు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ అమరావతిలోని శ్రీ వేంకటేశ్వరస్వామికి దేవాలయం విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది.

# సోషలిజంతోనే సమానత్వం

## చైనా క్యూబాలు పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా నిలుస్తున్నాయి

### సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు



అనంతపురం, నవంబరు 26 ప్రభాతవార్త బ్యూరో: తారతమ్యాల్లేని సమసమాజ నిర్మాణం సోషలిజంతోనే సాధ్యమని, చైనా, క్యూబా తదితర దేశాలు పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా నిలుస్తున్నాయని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సోషలిజం ఔన్నత్యం... సామ్రాజ్యవాద ప్రమాదం అన్న అంశంపై నగరంలోని లలిత కళాపరిషత్ హాలులో బుధవారం సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముందు నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి టవర్‌క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు రెడ్‌షర్టు వాలంటీర్ల ప్రదర్శన జరిగింది. సిపిఎం నాయకులు, కార్యకర్తలతోపాటు, అభిమానులు రెడ్‌కలర్ డ్రస్సులు ధరించి వందలాది మందితో మార్చ్‌ఫాస్టు జరిగింది. ఈ సందర్భంగా జిందాబాద్ సిపిఎం అంటూ సాగిన ఈ ప్రదర్శన అందరినీ ఆకర్శించింది. అనంతరం సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సుల్లో సిపిఎం అగ్రనేత బివి.రాఘవులు మాట్లాడుతూ సోషలిజం అంటే ఏమిటన్నది 1917లో రష్యాలో జార్ చక్రవర్తిని పదవీచ్యుతిని చేసి కార్మికులు, కర్షకులు రాజ్యాధికారం చేపట్టారని తెలిపారు. అప్పటి నుంచి 50 ఏళ్లపాటు రష్యాలో సోషలిస్టు ప్రభుత్వం ప్రజలకు ఏమి చేసిందన్నది పరిశీలిస్తే సోషలిజం గొప్పతనం అర్థమవుతుందని చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి, ఇలా అన్ని రంగాల్లో సమానత్వం సాధించిందని గుర్తు చేశారు. ప్రపంచం మొత్తం సోషలిజం వైపు చూస్తున్న తరుణంలో పెట్టుబడీదారి వ్యవస్థ కుట్రలు పన్ని ఆ ప్రభుత్వాన్ని కూల్చివేసిందని పేర్కొన్నారు. ఇప్పుడు కూడా ప్రపంచంలో చైనా, క్యూబా తదితర దేశాలు పెట్టుబడీదారి వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా నిలుస్తున్నాయన్నారు. సోషలిస్టు పాలనలో దేశాభివృద్ధి ఏ రకంగా ఉంటుందన్నది కూడా గతంలో రష్యా, ఇప్పుడు చైనా చాటి చూపుతున్నాయని పేర్కొన్నారు. ఈ సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబుళకొండారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, సిపిఎం సీనియర్ నేత రాంభూపాల్‌రెడ్డి, ఇతర సిపిఎం నాయకులు నాయుడు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## వన్యకుల క్షత్రియ డైరెక్టర్ భూపతి మృతిపట్ల సిఎం విచారం

విజయవాడ, నవంబరు 26 ప్రభాతవార్తప్రతినిధి: కుప్పం నియోజకవర్గం, వీర్నమల గ్రామానికి చెందిన రాష్ట్ర వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ వి.భూపతి మృతిపట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీకి వీరాభిమాని అయిన భూపతి విద్యుత్ షాక్‌తో మృతి చెందడం బాధాకరమని అన్నారు. వార్డు మెంబర్‌గా, గ్రామపార్టీ అధ్యక్షుడిగా భూపతి సేవలందించారని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. భూపతి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ అండగా ఉంటుందని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు.

## గన్ మిస్సింగ్.. తాకట్టులో రికవరీ బంగారం

### అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వ్యవహారం



హైదరాబాద్,నవంబరు 26,ప్రభాతవార్త: అం బర్‌పేట్ పోలీసు స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఓఎస్ఐ వ్యవహారశైలి పోలీసు విభాగానికి మచ్చ తెచ్చింది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ భానుప్రకాశ్ రెడ్డి తన సర్వీసు రివాల్వ ర్‌ను పోగొట్టుకున్నాడు. అంతే కాకుండా చోరి సొస్తుగా రికవరి చేసిన నాలుగున్నర తులాల బంగారాన్ని తాకట్టు పెట్టుకున్నాడు. గత 5 నెలల క్రితం నుంచి రివాల్వార్, బంగారు తకట్టు విషయం జరిగినప్పటికి బయటకు పొక్క కుండా జాగ్రత్త పడ్డాడు. అయితే బంగారు పొగొట్టుకున్న వ్యక్తి సైతం ఒత్తిడి తేవడంతో ఉన్నాతాధి కారులు ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో సుమారు 2 నెలల దీర్ఘకాలిక సెవుపై వెళ్లాడు. ఇతని రివాల్వర్, బంగారంపై ఉన్నతా ధికారులు రోజు రోజుకు ఒత్తిడి తేవడంతో విషయం బయటపడింది. దీంతో అతన్ని ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఇతను మధ్య వ్యక్తితో బంగారాన్ని కుదువబెట్టిన వ్యక్తిని సైతం విచారంచడంతో మరిన్ని విషయాలు బయటకు వచ్చినట్లు తెలుస్తుంది. అయితే ఈ విషయం పోలీసు శాఖకు సంబంధించింది కావడంతో పోలీసులు సైతం గోప్యత ప్రదర్శిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు.

**బెట్టింగే కారణం?:** భాను ప్రకాశ్ రెడ్డి ఆన్లైన్ బెట్టింగ్ అలవాటు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బెట్టింగ్ వ్యసనంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయినట్లు తెలుస్తుంది. ఆర్థికంగా ఉన్న కష్టాల నుంచి గట్టేందుకు అడ్డదా రులు తొక్కినట్లు తెలుస్తుంది. ఇతనికి ఆంధ్రప్రదేశ్లో మరో ప్రభుత్వ ఉద్యోగం వచ్చినట్లు సమాచారం. అయితే ఈవిషయంపై పలువురు పోలీస్ ఉన్నతా ధికారులను ప్రశ్నించగా భానుప్రకాశ్‌ను నాలుగురోజుల క్రితమే సస్పెండ్ చేశామని చెప్పడం కొస మెరుపు.




## సుక్మాలో నక్సల్స్ డంప్ లభ్యం

**చర్ల,నవంబరు26, ప్రభాతవార్త:** చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా పాలగూడ క్యాంపు సమీపంలోని అటవి ప్రాంతంలో మావోయిస్టులు భద్ర పరిచిన భారీ మొత్తంలో ఉన్న ఆయుధాలను ఇతర మందుగుండి సామగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. సెర్చ్ ఆపరేషన్ కు వచ్చే భద్రతా బలగాలను లక్షంగా చేసుకొని అటవి ప్రాంతంలోని కొండపై వీటిని భద్రపరిచారని విశ్వ సనీయ సమాచారం మేరకు సిఆర్పీఎఫ్ 150 బెటాలియన్ అసిస్టెంట్ కమాం డర్ అజయ్ కుమార్ నేతృత్వంలో క్వాట్ కోయ్ 150బిఎన్ బెటాలియన్ సభ్యులు సంయుక్తంగా ఆపరేషన్‌లో పాల్గొన్నారు. భద్రతా బలగాలు స్వాధీ నం చేసుకున్న వాటిలో సింగిల్ షాట్ రైఫిల్ ( ఓవర్ ముజిల్ లోడింగ్)35 జెలిటన్ స్టిక్స్ 7బిజిఎల్ హెడ్స్ ఎలక్ట్రికల్ డిటోనేటర్లు నాన్ ఎలక్ట్రికల్ డిటో నేటర్లు నక్సల్స్ సామాగ్రి సాహిత్యం పుస్తకం నలభై మీటర్ల ఫ్లెక్సి బుల్ వైర్ ఇతర సామాగ్రి ఉంది.

# బీజాపూర్‌లో 41 మంది మావోయిస్టుల లొంగుబాటు

### వీరిపై 1.19కోట్ల రివార్డు



**చర్ల,నవంబరు 26, ప్రభాతవార్త:** చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టు ఉద్యమాని ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మావోయిస్టు అగ్రనేతలు నంబాల కేశవరావు హిడ్మా మరి కొందరు కేంద్ర కమిటి సభ్యుల మరణం అదే క్రమంలో మరి కొందరి అగ్రనేతల లొంగుబాట్లతో నిస్తేజంలో ఉన్న దళ సభ్యులు ఏరియా కమిటి సభ్యులు లొంగుబాటుకు సిద్ధం అయ్యారు. ఈ క్రమంలో బీజాపూర్ జిల్లా ఎస్పీ ఎదుట 41 మంది మావోయిస్టులు లొంహిపొయారు. లొంగిపోయిన వారిపై 1.19కోట్ల రివార్డ్ ఉన్నట్లు వెల్లడించారు. చత్తీస్‌గఢ్ ప్రభుత్వం నక్సల్ నిర్మూలన మరియు పునరావాస విధానం పధకంపై సానుకూల ఫలితాలు వస్తున్నాయని మరోసారి స్పష్టంగా కనిపించాయని ఎస్పీ అన్నారు. లొంగిపోయిన వారిలో 12 మంది మహిళలు ఉన్నారని బెటాలియన్ నంబర్ 1 వివిధ ఏరియా కమిటీల సభ్యులు ప్లాటూన్ కంపెనీ మిలీషియా కమిటి సభ్యులు ఉన్నారు. పోలీసుల వివరాల ప్రకారం సౌత్ సబ్ జోనల్ బ్యూరో నుండి 39 మందిమావోయిస్టులు ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర కమిటి ధమ్తారి గరియాబంద్ నౌవాపాడ డివిజన్ సభ్యులు ఉన్నారు. పునరావాసం భద్రత మరియు సంభాషణ ఆధారిత విధానం నియ్యద్ నెల్లా నార్ పథకం కార్యకర్తలను లొంగిపోవడానికి మూలకా రణం అని జనవరి 2025 నుండి రాష్ట్రంలో నక్సలైట్ సంఘటనలలో పాల్గొన్న 528 మంది మావోయిస్టులను అరెస్టు చేయగా 560 మంది లొంగిపోయారు. ఇదే సమయంలొ వివిధ ఎన్‌కౌంటర్లలో 144 మంది మావోయిస్టులు మరణించారు. జనవరి 2024 నుండి ఇప్పటి వరకు 790 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసారని 1,031 మందిని అరెస్టు చేసామని 202 మంది ఎన్‌కౌంటర్లలో మరణించినట్లు వెల్లడించారు. లొంగిపొయిన ఒక్కొక్కరికి 50 వేల రూపాయల తక్షణ సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో సిఆర్ పిఎఫ్ ఉన్న తాధికారులు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### దేవాలయ కల్యాణంలో విషాదం

# కరెంట్ షాక్‌తో బాలిక మృతి

**కొడిమ్యాల, ప్రభాతవార్త:** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయ వేడుకలో జరిగిన విషాద ఘటన గ్రామాన్ని కలచివేసింది. స్థానిక తిప్పర వేణి నాగరాజు (38), ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన వారు, నవంబర్ 26న కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి వివరించిన ప్రకారం తన పెద్ద కూతురు తిప్పర వేణి మధుశ్రీ (11) నవంబర్ 25వ తేదీ రాత్రి జరిగిన వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం సమయంలో కరెంట్ షాక్‌కు గురై మృతిచెందింది. ఫిర్యాదు వివరాల ప్రకారం రాత్రి 10గంటల 45ని. సమయంలో దేవాలయంలో గల మెట్ల వద్ద ఇతర చిన్నారులతో కలిసి ఆడుకుంటున్న మధుశ్రీకి, కళ్యాణోత్సవం కోసం అమర్చిన అలంకరణ ఎలక్ట్రిక్ లైటింగ్ వైర్లు మెడకు తగిలి తీవ్ర ఎలక్ట్రిక్ షాక్ తగిలింది. వెంటనే కుటుంబ సభ్యులు, భక్తులు ఆమెను కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ, స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ప్రాణం కోల్పోయినట్లు తెలిపారు. తన కూతురు మృతికి కారణం దేవాలయం మేనేజ్ మెంట్ పర్యవేక్షణ లోపం, భద్రతా నియమాలు పాటించకపోవడం, లైటింగ్ అమరిక చేసిన వ్యక్తి నిరక్ష్యం అని ఫిర్యాదులో తండ్రి పేర్కొన్నారు.

# 'సర్'పై స్టే ఇవ్వలేం




### విచారణ కొనసాగిస్తాం: సుప్రీంకోర్టు స్పష్టీకరణ

### కేరళ, తమిళనాడు, బెంగాల్ పిటిషన్లు

### వేర్వేరుగా విచారణ తేదీలు ఖరారు

### కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు

### అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశం

**న్యూఢిల్లీ, నవంబరు 26:** దేశవ్యాప్తంగా కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్- ఎస్ఐఆర్)ను తక్షణమే నిలిపేయడం సాధ్యం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ అంశంపై స్టే విధించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇప్పటికే ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతున్నందున, ఈ దశలో దానిపై స్టే ఇవ్వడం సాధ్యం కాదని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. అయితే, ఈ పిటిషన్లపై విచారణ కొన సాగిస్తామని తెలిపింది. మరోవైపు ఎస్ఐఆర్ నిలిపేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై వివరణ ఇవ్వాలని, దీనికి సంబంధించిన పూర్తి వివరాలతో అఫి డవిట్ దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదే శిం చింది. దీంతో ఈ అంశంపై తుది నిర్ణయం కోసం కోర్టు తదుపరి విచారణ చేపట్టనుంది. అలాగే ఎస్ఐఆర్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టు విచారణ తేదీలను ఖరారు చేసింది. కేరళ రాష్ట్రానికి సంబంధించిన పిటిషన్లను డిసెంబరు 2న, తమిళనాడు పిటిషన్లను డిసెంబరు 4న, పశ్చిమ బెంగాల్‌కు సంబంధించిన పిటిషన్లను డిసెంబరు 9న విచారణ చేపట్టనున్నట్లు తెలియజేసింది. ఈ విధంగా పలు రాష్ట్రాల్లోని ఓటర్ల జాబితా సవరణపై దాఖ లైన సవాళ్లను సుప్రీంకోర్టు ఒకేసారి విచారణకు స్వీకరించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

# రాజ్యాంగ విధులే ప్రజాస్వామ్యానికి పునాదులు

### కొత్త ఓటర్లను గౌరవించండి

### దేశ ప్రజలకు ప్రధాని మోడీ లేఖ

### రాజ్యాంగం వల్లే ప్రధానినయ్యా

### సోషల్ మీడియాలో మోడీ ట్వీట్



**న్యూఢిల్లీ, నవంబరు 26:** దేశంలోని ప్రతి పౌరుడు రాజ్యాంగ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. పౌరుల రాజ్యాంగ విధులే బలమైన ప్రజాస్వామ్యానికి పునాదులని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ దేశ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. దేశంలో నూతన ఓటర్లను గౌరవించాలని అందులో కోరారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్లను గౌరవిస్తూ పాఠశాలలు, కళాశాలలు రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా ప్రధాని మోడీ సూచించారు. విధుల నిర్వహణ నుంచే హక్కులు పుట్టుకొస్తాయని, జాతిపిత మహాత్మా గాంధీ దీన్నే విశ్వసించారని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. విధులను నిర్వర్తించడం అనేది సామాజిక, ఆర్థిక పురోగతికి పునాది వంటిదని స్పష్టం చేశారు.

నేడు మనం తీసుకునే నిర్ణయాలు, నిర్వర్తించే బాధ్యతలే.. భావి జీవితాన్ని నిర్మిస్తాయని ప్రధాని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా చెప్పారు. దేశం వికసిత్ భారత్ దిశగా ముందడుగు వేస్తున్నప్పుడు పౌరులు కూడా తమ విధులను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. దేశం మనకు చాలా ఇచ్చిందనే ఆలోచన వస్తే, ప్రతీ ఒక్కరు బాధ్యతాయుతంగా, స్వచ్ఛందంగా విధులను నిర్వర్తించేందుకు సిద్ధమైపోతారని మోడీ పేర్కొన్నారు. మన ప్రతి చర్య, ప్రతీ నిర్ణయం దేశ లక్ష్యాలు, ప్రయోజనాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని, తద్వారా భారత రాజ్యాంగ నిర్మాతల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. "మన రాజ్యాంగం.. గౌరవం, సమానత్వం, స్వేచ్ఛ వంటి వాటికి అత్యంత ప్రాముఖ్యతను ఇస్తుంది. మనకు హక్కులను కల్పిస్తూనే.. పౌరులుగా మన విధులనూ గుర్తుచేస్తుంది. వీటిని నెరవేర్చడానికి మనం ఎల్లప్పుడూ ప్రయత్నించాలి. అవే బలమైన ప్రజాస్వామ్యానికి పునాది" అని మోడీ పేర్కొన్నారు.

### రాజ్యాంగం వల్లే ప్రధానమంత్రి అయ్యా

"నేనొక సామాన్య కుటుంబం నుంచి వచ్చాను. ఆర్థికంగా మా కుటుంబం పరిస్థితి అంతంతే. అయినా గత 24 ఏళ్లుగా దేశ ప్రజలకు సేవ చేయగలుగుతున్నా. 2014లో తొలిసారి పార్లమెంటు భవనంలోకి అడుగుపెట్టేటప్పుడు వినమ్రంగా వంగి మెట్లకు మొక్కాను. ఎందుకంటే అది ప్రజాస్వామ్య దేవాలయం. 2019లో పార్లమెంటు సెంట్రల్ హాల్ వేదికగా నేను వినమ్రంగా వంగి నుదుటితో భారత రాజ్యాంగ గ్రంథాన్ని తాకి నమస్కారాలు సమర్పించాను. నాలాంటి ఎంతోమందికి ఎన్నో అవకాశాలను భారత రాజ్యాంగం ఇచ్చింది. నా లాంటి వాళ్లకు కలలు కనే శక్తిని, ఆ దిశగా పనిచేసేలా బలాన్ని రాజ్యాంగమే ప్రసాదించింది' అని ప్రధాని మోడీ తెలిపారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్యాంగ నిర్మాతలకు ప్రధాని మోడీ నివాళి అర్పించారు. రాజ్యాంగ దినోత్సవం వేళ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

# సిఎం రేవంత్ అభివృద్ధి, దార్శనికత నా విజయానికి మూలం

## గాంధీభవన్‌లో మీడియాతో ఎమ్మెల్యే నవీన్ యాదవ్



బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న నవీన్ యాదవ్

**హైదరాబాద్, నవంబరు 26,ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్ర ప్రజల ఆర్థికాభ్యున్నతికి అనుసరిస్తున్న దార్శనికత నా విజయానికి మూలం అని జూబ్లిహిల్స్ నుంచి నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే నవీన్ యాదవ్ అన్నారు. గాంధీ భవన్‌లో బుధవారం జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ 30 ఏళ్లుగా మా కుటుంబం సేవ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉందని రాజకీయ అవకాశం రావడంతో మరింతగా సేవ చేయడానికి వీలవుతోందని అన్నారు. టిపిసిసి అధ్యక్షుడిగా రేవంత్ నాయకత్వం నేను గతంలో మా ప్రాంత ప్రజలు కి అండగా ఉండటానికి కాంగ్రెస్ పార్టీలో చేరానని నేను ఎమ్మెల్యే అవ్వాలి అనుకున్న అవకాశం ఉప ఎన్నిక ద్వారా వచ్చిందని ఆయన వివరించారు. మాగంటి గోపినాథ్ చనిపోక పోయిన బైపోల్ వచ్చేదనీ, ఆయన కేసు కోర్ట్ లో ఉన్నపుడే కాలం చేశారని ఆయన చెప్పారు. ఆయన చనిపోవడంతో కేసు వెనక్కి తీసుకొన్నానని తెలిపారు. ఉప ఎన్నికల్లో సపోర్టు చేసిన ఎంఐఎం పార్టీకి కృతజ్ఞతలు జూబ్లీ హిల్స్ అభ్యర్థిగా అవకాశం కల్పించిన ఎఐ సిసి నాయకత్వానికి,సీఎం రేవంత్ రెడ్డి, ఇంచార్జీ మీనాక్షి నటరాజన్,టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌కు ధన్యవాదాలు అని అన్నారు. నా గెలుపు కోసం కృషి చేసిన సిఎం, టిపిసిసి చీఫ్, కేబినెట్ మంత్రులు, కార్పొరేషన్ చైర్మన్లు స్థానిక నాయకత్వాని ఎంకరేజ్ చేసిం దుకు పార్టీ పెద్దలకు ధన్యవాదాలు అన్నారు. ఎమ్మెల్యేగా గెలిపించిన జూబ్లీ హిల్స్ ప్రజలకు రుణపడి ఉంటానని ప్రకటించారు. భారతదేశ రాజ్యాంగ వజ్రోత్స వాల వేళ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయడం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన అన్నారు. జూబ్లీ హిల్స్ గెలుపు మాదిరి స్థానిక సంస్థల ఎన్నికల్లోను కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మంచి మెజారిటీ ఇచ్చనా జూబ్లీ ప్రజలకి ధన్యవాదాలు అని అన్నారు. జూబ్లీ హిల్స్ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలపెట్టుకుం టాననీ తెలిపారు. జూబ్లీ హిల్స్ అభివృద్ధికి కోసం పనిచేస్తాననీ వివరించారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ కోసం కృషి చేస్తాననీ తెలిపారు. అభివృద్ధి పనులను ప్రజలకి అందించటం తో పాటు ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచాక నియోజక వర్గంలోని స్థానిక సమస్యలు నా దృష్టికి వచ్చాయనీ అన్నారు. సోషల్ మీడియాలో నాతో పాటు కుటుంబ సభ్యులను వ్యక్తిగత హనానికి పాల్పడ్డారనిఆవేదన చెందారు. ప్రజలు నాకు అండగా వెన్నంటి ఉన్నారని తెలిపారు. జూబ్లీ హిల్స్ గెలుపు ప్రజలకు కాంగ్రెస్ పార్టీ పై నమ్మకానికి మరింత పెంచిందని చెప్పారు. విలేకర సమావేశంలో కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, కాల్వ సుజాత, ఒబ్బుల్ల కొత్వాల్, అధికార ప్రతినిధి లింగం యాదవ్, జనరల్ సెక్రటరీ అల్లం భాస్కర్, నిజాముద్దీన్



ఆపరేషన్ జరిగిన రోగితో పాటు వైద్యులు, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి

# గాంధీలో అరుదైన శస్త్రచికిత్స

**సికింద్రాబాద్, నవంబరు 26 ప్రభాతవార్త:** గాంధీ ఆస్పత్రిలో వైద్యులు అరుదైన శస్త్రచికిత్స ను నిర్వహించారు. భూపాలపల్లిజిల్లా కు చెందిన 24యేళ్ల విజయ్ కుమార్ శ్వాస తీసుకోవడంలో, మాట్లాడేటప్పుడు ఇబ్బంది పడుతూ ఆసుపత్రిని ఆశ్రయించాడు. గత ఆగస్టు 13న ఆయన విషం సేవించిన కారణంగా ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందాడు. పరిస్థితి తీవ్రత కారణంగా ఆగస్టు 25న ట్రాకియోస్టమీ చేయాల్సి వచ్చింది. సెప్టెంబర్ 5న డిశ్చార్జ్ అయిన తరువాత 15 రోజులకే మళ్లీ శ్వాస సమస్యలు రావడంతో, ఆయన నిమ్స్ ఆసుపత్రిలోని సిటీ సర్జరీ విభాగాన్ని సంప్రదించారు. అక్కడ జరిగిన పరీక్షల్లో సబ్‌గ్లోట్టిక్ ట్రాకియల్ స్టెనోసిస్ ఉన్నట్లు తేలింది. దీనికి బాలూన్ డైలటేషన్ చేపట్టిన ప్పటికీ రోగి పరిస్థితిలో పెద్దగా మార్పు లేకపోవడంతో శస్త్రచికిత్స అవసరమని నిర్ణయించారు. అయితే ఈ శస్త్రచికిత్సకు అధిక ప్రమాదం ఉండటం, ఆర్థిక ఇబ్బందులు ఉండటం వల్ల మొదట వైద్యులు కాన్సర్వేటివ్ ట్రీట్మెంట్ కొనసాగించారు. ఆ తరువాత రోగి గాంధీ ఆసుపత్రిలోని సిటీ సర్జరీ విభాగాన్ని సంప్రదించి, అక్కడ చేర్పించి పూర్తిస్థాయి పరిశీలన అనంతరం శస్త్రచికిత్స జరుపడానికి నిర్ణయించారు. నవంబర్ 12న విజయ్ కుమార్‌కి ట్రాకియల్ రీసెక్షన్‌తో పాటు అనస్టమోసిస్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యుల బృందంలో డాక్టర్ జి. రవీంద్ర (సీటీవీఎస్ హెచ్.ఓ.డి), డాక్టర్ ఎం. త్రిభువన్ కుమార్ (అసోసియేట్ ప్రొఫెసర్, సీటీవీఎస్), డాక్టర్ వై. హర్షిత (అసిస్టెంట్ ప్రొఫెసర్, సీటీవీఎస్) , డాక్టర్ రాజశేఖర్ (సీటీవీఎస్) డాక్టర్ భానోదయ (నివిగి హెచ్.ఓ.డి), డాక్టర్ మురళి, డాక్టర్ కిరణ్, డాక్టర్ షేఖర్ తదితరులు ఉన్నారు. ఈ శస్త్రచికిత్స విజయవంతం కావడంతో రోగి ఆరోగ్యం మెరుగుపడుతోందని వైద్యులు తెలిపారు. గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆర్.యం.ఓలు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ నవీన్, డాక్టర్ హాసితలు వైద్య బృందాన్ని అభినందించారు. సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్షల విలువైన వైద్యం గాంధీ ఆసుపత్రిలో ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు, వైద్య బృందం ఈ ఆపరేషన్ విజయవంతం కావడంతో తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. వైద్య బృందానికి ధన్యవాదాలు తెలిపారు.

# బిసి రిజర్వేషన్‌ను ఉద్దేశపూర్వకంగా అడ్డుకొంటున్న బిజెపి

## అరాచకశక్తులు రాజ్యాంగాన్ని మార్చు చేయాలని చూస్తున్నాయి: టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్



బుధవారం నీలకంఠేశ్వర్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, నవంబరు 26ప్రభాతవార్త:** బిజెపి ఉద్దేశ్యపూర్వకంగా బిసి రిజర్వేష్ అడ్డుకొంటుందని ఆరోపించారు. బుధవారం నిజమాబాద్‌లోని కంఠేశ్వర్ సమీపంలోని నీలకంఠేశ్వర్ ఆలయంలో టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం పరిసరాల్లో ఆయన పర్యటించి ఆలయ వైభవం, అభివృద్ధి వివరాలను అర్చకులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు, వేధోచరణల మధ్య టిపిసిసి చీఫ్‌కి ఆలయ అర్చకులు, దేవాధికారులు ఘన స్వాగతం పలికారు. పూర్ణకుంభంతో స్వాగత సత్కారం అందించారు. యూత్ కాంగ్రెస్‌తో కలిసి వెళ్ళి ఢిల్లీలో ధర్నా చేసినా కేంద్రంలోని ఢిల్లీ పాలకులకు కనువిప్పు కలుగలేదని 42శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి వారికి చేతులు రావడంలేదని ఆవేదన చెందారు. గ్రామసర్పంచ్‌లు లేక గ్రామపాలన కుటుంపడుతోందని అందుకే ఎన్నికలు జరుపాల్సి వస్తోందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలలో బిజెపి గెలవడం ఒక కలగా ఆయన అభివర్ణించారు. బిసి రిజర్వేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉందని అన్నారు. బిసి రిజర్వేషన్ ఇచ్చే ప్రక్రియ కాంగ్రెస్‌పార్టీ ఆపలేదని ఆయన స్పష్టం చేశారు. భారత రాజ్యాంగం కేవలం చట్టాల సమాహారమాత్రమే కాకుండా, స్వాతంత్ర్య కోసం పోరాడిన వీరుల కలలు, త్యాగాలు, సంకల్పాలను ప్రతిబింబించే మహత్తర గ్రంథమని టిపిసిసి అద్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. విలేఖరులతో మాట్లాడతూ రాజ్యాంగ వజ్రోత్సవాల సందర్భంగా తెలంగాణ ప్రజాలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాజ్యాంగం మన ప్రజాస్వామ్య వ్యవస్థకు, సమాఖ్యస్ఫూర్తికి బలమైన పునాది అని ఆయన అభిప్రాయపడ్డారు. లౌకికత, సమానత్వ భావనలను సూచించే ప్రాథమిక పత్రంలా పని చేస్తుందని పేర్కొన్నారు. రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సహా అన్ని రాజ్యాంగ నిపుణుల సలహాలు సంప్రదింపులు జరిపి సమాఖ్య స్ఫూర్తి, బహుభాషల పుట్టినిల్లైయిన భారత దేశంలో అందరికి ఆచరణయోగ్యమైన రాజ్యాంగంను మనకు అందించారిన అన్నారు. బిఆర్ అంబెద్కర్‌కు నివాళి తెలపడం ప్రతి భారతీయుడి కర్తవ్యమని గుర్తుచేశారు.. అనేక భాషలు, సంస్కృతులు, మతాలున్న భారత దేశాన్ని ఐక్యంగా ముందుకు నడిపించే శక్తిగా రాజ్యాంగాన్ని గుర్తించాలనీ అన్నారు. నేటి యువతకు రాజ్యాగాన్ని చదవటం, అర్థం చేసుకోవటం అత్యంత కీలకమని, ప్రజాస్వా మ్యంలో పౌర బాధ్యత ఓటు వేయడం మాత్రమే కాకుండా రాజ్యాంగ విలువలను గౌరవించి వాటిని ఆచరణలో పెట్టుకోవడమే నిజమైన బాధ్యతనని ఆయన గుర్తుచేశారు. రాజ్యాంగ దినోత్సవం మన ప్రజాస్వామ్య భవిష్యత్తు కోసం రాజ్యాంగ విలువల పరిరక్షణకు అంకితభావాన్ని పునరుద్ఘాటించుకునే సమయం అని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. దేశ అభివృద్ధి పథంలో రాజ్యాంగమే శాశ్వత మార్గదర్శి అని ఆయన అభిప్రాయపడ్డారు. భారత రాజ్యాంగ వజ్రోత్సవాల వేల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ను స్మరించుకుంటు నివాళులు అర్పింస్తున్నామని ఆయన తెలిపారు. భారత రాజ్యాంగం యావత్ ప్రపంచంలోకెల్లా గొప్ప రాజ్యాంగం మనదని అన్నారు. ప్రతి పౌరుడు రాజ్యాంగ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాల్సిన అవసరం ఉందనితెలిపారు.. దేశంలో కొన్ని అరాచక శక్తులు రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నాయనీ హెచ్చరించారు. గాంధీ, నెహ్రూను మరిపించి దేశ చరిత్రను తిరగరాసే కుట్ర జరుగుతుందని అన్నారు. విద్యా వంతులు, మేధావులు అరాచక శక్తుల కుట్రలను తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు భారత రాజ్యాంగం ఇతర దేశాలకు స్ఫూర్తి అని ఆయన తెలిపారు.

# పంచాయతీలను నిర్వీర్యం చేసిన కాంగ్రెస్

## స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి బిజెపి శ్రేణులు సిద్ధం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



**హైదరాబాద్,నవంబరు 26,ప్రభాతవార్త:** తెలంగాణలో పంచాయతీ వ్యవస్థను కాంగ్రెస్‌పార్టీ నిర్వీర్యం చేసిందని గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు జరపకుండా కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల ప్రవాహంను అడ్డుకొందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. బుధవారం పంచాయతీ ఎన్నికలపై బిజెపి అధ్యక్షుడు రామచందర్‌రావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో స్థానిక ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన విధానాలను చర్చించారు. బిజెపి అధ్యక్షుడు రాష్ట్రచందర్ రావు మాట్లాడుతూ అన్ని స్థానాల్లో బిజెపి పోటీ చేసేలా చర్యలు తీసుకొంటున్నామని, అదేవిధంగా కేంద్రం నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతోందని ప్రజల్లోకి తీసుకొని వెళ్లడానికి ఈ ఎన్నికలు ఒక సాధనంగా ఎంచుకోవాలని అన్నారు. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలపై బిజెపి కీలక నిర్ణయం తీసుకుంది. వార్డు మెంబర్ స్థాయి, సర్పంచ్ నుంచి ఎంపిటిసి, ఎంపిపి, జడ్పీటిసి, జిల్లా పరిషత్ వరకు స్థానిక సంస్థలలో పైకి కనపడే ఐదు అంచలలో క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులను గెలిపించుకొని ఒకవైపు దైవధార్మిక కార్యక్రమాలతో ప్రజలను సంఘటిత పరుస్తూ, అభివృద్ధిని మేళవించి రానున్నశాసనసభ ఎన్నికల్లో ప్రభావంచూపేందుకు బలమైన పునాది ఏర్పాటు చేసుకోవాలని కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ సూచించారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలలో పంచాయితీలను పూర్తిగా నిర్వీర్యం చేసిన కాంగ్రెస్ పార్టీ ఏ ముఖం పెట్టుకొని ఎన్నికల్లో పోటీ చేస్తుందని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీలన్ని దివాళా కాళా తీసే పరిస్థితికి బిఆర్ఎస్ తీసుకువస్తే దాన్ని కొనసాగించింది కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. రైతు వేదికలు, హరితహారం, శ్మశానవాటికలు ఏవి కట్టినా అవన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులేనన్నారు. ఏ పని కూడా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా కేటాయించలేదన్నారు. ఉపాధి హామీ పథకం నిధులు కూడా డైవర్ట్ చేసిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీ, కెసిఆర్ దేనన్నారు. గ్రామీణ పేదలను బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కామారెడ్డి డిక్లరేషన్ బూటకం అని తేలిపోయిందని బిసిలను ఏ రకంగా మోసం చేయాలని నూటికి నూరు శాతం కాంగ్రెస్ మోసం చేసిందని కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు. మహిళలకు పండగలకు చీరలను పెడతారు. కానీ ఇవాళ రాష్ట్రంలో తద్దినాలకు చీరలను పంచిపెడుతున్న పరిస్థితి కనిపిస్తోందని విమర్శించారు. రెండు బతుకమ్మ పండగలు పోయినా ఇవ్వని చీరలు గ్రామపంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ వస్తుందనగా హడావుడిగా పంపిణీ ప్రారంభించారని ఆరోపించారు. ఎలక్షన్స్ ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో వెంటనే చీరలు పంచుతూ మున్సిపాలిటిల్లో మాత్రం పంచడం లేదని ఇదంతా ఎన్నికల కోసమే చేస్తున్నారని అర్థం అవుతోందన్నారు. చీరలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పంపిణీ చేస్తున్నారని ఈ చీరలకు నిధులు ప్రభుత్వం నుంచి కేటాయించారా లేక గాంధీ భవన్ నుంచి కేటాయించారా అని నిలదీశారు.

# ప్రజాసామ్యాన్ని పరిరక్షిద్దాం

## కాంగ్రెస్ అధికార ప్రతినిధి లింగం

**హైదరాబాద్,నవంబరు26,ప్రభాతవార్త:** రాజ్యాంగాన్ని రక్షిద్దాం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి లింగం యాదవ్ అన్నారు.గాంధీ భవన్‌లో బుధవారం కాంగ్రెస్ అధికార ప్రతినిధి లింగం యాదవ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడటంతో రాహుల్ గాంధీ ఎనలేని పోరాటం చేస్తున్నారని తెలిపారు. దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజ్యాంగం పై దాడి చేస్తున్నదని అణగారిన వర్గాల హక్కులను హరించేలా వ్యవహరిస్తున్నదని దుయ్యబట్టారు. మనుస్మృతిని అమలు చేయాలని బిజెపి కుట్రలు చేస్తోందన్నారు. మరోవైపు ప్రజాస్వామ్యం కోసం కాంగ్రెస్ రాహుల్‌గాంధీ పోరుచేస్తుంటే ఆయనపై కూడా విమర్శలు చేస్తూ దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో రాజ్యాంగ వ్యవస్థలపై దాడి జరగడాన్ని ప్రజలు అడ్డుకోవాలనికోరారు. కాంగ్రెస్‌పార్టీకి అండగా ప్రజాస్వామం కోసం మేధావులు, విద్యావంతులు మేల్కొని ముందకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రాజ్యంగా వజ్రోత్సవాల వేళ టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మీడియా సమావేశంలో పాల్గొన్న వైస్ ప్రెసిడెంట్ కుమార్ రావు, కైలాష్ కుమార్,డాక్టర్ అన్సారీ, మిద్దే శ్రీని వాసులు, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

# 42 శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేయాలి

## దీక్ష శిబిరంలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



దీక్ష శిబిరంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, సిరికొండ మధుసూదన చారి, ఆర్.నారాయణ మూర్తి తదితరులు

**హైదరాబాద్ నవంబరు 26ప్రభాతవార్త:** జిఓ 46ను ఉపసం హరించుకుని, 42 శాతం రిజర్వేషన్‌ల అమలుకు ప్రభుత్వం ముందుకు రావాలని రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. కోర్టులో వాదనలు పూర్తికాకముందే, రాజ్యాంగ బద్దంగా తయారు చేసిన జి ఓ 09ను రద్దు చేయకుండానే మరో జీవో విడుదల చేయడం, అలాగే ఎన్నికల కమిషన్ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా బుధవారం విద్యానగర్ బీసీ భవన్‌లో ఆర్. కృష్ణయ్య ఒక రోజు రిలే నిరాహార దీక్షను చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహనరావు అధ్యక్షత వహించారు. దీక్ష శిబిర ప్రాంగణంలో ఆర్. కృష్ణయ్య ప్రసంగిస్తూ బీహార్ ఎన్నికలు ముగియగానే చడి చప్పుడు కాకుండా రిజర్వేషన్లను 42 శాతం నుంచి 22 శాతం తగ్గిస్తూ జీవో నెంబర్ జారీ చేయడం దారుణమని అన్నారు. రిజర్వేషన్ లను 17 శాతం తగ్గించి తీవ్ర అవకతవకలు పాల్పడ్డారన్నారు. జి ఓ 46 కారణంగా పలు జిల్లాల్లో, అనేక మండలాల్లో, గ్రామాల్లో బీసీలకు ఒక్క సర్పంచ్ లేదా వార్డు సభ్యుని సీటు కూడా కేటాయించలేదని, దాదాపు 1200 సర్పంచ్ పదవులు దక్కకుండా పోయాయని, లెక్కలతో సహా అధికారికంగా వివరించారు. ఈ మోసాన్ని ఖండిస్తూ ఈ నెల 29న రహదారుల దిగ్బంధం చేపట్టాలని ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. రిజర్వేషన్ల అమలు అయ్యేంత వరకు ఉద్యమాలను ఆపేది లేదని, అవసరమైతే రోజురోజుకు ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. శాసనమండలి ప్రతి పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న బి.సి వ్యతిరేక చర్యను ఖండించారు. డా. వకుళాభరణం కృష్ణమోహనరావు మాట్లాడుతూ కాంగ్రెస్ అంటే మోసం అనేది ప్రజలకు తెలిసి పోయిందన్నారు.

సినీ దర్శకుడు, నిర్మాత, నటుడు ఆర్. నారాయణ మూర్తి మాట్లాడుతూ, రేవంత్ ప్రభుత్వం ఇలా వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. బీసీ యునైటెడ్ ఫ్రంట్ చైర్మన్ పాలూరు రామకృష్ణయ్య మాట్లాడుతూ ఉద్యమాన్ని తీవ్రతరం చేసి హక్కులు సాధించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. రాష్ట్ర బీజేపీ బిసి మోర్చా అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ మాట్లా డుతూ బీజేపీ పెంచిన రిజర్వేషన్లు పూర్తిస్థాయి మద్దతు ఇస్తుందని తెలిపారు. జాతీయ బీసీసంక్షేమ సంఘం కోఆర్డినేటర్ డా. ర్యాగ అరుణ్ కుమార్ మాట్లా డుతూ రాష్ట్రం తప్పులు చేసి కేంద్రంపై ఆరోపణలు చేయడం అవివేకమని పేర్కొన్నారు.

బి.సి.నాయకులూ నీల వెంకటేష్, గోరేగే మల్లేష్, జిల్లపల్లి అంజి, గుజ్జ సత్యం, మోడీ రాందేవ్, భూమన్న యాదవ్, అనురాధ గౌడ్, అనం తయ్య, రాజేందర్, బాణాల అజయ్, ఎం. పృథ్వి గౌడ్, జి. పద్మ, శివ యాదవ్, భీం రాజ్, అరవింద్ స్వామి, కిషోర్ యాదవ్, రాజు గౌడ్, బాలయ్య, ప్రీతం తదితరులు పెద్ద ఎత్తున దీక్షలో పాల్గొన్నారు.

# రోస్టర్ విధానాన్ని సరిచేసి మాలలకు న్యాయం చేయాలి: చెన్నయ్య



అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రదర్శన నిర్వహిస్తున్న మాల నాయకులు

**హైదరాబాద్ (సైఫాబాద్), నవంబరు 26 ప్రభాత వార్త:** దేశ పౌరులందరికి రాజ్యాంగం, స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం అందించిన గొప్ప మేధావి డా.బి.ఆర్.అంబేద్కర్ అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు కొనియా డారు. రాజ్యంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ట్యాంక్‌బండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ విధానంలో మాలలకు ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆరోపించారు. రాజ్యాంగ బద్ధమైన హక్కులను ప్రభుత్వం కాలరాస్తూ విద్యా, ఉద్యోగ అవకాశాలను మాలలకు దక్కనీయకుండా చేసిందని వారు విమర్శించారు. కుట్రపూరితంగా తయారు చేసిన రోస్టర్ పాయింట్ల కేటాయింపును సరిచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంబేద్కర్ ఇచ్చిన భిక్షతో ఎన్నికైన మాల ప్రజాప్రతినిధులు అట్టడుగున ఉన్న మాలల కోసం గోంతు విప్పాలని, మాలల పట్ల నిరంకుశంగా వ్యవహ రిస్తున్న పాలకులకు తగిన గుణపాఠం చెప్పాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు రమేష్, బైండ్ల శ్రీనివాస్, ఎం.సరళ తదితరులు పాల్గొన్నారు.

# బిసిల రిజర్వేషన్ల సాధన కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటాలు

## 30న చలో హైదరాబాద్, 8, 9 తేదీలలో పార్లమెంట్ ముట్టడి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ తదితరులు

**హైదరాబాద్(సైఫాబాద్), నవంబరు 26 ప్రభాత వార్త:** ఎన్నికల షెడ్యూల్డ్‌తో సంబంధం లేకుండా బిసి జెఎసి ఉద్యమాన్ని గల్లీ నుంచి ఢిల్లీ వరకు తీవ్రతరం చేస్తామని రాష్ట్ర బిసి జాక్ చైర్మన్ జాజులు శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. ఇందులో భాగంగా ఈ నెల 30న 'చలో హైదరాబాద్' పేరిట ఇందిరాపార్కు వద్ద 'బిసిల రాజకీయ యుద్ధభేరి సభను వేలాది మందితో చేపడుతున్నామని చెప్పారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. డిసెంబరు 8, 9 తేదీలలో 'చలో ఢిల్లీ' పేరిట పార్లమెంట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించకపోగా 2019లో జరిగిన సర్పంచ్ ఎన్నికల కంటే త్వరలో జరగనున్న ఎన్నికల్లో నిట్ట నిలువున అన్యాయం చేసిందని, రోస్టర్ విధానం పేరుతో బిసిలను తడిగుడ్డతో గోంతు కోసిందని ధ్వజమెత్తారు. బిసిలకు రావాల్సిన జనరల్ స్థానాలను ఓసిలకు కేటాయిం చిందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బిజెపి పార్టీలు బిసిలకు ద్రోహులుగా మారాయని విమర్శించారు. బిసిలకు ఇంత అన్యాయం జరుగుతున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, సింఎ రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ స్పందించక పోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో బిసి జాక్ నేతలు గుజ్జ కృష్ణ, వేముల రామ కృష్ణ, పెరిక సురేష్, శ్యాం, శేఖర్, కుల్కచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు

# పౌల్ట్రీరంగానికి పెరుగుతున్న ఆదరణ

## చికెన్, గుడ్ల ఉత్పత్తిలో తెలంగాణ టాప్

### మంత్రులు తుమ్మల, పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, నవంబరు 26,ప్రభాతవార్త:** తెలంగాణలో పౌల్ట్రీరంగానికి ఆదరణ పెరుగుతుందని గుడ్లు, చికెన్ ఉత్పత్తిలో తెలంగాణ ముందు వరుసలో ఉందని మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్‌లు అన్నారు. ఈమేరకు బుధవారం మూడు రోజులపాటు హైటెక్స్‌లో నిర్వహిస్తున్నట్టు పౌల్ట్రీ ఎగ్జిబిషన్‌ను వారు సందర్శించి స్టాల్స్ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పౌల్ట్రీ ఎగ్జిబిషన్ నిర్వహించడం ద్వారా ఔత్సాహికులకు ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని అన్నారు. పౌల్ట్రీ రైతులు ఉపయోగపడే అధునాతన టెక్నాలజీ నీ ఉపయోగించి తక్కువ సమయంలో శ్రమ లేకుండా వాడే విధంగా దాన మిషన్లు , గుడ్లను తీసుకోవడం ఉపయోగించే అదునిక పరికరాలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన వ్యవసాయం వ్యవసాయేతర పరిశ్రమలకు ఎంతో ప్రాధాన్యం కల్పిస్తున్నారు ఫార్మా, సీడ్, వ్యవసాయ రంగంలో తెలంగాణ దేశంలో ముందు వరుసలో ఉండాలి అనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది తెలిపారు. పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్ మాట్లాడుతూ వికసిత్ భారత్ దిశగా, స్థిరమైన పౌల్ట్రీ భవిష్యత్తుకు దారితీస్తూ సస్టైనబుల్ ఫీడ్ సొల్యూషన్స్, ఆటోమేషన్, పౌల్ట్రీ వ్యాధులు, ఎరువుల నిర్వహణ, భవిష్యత్ ఉద్యోగావకాశాలు వంటి ముఖ్యమైన అంశాలపై దృష్టిసారించామన్నారు. ప్రస్తుతం భారతదేశం గుడ్ల ఉత్పత్తిలో రెండవ స్థానం బ్రాయిలర్ మాంస ఉత్పత్తిలో నాలుగో స్థానంలో ఉందన్నారు. మాంసం ఉత్పత్తిలో ప్రతి సంవత్సరం 8 నుంచి 10 వృద్ధి చెందుతుందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు రూ.1.35 లక్షల కోట్లకు పైగా తోడ్పడుతూ, పోషకాహారం, గ్రామీణాభివృద్ధి, ఉద్యోగావకాశాల పెరుగుదలకు కీలకంగా ఉందని అన్నారు. ఈ ఎగ్జిబిషన్ కు 50 దేశాల నుంచి 500కిపైగా ఎగ్జిబిటర్స్, 40,000కుపైగా సందర్శకులు పాల్గొంటారని తెలిపారు. అలాగే గురువారం సిఎం రేవంత్‌రెడ్డి ఎగ్జిబిషన్‌కు రానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌల్ట్రీ ఇండియా ట్రెజరర్ శ్రీకాంత్, చక్రధర్‌రావు, తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు కె. మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వి. నరసింహారెడ్డి, దేశ విదేశాలనుండి పౌల్ట్రీ రైతులు పాల్గొన్నారు.

# భద్రతా ప్రమాణాల్లో అగ్రగామి తెలంగాణ ఆర్‌అండ్‌బి శాఖ

## సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణానికి ఎన్ఎస్‌సిఐ ప్రశంసలు

### అధికారులను అభినందించిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్,నవంబరు 26,ప్రభాతవార్త:** నిర్మాణాల్లో భద్రతా ప్రమాణాల అమలులో విశేష ప్రతిభ కనబరుస్తూ తెలంగాణ రోడ్లు-భవనాల శాఖ జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రకటించిన జాతీయ భద్రతా అవార్డును రాష్ట్ర ఆర్‌అండ్‌బి శాఖ ఎంపికైంది. వరంగల్ రంగంపేటలో నిర్మాణం జరుగుతున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనుల్లో భద్రతా ప్రమాణాలు, పర్యవేక్షణ, కార్మిక భద్రత చర్యలు సమర్థంగా అమలైనందుకు ఈ అవార్డు లభించింది. ఎన్ఎస్‌సిఐ పరిశీలనలో భాగంగా ప్రాజెక్టు అమలు విధానం, భద్రతా ప్రోటోకాల్‌లు, మానిటరింగ్ సిస్టమ్, ప్రమాద నివారణ చర్యలు వంటి అంశాలను విశ్లేషించగా, రాష్ట్రం పాటించిన విధానం ఆదర్శంగా నిలిచిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ"ప్రభుత్వం చేపడుతున్న నిర్మాణాల్లో భద్రత అత్యంత ప్రాధాన్యం పొందుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రాజెక్టులు వేగంగా పూర్తవడంతో పాటు నాణ్యత, భద్రత, స్థిరత్వం కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. గత పది సంవత్సరాల్లో రాష్ట్రంలో ఆర్ అండ్ బి పరిధిలో సుమారు ఒక కోటి చదరపు అడుగుల ప్రభుత్వ నిర్మాణాలు జరిగితే,ప్రజా ప్రభుత్వం ఏర్పాటై నేను ఆర్ అండ్ బి శాఖ మంత్రి అయిన ఈ రెండు సంవత్సరాల్లోనే దాదాపుగా అదే స్థాయిలో కోటి చదరపు అడుగులు నిర్మాణాలు జరుగుతుండడం, ఆర్ అండ్‌బి శాఖ పనితీరుకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు". "అధునాతన

## సురక్షిత నిర్మాణాలకు జాతీయ అవార్డు

ఇంజినీరింగ్ పద్ధతులు, మానిటరింగ్, డిజిటల్ టెక్నాలజీల వినియోగం నిర్మాణాల్లో సమర్థవంతత పెంచుతుందని మంత్రి తెలిపారు. వేగం మాత్రమే కాదు భద్రత, నాణ్యత కూడా సమానంగా ఉండాలి అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం" అని తెలిపారు. ఈ అవార్డుతో తెలంగాణ ఆర్ అండ్‌బిశాఖ ప్రజా నిర్మాణాల్లో భద్రతా ప్రమా ణాలు అమలు చేసే ఉత్తమ ప్రభుత్వ శాఖల జాబితాలో నిలిచేలా కృషి చేసిన అధికారులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. గురువారం ఢిల్లీలో ఆర్ అండ్ బిశాఖ తరుపున సి.ఈ రాజ ేశ్వర్ రెడ్డి నేతృత్వంలోని బృందం అవార్డు అందు

# ఆకర్షణీయ విగ్రహాలను తయారుచేస్తూ..




'కాదేదీ కళకనర్హం' అన్నది అరవైమూడేళ్ల రత్న ముందాకి సరిగ్గా సరిపోతుంది. దాదా పాతికేళ్లుగా ధాన్యం పొట్టు ఆకర్షణీయ విగ్రహాలను తయారుచేస్తున్నారు.స్థానిక మహిళలకీ నేర్పిస్తూ ఉపాధి కల్పిస్తున్నారు. మనలోని సృజనాత్మకత వెలికి తీయాలే, ప్రకృతిలోనూ కళాకృతులు దాగుంటాయంటా పర్యావరణానికి చేటు చేయకుండా తన హస్ సంస్కృతీ సంప్రదాయన్ని జోడిస్తూ వస్తువులు, దేవతల బొమ్మలను తయారు చేస్తున్నారీమె.



ఒడిశాలోని నవరంగ పూర్‌రత్నది. కటక్‌లో ఏటా జరిగే బాలి యాత్రలో ఆమె దుకాణం ముందు పర్యటకులు తప్పక ఆగాల్సిందే. అవి అంతగా మంత్రముగ్ధుల్ని చేస్తు. ఇంట్లో ఖాళీగా కూర్చుంటే ఏం వస్తుంది? అందుకే ముప్పైఏళ్ల క్రితం మామగారి దగ్గర ఈ కళను నేర్చుకున్నా.దాన్నే వ్యాపకంగా మార్చుకున్నా. ఇప్పుడు అదే నా జీవనాధారమైంది. వీటి తయారీ వస్తువులు ధాన్యం పొట్టు, వెదురు, ఫెవికాల్ అయ్యే ఖర్చు తక్కువే కానీ చేయాడానికి ఓపిక చాలా అవసరం. ఒక విగ్రహాన్ని చేయడానికి దాదాపు పది గంటలు పడుతుంది. నా కష్టానికి నా కుటుంబం కూడా తోడయ్యింది. దాంతో ఎక్కువ మొత్తంలో వీటిని తయారు చేయగలుగుతున్నా. ప్రస్తుతం మార్కెట్‌లో మా బొమ్మలకు మంచి ధర పలుకుతుంది. దేశంలో ఎక్కడ ఎగ్జిబిషన్లు, స్టాల్స్ నిర్వహించినా అక్కడ మా దుకాణాలు ఏర్పాటుచేస్తాం. మొదట్లో ఒక్కదాన్నే చేసినా ఇప్పుడు 30 మంది మహిళలకు ఈ క్రాఫ్ట్‌లో శిక్షనిస్తున్నా. వాళ్లంతా ఇంటివద్దే ఉండి ఉపాధి పొందుతున్నారు. ఈ హస్తకళల్ని మేము ఇంటి అందాన్ని పెంచడానికి మాత్రమే కాదు. పాజిటివ్ ఎనర్జీని తీసుకొస్తాయనీ నమ్ముతాం అంటారీమె. □

## వ్యధ

# నెమ్మదిగా భయాలను అధిగమించండి..



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

**ప్రశ్న : సిగ్గు, బిడియం, సంకోచం నా పాలిట శాపంగా మారింది. నాకున్న నైపుణ్యం, సామర్థం ప్రదర్శించ లేక పోతున్నాను. నలుగురిలో కలవాలంటే సిగ్గు పడుతుంటాను. కొత్త వారితో మాట్లాడాలంటే చాలా భయంగా ఉంటుంది. సెమినార్లో మాటలు తడబడుతాయి. ఇంటర్వ్యూ సమయంలో భయం, ఆందోళన వల్ల తెలిసిన సమాధానాలు కూడా సక్రమంగా చెప్పలేక పోతున్నాను. దీని వల్ల పెద్ద కంపెనీలలో ఉద్యోగం పొందలేక ఓ చిన్న సంస్థలో తక్కువ జీతానికి పని చేస్తున్నాను. నేను పేరున్న కాలేజీలో బి టెక్ చదివి మంచి మార్కులతో పాసయ్యాను. నా వయస్సు 24 ఏళ్లు, ఎత్తు 160 సెంటీ మీటర్లు, చూడటానికి బాగుంటాను. అయితే భయం వల్ల అన్నింటా వెనకబడుతున్నాను. ఇది మానసిక రుగ్మత కావచ్చని కొందరు అంటున్నారు.ఈ సమస్యలను అధిగ మించేందుకు తగిన సలహాలు చెప్పండి. - ఒక సోదరి, రాజమండ్రి**

**జవాబు :** సిగ్గు, బిడియం, సంకోచం, భయం అన్ని సమయాలలో మానసిక రుగ్మతల లక్షణాలు కావు. ఇవి ప్రతి మనిషిలో సహజంగా కొంతవరకు ఉంటాయి. ఒక విధంగా చెప్పాలంటే ఇవి సహజ ప్రవర్తనా లక్షణాలు. పెంపకం, సెంటిమెంట్లు, సామాజిక కట్టుబాట్లు, ఇతరులతో పోలికలు తదితర అంశాలు ఇందుకు కారణం. బాల్యపు అనుభవాలు, అనుభూతులు కూడా ప్రభావం చూపుతాయి.అయితే, అవి అతిగా, రోజువారీ పనులకు అడ్డంకిగా, ఆత్మవిశ్వాసాన్ని తీవ్రంగా తగ్గించే స్థాయిలో ఉంటే మాత్రమే మానసిక ఆరోగ్య సమస్యల లక్షణాలుగా పరిగణించవచ్చు. అయితే ఇవి తీవ్రంగా ఉంటే మాత్రం యాంగ్జైటీ డిజార్డర్ ( ఆందోళన రుగ్మతలు) గా భావించాలి.అంటే భయం కలిగినపుడు నాడి, శ్వాస ఉద్రిక్తంగా అనిపించడం, గుండె వేగంగా కొట్టుకోవడం లాంటి లక్షణాలు ఉంటాయి. చెమటలు పట్టడం, గొంతు ఆగిపోవడం, మాట తడబడడం జరుగుతుంది. ఆత్మ విశ్వాసం తగ్గుతుంది. ఇవి మరింత



తీవ్రం అయితే పానిక్ అటాక్స్ వచ్చి కళ్ళు తిరిగి పడిపోతారు. ఇలాంటి దశలో మానసిక నిపుణులు లేదా వైద్యులను సంప్రదించాలి. అయితే మీలో ఇలాంటి లక్షణాలు లేనందున భయపడవలసిన పనిలేదు.ఈ సమస్యల నుంచి నెమ్మదిగా ప్రయత్నం చేయండి. చిన్న చిన్న పరిచయాలతో మొదలుపెట్టండి అద్దం ముందు మాట్లాడటానికి ప్రయత్నించండి.ధ్యానం, ప్రాణాయామం ( శ్వాస వ్యాయామాలు) సాధన చేయండి. స్టేజి మీద చిన్న ప్రసంగాలు సాధన చేయండి. రోజు ఒకరిద్దరు కొత్త వారితో మాట్లాడండి. మీలో ఉన్న ప్రత్యేకతలు గుర్తించండి. వాటి ద్వారా ఇతరుల ప్రశంసలు అందుకుంటే ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. క్రమ క్రమంగా అలవాటు చేసుకోండి. అవసరమైతే సైకాలజిస్టును కలవండి □

# ఒకసారి శరణు వేడిన చాలును!

నల్ల మస్తాన్ గారు గుంటూరుకు వచ్చిన తొలి దినాలలో ఒక రోజు ఉరుములు, మెరుపులతో కుంభవృష్టిగా వాన కురవసాగింది. విశేషమేమిటంటే ధ్యానం చేస్తున్న మస్తాన్ గారి ఇంటిపై ఒక వర్షపుచుక్క కూడ పడకపోవటం. ఇంతలో పిడుగు పడి ఒక మేక పిల్ల. ఒక మనిషి మరణించారు. వర్షం తగ్గింది. మస్తాన్ గారు సమాధి నుండి లేవగానే మరణించిన మేకపిల్ల కనిపించింది. ఆయన దానివద్ద కూర్చొని, భగవధ్యానం చేసి, దాని చుట్టూ ముమ్మారు తిరిగి 'ఉహో' అన్నారు. ఆ మేకపిల్ల లేచి మస్తాన్ గారి పాదాల సందునుండి దూరి వెళ్లిపోయింది. ఈ వార్త ఊరంతా వ్యాపించగా పిడుగుపాటుతో మరణించిన వ్యక్తి తల్లి వచ్చి, మస్తాన్ గారి పాదాలను పట్టుకుని వల, వల దుఃఖించింది. కరుణా సముద్రుడు ఆ తల్లి దుఃఖం చూడలేకపోయాడు. శవం వద్దకు పోయి దైవ ధ్యానం చేసి, శరీరాన్ని తాకాడు. వెంటనే విగత జీవికి ప్రాణం వచ్చింది. లేచి కూర్చున్నాడు. సంగతి గ్రహించి మస్తాన్ గారి పాదాలపై పడ్డాడు. మహనీయుల కరుణకు పాత్రమైన ఏ జీవి అయినా అదృష్టవంతులే, జంతువు కావచ్చు, మనిషి కావచ్చు. షిరిడీలోని ద్వారా కామాయిలో కొలువై ఉన్న సాయి ఇందుకు భిన్నుడు కాదు. అది 1917వ



సంవత్సరం. వైశాఖ మాసం (మే నెల). ఎండలు మండిపోతాయని ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. ఒక పిచ్చి కుక్కచే కరవబడిన ఒక చిన్ని కుక్క వెంటబడ్డారు. దిక్కులేని వారికి దేవుడే దిక్కు అనే నానుడి జంతువులకు కూడా వర్తిస్తుంది. అది ద్వారకా మాయిలోనికి పరుగు తీసింది. గ్రామస్తులందరు అది బయటకు వస్తే చంపటానికి బయట నిలబడి 'బాబా! ఆ కుక్క పిచ్చిది. వెలుపలకు తరమండి, దానిని చంపెదము అనగా, సాయిబాబా పిచ్చివారలారా! దూరంగా పొండు. దిక్కులేని ఈ చిన్న జీవిని చంపదలచినారా. అన్నాడు. ఆ జీవి రక్షణ పొందింది. అంతియే కాదు దాని పిచ్చి కూడా మటుమాయమైంది. సాయినాథుని పాదధూళితో పరమ పావనమైన ద్వారకామాయిని శరణు వేడిన వారికి ఆపదలు ఆమడ దూరం పోతాయి. సాయి రక్షణ పొందిన చాలు - భీతికి తావు ఉండదు.

# హద్దులు తప్పనిసరి

భార్యాభర్తల మధ్య ఎంత ప్రేమైనా ఉండొచ్చు. కానీ కొన్ని హద్దులు మాత్రం తప్పనిసరిగా ఉండాలి. అవే భవిష్యత్తులో మీరు



★ పెళ్లి నిశ్చయం అవగానే అతనితో ప్రతి చిన్న విషయాన్నీ చర్చించడం మొదలు పెడుతున్నారా? ఈ తీరు సరి కాదు. అప్పటికి అవి సంతోషంగా అనిపించినా తర్వాత అవే సమస్యలుగా మారతాయి. మన ఇష్టాయిష్టాలను పంచుకోవడంలో తప్పులేదు. కానీ మన గతం గురించి పూసగుచ్చినట్లు ప్రతిదీ చెబితే భవిష్యత్తులో వైవాహిక జీవితంలో సమస్యలు తలెత్తవచ్చు. ★. మీ బలహీనతలను అవతలి వారితో విపులంగా పంచుకోవడమూ మంచిది కాదు. భవిషత్తులో అవే వారికి ఆయుధాలుగా మారతాయి.

★ మనమధ్యలో డబ్బు ప్రస్తావన రాకూడదు లాంటి మాటలు పక్కనపెట్టి.. ఆర్థికాంశాల గురించి తప్పనిసరిగా మాట్లాడుకోవాలి. జీతం.. ఖర్చులు వంటివి ముందుగానే ప్రణాళిక వేసుకుంటే మంచిది. ఇద్దరూ ఉద్యోగస్థులైతే ఇంటిపని పంచుకోవడం వంటివి చర్చించు కోవడం తప్పనిసరి. అవతలి వ్యక్తి వీటికి సానుకూలంగానే ఉన్నారా తెలుసుకోండి. లేంటే పెళ్లి తర్వాత చిన్న విషయాలు అనుకున్నవే పెద్దగా మారి ఇబ్బందులు తెచ్చి పెడతాయి. □

# స్వీట్ పొటాటో బొబ్బట్లు

**కావలసినవి :** చిలగడదుంపలు-2 (మెత్తగా ఉడికించి, చల్లారాక, తొక్క తీసి.. కొద్దిగా పాలు కలిపి మెత్తటి గుజ్జులా చేసుకోవాలి) గోధుమ పిండి-ఒకటిన్నర కప్పులు, పసుపు-పావు టీ స్పూన్, నెయ్యి- 1 టేబుల్ స్పూన్, నీళ్లు-సరిపడా, బాదం, జీడిపప్పు-15 చొప్పున ఏలకులు-4, నెయ్యి-4 లేదా 5 టేబులన స్పూన్లు, బొంబాయి రవ్వ-పావు కప్పు, బెల్లం తురుము-అర కప్పు, ఉప్పు-చిటికెడు. **తయారీ విధానం :** ముందుగా జీడిపప్పు, బాదం, ఏలకులు మిక్సీలో వేసుకుని మెత్తగా పొడిలా చేసుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక పెద్దబౌల్ తీసుకుని అందులో గోధుమ పిండి, ఉప్పు, పసుపు ✦ టేబుల్ స్పూన్ నెయ్యి వేసుకుని బాగా కలిపి కొద్దికొద్దిగా నీళ్లు పోసుకుంటూ చపాతీ ముద్దలా చేసుకుని 10 నిమిసాల పాటు మూతపెట్టాలి. ఇప్పుడు స్టవ్ ఆన్ చేసుకుని పాన్‌లో ✦ టీ స్పూన్ల నెయ్యి వేసుకుని అందులో రవ్వ వేసుకుని సుమారు 2 నుంచి ✦ నిమిషాల పాటు గరిటెతో తిప్పుతూ చిన్నమంట మీద దోరగా వేయించాలి. అందులో చిలగడదుంప పేస్ట్ వేసుకుని గరిటెతో తిప్పుతూ..మరో 2 నిమిసాలు ఉడకనివ్వాలి.



అనంతరం బెల్లం తురుము వేసుకుని కలుపుతూ ఉండాలి. కాస్త దగ్గర పడిన తర్వాత జీడిపప్పు మిశ్రమం వేసుకుని కలపాలి. మరో టీ స్పూన్ నెయ్యి వేసుకుని తిప్పి.. ఒక బౌల్లోకి తీసుకుని చల్లారనివ్వాలి. అనంతరం గోధుమ పిండి ముద్దను చిన్న చిన్న నిమ్మకాయ సైజ్ బాల్స్‌లా తీసుకుని గిన్నెలా ఒత్తుకుని దానిలో కొద్దికొద్దిగా చిలగడదుంప మిశ్రమాన్ని పెట్టుకుని బాల్స్‌లా చుట్టుకోవాలి. వాటిపై కొద్దికొద్దిగా పొడి గోధుమ పిండి చల్లుకుంటూ చపాతీల్లా చేసుకుని నేతిలో దోరగా వేయించుకుంటే సరిపోతుంది. □

# NBK111 గ్రాండ్‌గా లాంచ్



వరుస బ్లాక్‌బస్టర్‌ల దూసుకెళ్తున్న గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, వీరసింహారెడ్డి సంచలన విజయం తర్వాత బ్లాక్‌బస్టర్ మేకర్ గోపీచంద్ మలినేనితో మరోసారి చేతులు కలిపారు. ఈ ఇద్దరి కొలాబరేషన్ లో హిస్టారికల్ ఎపిక్ NBK111 చిత్రాన్ని ప్రతిష్టాత్మక వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత వెంకట సతీష్ కిలారు గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. బాలకృష్ణ సరసన నయనతార కథానాయికగా నటిస్తున్నారు. సింహా, జై సింహా, శ్రీ రామరాజ్యం తర్వాత బాలకృష్ణ, నయనతార కలిసి నటిస్తున్న నాల్గవ చిత్రం ఇది. ఈ ప్రాజెక్టు నేడు హైదరాబాద్‌లో ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ స్క్రిప్టును నిర్మాతలకు అందజేశారు. బాలకృష్ణతో అనేక బ్లాక్‌బస్టర్‌లను అందించిన దర్శకుడు బి గోపాల్ క్లాప్ కొట్టారు. బాలయ్య కుమార్తె తేజస్విని కెమెరా స్విచ్ ఆన్ చేశారు. మొదటి షాట్‌కు బోయపాటి శ్రీను, బాబీ, బుచ్చి బాబు సమిష్టిగా దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమానికి స్టార్ దర్శకులు, నిర్మాతలు అనేక మంది ప్రముఖ అతిథులు హాజరయ్యారు. గోపిచంద్ మలినేని తొలిసారిగా హిస్టారికల్ డ్రామాలోకి అడుగుపెడుతున్నారు. కమర్షియల్ బ్లాక్‌బస్టర్స్ రూపొందించే తన ప్రత్యేక మాస్ టచ్‌ను ఒక భారీ చారిత్రక కథలో మిళితం చేస్తూ, నందమూరి బాలకృష్ణను ఇప్పటివరకు చూడని ఓ కొత్త అవతార్ చూపించబోతున్నారు. స్పెషల్ పోస్టర్‌లో బాలకృష్ణ.. ఒక చేతిలో ఖడ్గం, మరో చేతిలో యాంకర్ పట్టుకుని అఖండమైన రాజసంతో కనిపించారు. గడ్డం, పొడవాటి జుట్టు, శక్తివంతమైన తీరుతో సమరశూరుడిలా అదరగొట్టారు.



# 'మిస్టీరియస్' డిసెంబర్ 12 న విడుదల

మహి కోమటిరెడ్డి దర్శకత్వంలో అశ్లీ క్రియేషన్స్ పై జయ్ వల్లందాస్ నిర్మిస్తున్న 'మిస్టీరియస్' సినిమా సెన్సార్ పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధంగా వున్నది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ ఒక కొత్త స్క్రీన్ ప్లే తో పూర్తిగా సస్పెన్స్‌తో వున్న ఈ థ్రిల్లర్ సినిమా ప్రేక్షకుడిని ఆద్యంతం ఒక కొత్త అనుభూతికిలోను చేస్తుందని చెప్పారు. ఇటీవలే సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకొని డిసెంబర్ 12 వ తేదీ రోజున ప్రపంచవ్యాప్తంగా 150 థియేటర్స్‌లో విడుదల చేయాలనీ అందుకు ఏర్పాట్లు చేస్తున్నామని నిర్మాత జయ్ వల్లందాస్ చెప్పారు.మా సినిమాకి యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేశారు. సినిమా సహ నిర్మాత ఉషా, శివానీ మాట్లాడుతూ, సినిమాని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించాం. టీజర్ అందరికీ నచ్చడం సంతోషంగా ఉంది. ఈ సినిమాలో రోహిత్, మేఘన రాజపుట్, అభిద్ భూషణ్, రియా కపూర్, కన్నడ నటుడు బాలరాజ్ వాడి, శ్రీనివాస్ భోగిరెడ్డి, ఆకునూరి గౌతమ్, జబర్దస్త్ రాజమోళి, జబర్దస్త్ నవీన్ మరియు లక్కీ ఇందులో ప్రధాన భూమికను పోషిస్తున్నారు.కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం: మహి కోమటిరెడ్డి నిర్మాత: జయ్ వల్లందాస్ (గీళీతి)పాటలు మరియు సంగీతం: లీలి రాజాకెమెరా ఎడిటింగ్: పరవస్తు దేవేంద్ర సూరి (దేవా)ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రామ్ ఉప్పు పీ ఆర్వో : శ్రీపాల్ చోల్లేటి.






# 'చరా పచా - రింగ్ ఆఫ్ రౌడీస్' రిలీజ్




సాయికిరణ్ అడివి దర్శకత్వంలో సాయి కృష్ణ దమ్మాలపాటి హీరోగా ప్రదా పిక్చర్స్, సాయి సినీ చిత్ర ప్రొడక్షన్ నెం1 టైటిల్ ఖి16 రోజుల పండగఖి డైరెక్టర్ శేఖర్ కమ్ముల క్లాప్ తో మూవీ గ్రాండ్‌గా లాంచ్ మలయాళ సినిమాలో మొట్టమొదటి పూర్తి నిడివి గల జూజూనిజానర్ యాక్షన్‌కామెడీ చిత్రం"చరా పచా - రింగ్ ఆఫ్ రౌడీస్" ను ప్రముఖ తెలుగు నిర్మాణపంపిణీ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంతటా రిలీజ్ చేయనుంది. జనవరి 2026లో విడుదల కానున్న ఈ చిత్రం కేరళలో దుల్కర్ సల్మాన్ నేతృత్వంలోని వేఫేరర్ ఫిల్మ్స్ రిలీజ్ చేయనుంది. ఈ చిత్రానికి నూతన దర్శకుడు అద్వైత్ నాయర్ దర్శకత్వం వహించగా, రీల్ వరల్డ్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించింది. ఈ నిర్మాణ సంస్థను ట్రాన్స్ వరల్డ్ గ్రూప్, లెన్స్‌మన్ గ్రూప్ కలిసి ఏర్పాటు చేశాయి. రమేష్, రితేష్ రామకృష్ణన్, షిహాన్ షౌక్కత్, ఎస్. జార్జ్ మరియు సునీల్ సింగ్‌లు ఈ వెంచర్‌లో కీలక భాగస్వాములు.

# '16 రోజుల పండగ' కు అభినందనలు



షిహాన్ షౌక్కత్, ఎస్. జార్జ్ మరియు సునీల్ సింగ్‌లు ఈ వెంచర్‌లో కీలక భాగస్వాములు.అర్జున్ అశోకన్, రోషన్ మాథ్యూ, ఇషాన్ షౌక్కత్ "మార్కో" ఫేమ్), విశాఖ్ నాయర్, పూజా మోహన్‌దాస్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. వినాయకుడు, విలేజ్‌లో వినాయకుడు, కేరింత వంటి విజయవంతమైన చిత్రాలని అందించిన డైరెక్టర్ సాయికిరణ్ అడివి దర్శకత్వంలో రూపొందనున్న కొత్త చిత్రం '16 రోజుల పండగ'. సాయి కృష్ణ దమ్మాలపాటి హీరోగా పరిచయం అవుతున్నారు. గోపిక ఉదయన్ హీరోయిన్. ఈ చిత్రంలో రేణు దేశాయ్, అనసూయ భరద్వాజ్, వెన్నల కిషోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రదా పిక్చర్స్, సాయి సినీ చిత్ర బ్యానర్ పై ప్రొడక్షన్ నెం1గా సురేష్ కుమార్ దేవత, హారిత దుద్దుకూరు, ప్రతిభ అడివి నిర్మిస్తున్నారు. ఈ రోజు ఈ చిత్రం పూజాకార్యక్రమాలతో గ్రాండ్ గా ప్రారంభమైయింది. ముహూర్తపు సన్నివేశానికి కోన వెంకట్, కేకే రాధా మోహన్ నిర్మాతలకి స్క్రిప్ట్ అందించారు. డైరెక్టర్ శేఖర్ కమ్ముల క్లాప్ కొట్టారు. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కెమరా స్విచాన్ చేశారు. ఫస్ట్ షాట్‌కు డి.సురేష్ బాబు గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాతలు అల్లు అరవింద్ గారు, మైత్రి రవి గారు దామోదర ప్రసాద్‌గారు ఈ కార్యక్రమానికి హాజరై టీం కి అభినందనలు తెలిపారు.

# మహేష్ బాబు లాంచ్ చేసిన చైతన్య ఫస్ట్ లుక్



యువ సామ్రాట్ నాగ చైతన్య తండేల్ భారీ విజయంతో తర్వాత విరూపాక్షతో బ్లాక్ బస్టర్ అందుకున్న విజనరీ దర్శకుడు కార్తీక్ దండుతో ఇంతకు ముందు ఎప్పుడూ చూడని మైథలాజికల్ థ్రిల్లర్ కోసం చేతులు కలిపారు. ఈ అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను శీజుదిది సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బాపినీడు సమర్పిస్తున్నారు. రెండు ఆసక్తికరమైన గ్లింప్స్ తో ద్వారా భారీ అంచనాలను సృష్టించిన తర్వాత, నాగ చైతన్య పుట్టినరోజు ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని, మేకర్స్ ఇప్పుడు సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ ను రిలీజ్ చేశారు. సూపర్ స్టార్ మహేష్ బాబు తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను లాంచ్ చేశారు. టీం అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# 'ఆంధ్ర కింగ్ తాలూకా' అద్భుతమైన ఎమోషన్ సినిమా



ఎనర్జిటిక్ స్టార్ రామ్‌పోతి నేని మోస్ట్ ఎవైటెడ్ యూనిక్ ఎంటర్‌టైనర్ 'ఆంధ్ర కింగ్ తాలూకా'తో అలరించ బోతున్నారు. చిత్రం నవంబర్ 27న థియేటర్లలోకి వస్తుంది. ఈ సందర్భంగా కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**ఈ కథ విన్నప్పుడు మీ రియాక్షన్ ఏమిటి?**

ఈ కథని ఒక ప్రేక్షకుడిగా విన్నాను. స్టోరీ చెప్పగానే ఫ్యాన్స్‌కి కనెక్ట్ అయిపోయాను. ఇందులో చాలా అద్భుతమైన ఎమోషన్ ఉంది. అందరి జీవితంలో ఇలాంటి ఎమోషన్ వుంటుంది. అది నాకు ఎమోషనల్‌గా చాలా కనెక్ట్ అయ్యింది. అసలు అభిమానులు ప్రేమకు లాజిక్ వుండదు. ఎందుకు ఇంతగా ప్రేమిస్తారు? దానికి మనం అర్హులమేనా? అనిపిపిస్తుంటుంది కదా. అందుకు నేను బాగా కనెక్ట్ అయ్యాను.చిన్నప్పుడు సినిమా చూడటం పెద్ద విషయం. అదొక గ్రేట్ ఎక్స్ పీరియన్స్. ఏడాదికి ఒకసారి వెళ్ళడమే గొప్ప. నేను సినిమాల్లోకి వచ్చిన తర్వాత రజనీకాంత్ గారు, చిరంజీవి గారి సినిమాలను ఫస్ట్ డే ఫస్ట్ షో చూసేవాడిని. నాగార్జున గారి శివ సినిమా కూడా ఫస్ట్ డే ఫస్ట్ షో చూశాను.

**రామ్ గారితో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

రామ్ గారు ఎక్స్ట్రార్డినరీ ఎనర్జిటిక్ పెర్ఫార్మర్. ఇంటర్వెల్ సీక్వెన్స్‌లో ఆయన యాక్షన్ చూస్తే గూస్ బంప్స్ వస్తాయి. ఆ సీన్ మీరు చూసినప్పుడే మీరే చెప్తారు.

**భాగ్యశ్రీ గారితో మీకు కాంబినేషన్ సీన్స్ ఉన్నాయా?**

ఉన్నాయి. ఇందులో రామ్ గారు భాగ్యశ్రీ మధ్య కెమిస్ట్రీ చాలా అద్భుతంగా వర్క్ అయింది. ఒక రెట్రో ఫీలింగ్‌ని కలిగించే ఆ లవ్ స్టోరీ హార్ట్ టచ్చింగ్‌గా ఉంటుంది.

## వరల్డ్ యూత్ ఛాంపియన్‌షిప్‌లో

# భారత్‌కు రజతం

**న్యూఢిల్లీ:** టేబుల్ టెన్నిస్ ప్రపంచ యూత్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ రికార్డు సృష్టించింది. ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత్ జట్టు తొలిసారిగా రజత పతకాన్ని గెలుచుకుంది. కూడిన బాలుర అండర్ 19 ఈవెంట్‌లో పోటీ పడుతున్న అంకుర్, అభినంద్, ప్రియనుజ్‌తో కూడిన ముగ్గురూ, పునీత్ బిశ్వాస్‌తో కలిసి, స్వర్ణ పతక పోరులోకి ప్రవేశించి చరిత్ర పుస్తకాల్లోకి లిఖించుకున్నారు. ఈ క్రీడలో ప్రపంచ



ఛాంపియన్‌షిప్‌లో ఫైనల్‌కు చేరుకున్న తొలి భారత జట్టుగా నిలిచింది. జపాన్‌తో జరిగిన ఫైనల్ 0-3 తేడాతో ఓడిపోయిన తర్వాత భారత్ రజత పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. సెమీఫైనల్లో చైనీస్ తైపీ 2-2తో స్కోరు సమం చేయడంతో నిరాశపడ్డా, ఆ తర్వాత టైలోని చివరి మ్యాచ్‌లో అభినందన్ 3-0 తేడాతో విజయం సాధించి భారత్‌ను విజయపథంలో నడిపించాడు. 2025 యుటిటి ఫైనల్‌లో కూడా యు ముంబాను టైటిల్‌కు నడిపించాడు. మరోవైపు, అండర్ 19 ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్ 5 స్థానంలో ఉన్న అంకుర్ సీనియర్ సర్క్యూట్‌లో కూడా అగ్రశ్రేణి ఆటగాళ్లపై విజయాలు సాధించాడు. ఇక తన సహచరులంత ఫలవంతమైన ఆటగాడిగా లేకపోయినా, దేశీయ సర్క్యూట్‌లో తన అద్భుతమైన ఫలితాలను సాధిస్తూగత రెండు సంవత్సరాలుగా భారతదేశంలోని ప్రకాశవంతమైన ప్రతిభావంతులలో ఒకరిగా ప్రియానుజ్ తనకంటూ ఒక పేరు తెచ్చుకున్నాడు.

## ముస్తాక్ అలీ ట్రోఫీలో గుజరాత్ శుభారంభం

**న్యూఢిల్లీ:** దేశవాళీ టీ20 సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ-2025లో గుజరాత్ శుభారంభం చేసింది. ఎలైట్ సి గ్రూపులో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో సర్వీసెస్‌పై 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. ప్రస్తుతం ఆ జట్టు ఖాతాలో 36 పాయింట్లు ఉండగా విజయశాతం 75గా ఉంది. హైదరాబాద్‌లోని జింఖాన స్టేడియం వేదికగా టాస్ గెలిచిన గుజరాత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన సర్వీసెస్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. ఓపెనర్ గౌరవ్ కొచ్చర్ (60) మెరుపు అర్ధ శతకం బాదగా, అరుణ్‌కుమార్ (29), జయంత్ గోయత్ (29) రాణించారు. గుజరాత్ బౌలర్లలో హేమాంగ్ పటేల్, అర్జాన్ నాగ్వాస్వల్లా చెరో రెండు వికెట్లు తీయగా హర్షల్ పటేల్, రవి బిష్ణోయి, విశాల్ జేస్వాల్ తలా ఒక వికెట్ దక్కించుకున్నారు. ఇక లక్ష్య ఛేదనలో గుజరాత్ తొలి నుండీ దూసుకుపోయింది. ఓపెనర్లలో అర్య దేశాయ్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో ( 30 బంతుల్లో 60)తో హాఫ్ సెంచరీ చేయగా, కెప్టెన్ ఉర్విల్ పటేల్ అకాశమే హద్దుగా చెలరేగాడు. 31 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్న ఈ వికెట్ కీపర్ బ్యాటర్ మొత్తంగా 37 బంతుల్లో 119 పరుగులతో అజేయంగా నిలిచాడు. మిగిలిన వారిలో రిపాల్ పటేల్ డకౌట్ అయినా పెద్దగా ప్రభావం పడలేదు. 12.3 ఓవర్లలోనే కేవలం 2 వికెట్లు కోల్పోయి గుజరాత్ 183 పరుగులు చేసి జయభేరి మోగించింది.

ఆట

**న్యూఢిల్లీ:** ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ 2025లో భరత్ అద్లెట్లు చరిత్ర సృష్టించారు. శ్రీహరి నటరాజ్ ప్రారంభ రోజు ట్రిపుల్ స్వర్ణం గెలుచుకోగా, మీనాక్షి రోహిల్లా మొదటి బంగారు పతకాన్ని, పూజా బిష్ణోయ్ రజత పతకాన్ని సాధించారు. ఒలింపియన్ శ్రీహరి రెండు వ్యక్తిగత బంగారు పతకాలను గెలుచుకున్నాడు. అలాగూ పురుషుల 4+200 మీటర్ల ఫ్రీస్టైల్ రిలే స్వర్ణానికి కైవసం చేసుకున్నాడు. తొలుత పురుషుల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో 58.25 సెకన్ల సమయంతో బంగారు పతకంతో తన ప్రచారాన్ని ప్రారంభించాడు. తదుపరి కొన్ని



## ఖేలో ఇండియా గేమ్స్..

# శ్రీహరికి ట్రిపుల్ స్వర్ణం, మీనాక్షికి స్వర్ణం

### పూజకి రజతం

నిమిషాల్లోనే పూల్‌కు తిరిగి వచ్చి 50 మీటర్ల ఫ్రీస్టైల్ రేసులో ఆధిపత్యం చెలాయించాడు, 23.79 సెకన్లలో మొదట ప్యాడ్‌ను తాకాడు. ఇక సైక్లింగ్‌లో తొలిసారి పాల్గొన్న మీనాక్షి తొలి బంగారు పతకాన్ని సాధించింది. 2022 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో టీమ్ పర్సూట్‌లో కాంస్య పతక విజేత అయిన మీనాక్షి రేసు వ్యూహంతో ఇక్కడ బంగారు పతకాన్ని సాధించడం ద్వారా రోడ్ రేసింగ్‌లో కూడా తన సత్తా నిరూపించుకుంది. 23 ఏళ్ల ఆమె పూజా బిష్ణోయ్ కంటే మొదటి ల్యాప్‌లో 10 కిలోమీటర్లు వెనుకబడి ఉంది, కానీ ఆ తర్వాత వేగం పుంజుకుని 30 కిలోమీటర్ల వ్యక్తిగత టైమ్ ట్రయల్‌ను గంటకు సగటున 39.5 కి.మీ వేగంతో 00:45:31.907 సమయంతో పూర్తి చేసింది. ఇక 22 ఏళ్ల పూజా బిష్ణోయ్ మహిళల ఎలైట్ 30 కి.మీ వ్యక్తిగత టైమ్ ట్రయల్‌లో విజయం సాధించింది రజతాన్ని దక్కించుకుంది. మొదటి ల్యాప్‌ను 10 కి.మీ. ఆధిక్యంలో 46:52.003 సమయంతో రజతంతో ముగించింది.



## వన్డే ర్యాంకింగ్స్‌లో..

# రోహిత్ నం.1

### ఆల్‌రౌండర్లలో సికిందర్ టాప్

**న్యూఢిల్లీ:** వన్డే బ్యాట్స్‌మెన్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రోహిత్ తిరిగి నెంబర్ 1 స్థానాన్ని పొందాడు. 10వ స్థానంలో ఉన్న జింబాబ్వేకు చెందిన సికందర్ రజా తన కెరీర్‌లో తొలిసారిగా టీ20 ఆల్ రౌండర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని సాధించాడు. రోహిత్ శర్మ న్యూజిలాండ్‌కు చెందిన డారిల్ మిచెల్ నుండి తిరిగి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో చివరి రెండు మ్యాచ్‌లకు మిచెల్ దూరంగా ఉండాల్సి వచ్చింది. ఫలితంగా ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న రోహిత్ కంటే దిగువకు పడిపోయాడు. ఇక 39 ఏళ్ల సికిందర్ ఇటీవలి ప్రదర్శనలు స్థిరమైన ఫామ్‌ను హైలైట్ చేయడంతో తన 13 సంవత్సరాల అంతర్జాతీయ కెరీర్‌లో మొదటిసారిగా అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఆల్ రౌండరల్లో ఇప్పటి వరకూ నెంబర్ 1లో ఉన్న పాకిస్థాన్‌కు చెందిన సైమ్ అయూబ్ రజా దెబ్బకు రెండవ స్థానానికి పడిపోయాడు. కివీస్ జట్టు రచిన్ రవీంద్ర ఒక స్థానం ఎగబాకి 12వ స్థానానికి, డెవాన్ కాన్వే 11 స్థానాలు ఎగబాకి 31వ స్థానానికి చేరుకున్నారు. న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లోని రెండవ మ్యాచ్‌లో అజేయ సెంచరీ సాధించిన తర్వాత వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని ఎనిమిదో స్థానానికి చేరుకున్నాడు. బౌలర్ల జాబితాలో బ్లాక్ క్యాప్స్ తమ ర్యాంకింగ్స్‌ను మెరుగుపరుచుకుంటోంది, మిచెల్ సాంట్నర్ 6 వ, మాట్ హెన్రీ 10వ స్థానానికి చేరారు.

# చేజారిన రెండో టెస్టు

### టీమిండియా దారుణ ఓటమి

### క్లీన్‌స్వీప్ 2-0తో దక్షిణాఫ్రికా సిరీస్ కైవసం



**న్యూఢిల్లీ:** భారత్, సౌతాఫ్రికా మధ్య జరిగిన టెస్ట్ సిరీస్‌లో ఆతిథ్య టీమిండియాకు ఘోర పరాభవం ఎదురైంది. గౌహతిలో జరిగిన రెండో టెస్ట్ మ్యాచ్ ఐదో రోజు బుధవారం భారత్‌పై సౌతాఫ్రికా 408 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. దీనితో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను 2-0 తేడాతో గెలిచి సఫారీలు టీమిండియాను క్లీన్ స్వీప్ చేశారు. భారత టెస్టు క్రికెట్ చరిత్రలో ఇన్ని పరుగుల తేడాతో ఓడడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ప్రస్తుతం సౌతాఫ్రికా 36 పాయింట్లతో 2వ స్థానంలోకి వచ్చి విజయశాతం 75గా ఉంది. ఇక ఈ ఓటమితో భారత్ డబ్ల్యూటీసీలో ఐదో స్థానానికి పడిపోయింది. ఇక ఈ మ్యాచ్‌లో భారత బ్యాట్స్‌మెన్‌లకు సౌతాఫ్రికా స్పిన్నర్లు చుక్కలు చూపించారు. భారీ లక్ష్య ఛేదనలో టీమిండియా బ్యాటింగ్ లైనప్ దారుణంగా కుప్పకూలింది. సౌతాఫ్రికా మొదటి ఇన్నింగ్స్‌లో 489 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 260 రన్స్ చేసి డిక్లేర్ చేసింది. టీమిండియా మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 201 పరుగులకే ఆలౌట్ అయింది. ఇక 550 రన్స్ భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్, కేవలం 140 పరుగులకే ఆలౌట్ అయ్యి చిత్తు చిత్తు అయింది. మొదటి ఇన్నింగ్స్‌లో మార్కో జాన్సెన్ 6 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో స్పిన్నర్ సైమన్ హార్మర్ 6 వికెట్లు తీసి భారత ఓటమికి ప్రధాన కారణమయ్యారు. కెప్టెన్ రిషబ్ పంత్ రెండు ఇన్నింగ్స్‌లలోనూ విఫలమయ్యాడు. ఐదో రోజు తొలుతే టీమిండియా ధ్రువ్ జురెల్, పంత్ వికెట్లు కోల్పోయింది. సాయి సుదర్శన్ (14)కే అవుటయ్యాడు. ఓటమి ఖాయమైన సమయంలో ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 54 రన్స్‌తో హాఫ్ సెంచరీ చేసి ఒంటరి పోరాటం చేశాడు. అయినప్పటికీ రెండో ఇన్నింగ్స్ 140 రన్స్‌తో ముగియడంతో 408 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. సౌతాఫ్రికా బౌలర్ల నిలకడైన ప్రదర్శన, ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌లో వాళ్ళు చూపిన పట్టుదల, భారత్‌ను సిరీస్‌లో దారుణంగా దెబ్బతీసింది. ఈ మ్యాచ్‌లో భారత్ డ్రా చేసుకునే అవకాశం ఉన్నా, క్రీజులో నిలబడాల్సిన బ్యాట్స్‌మెన్స్ త్వరగా అవుట్ కావడంతో ఆ అవకాశం కూడా దక్కలేదు.

# భారీ లాభాల్లో ర్యాలీతీసిన సెన్సెక్స్, నిఫ్టీ




### ఫెడ్‌రిజర్వు సంకేతాలు, గ్లోబల్ సెంటిమెంట్‌ల బలం

### రూ.6 లక్షలకోట్ల టర్నోవర్ పెరిగిన బిఎస్ఇ

**ముంబయి, నవంబరు 26:** అంతర్జాతీయ సెంటిమెంట్ బలపడటం, ఫెడ్ రిజర్వు వడ్డీరేట్లుతగ్గిస్తుం దన్న సంకేతాలు రావడంతో రెండు రోజులపాటు నష్టాల్లో ఊగిసలాడిన స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ లాభాలతో ముగిసాయి. గతవారంలోనే ఫెడ్‌రిజర్వుఛైర్మన్‌జెరోమ్‌పావెల్ ఫండ్‌రేట్లు తగ్గించేందుకు అనుకూల మైన పరిస్థితులు అలుముకుంటున్నా యని సంకేతాలిచ్చారు. అదే అంతర్జా తీయంగా మార్కెట్లకు బలంగా సంకేతాలు పంపించింది. ద్రవ్యోల్బణం అదుపు లోకి రావడం, ఆర్బీఐ విధాననిర్ణయాలు కూడా మార్కెట్లకు దోహదం చేయడంతో ఒక్కసారిగా సెన్సెక్స్ 1000 పాయింట్లు దాటేసింది. సెన్సెక్స్ నమోదిత కంపెనీల విలువలు ఒక్కరోజే ఆరులక్షలకోట్లు పెరిగి 475 లక్షలకోట్ల రూపాయలకు చేరాయి. ముడిచమురుధరలు తగ్గడం, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు పెరగడంతో నిఫ్టీకూడా 26,200 ఎగువన స్థిరపడింది. బిఎస్ఇ సెన్సెక్స్ 1022.50 పాయింట్లు క్షీణించి 85,609.51 పాయింట్లకు ట్రేడింగ్ నిలిపి వేసింది. నిఫ్టీ కూడా 20,205.30 పాయింట్లవద్దస్థిరపడి 320.50 పాయింట్లు లాభపడింది. మూడు ట్రేడింగ్ సెషన్‌లలో సెన్సెక్స్ 1.22శాతం, నిఫ్టీ 1.17 శాతం క్షీణించాయి.మిడ్‌క్యాప్‌సూచీ 1.32శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 1.23శాతం ర్యాలీతీసాయి. విభాగసూచీల్లో నిఫ్టీ మెటల్ 2.06శాతం, నిఫ్టీ వినియోగరంగ ఉత్పత్తులసూచీ 1.75శాతం, నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ 1.72శాతం ర్యాలీతీసాయి. నిఫ్టీ ఎంఫ్ఎంసిజి సూచీ 0.71శాతం, పిఎస్‌యుబ్యాంకు సూచీ 0.77శాతం, నిఫ్టీ రియాల్టీసూచీ 1.12శాతం చొప్పున పెరిగాయి.

పదేళ్ల బెంచ్‌మార్క్ అమెరికా బాండ్లు 0.02శాతంపెరిగి 6.49శాంగా ఉన్నాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువలు కూడా 89.23వద్ద స్థిరపడ్డాయి. గతముగింపు 89.22కాగా బుధవారం 89.23వద్ద ముగిసింది. ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ డిసెంబరుఐదునాటి ట్రేడింగ్ 0.59 శాతం పెరిగి రూ.1,25,960వద్ద ముగిసింది. ఇక కమోడిటీ మార్కెట్‌లోబ్రెంట్ ముడిచమురు 23సెంట్లుక్షీణించి బ్యారెల్‌కు 61.57డాలర్లుగా ఉంది. యూరోపియన్‌షేర్లు బుధవారం ఫెడ్‌రేట్‌కట్ అంచనాలతో పటిష్టపడ్డాయి. ఆసియా మార్కెట్లుకూడా ఎగువన ముగిసాయి. ఆస్ట్రేలియాలో వినియోగదారుని ధరల సూచీ 3.8శాతం పెరిగింది. హౌసింగ్ రంగంలోనే ధరలు 5.9శాతానికిపైగా పెరిగినట్లు తేలింది. దీనితో స్టాక్‌మార్కెట్లుప్రభావితం అయ్యాయి. రాత్రికిరాత్రే అమెరికా డౌజోన్స్ పారిశ్రామిక సగటుసూచీ 664.18 పాయింట్లు పెరిగింది. ఎస్అండ్‌పి 500 సూచీ 0.91శాతం పెరిగితే నాస్‌డాక్ కాంపోజిట్ 0.67శాతం పెరిగి 23,025.59వద్ద స్థిరపడింది. ఇదిలాఉంటే విదేశీ ఇన్వెస్టర్లు ముందురోజు 785 కోట్ల విలువైన షేర్లు కొనుగోళ్లుచేయడం కూడా సూచీలకు కలిసొచ్చింది.



# రూ.25వేల కోట్లకు అదానీ ఎంటర్‌ప్రైజెస్ రైట్స్ ఇష్యూ

**న్యూఢిల్లీ, నవంబరు 26:** ఆదాని గ్రూప్‌లోని ఆదాని ఎంటర్‌ప్రైజెస్ రూ.1800 చొప్పున మొత్తం 24,930.30కోట్లకు రైట్స్ ఇష్యూజారీచేసింది. భారత్‌లోనే అతిపెద్ద రైట్స్ ఇష్యూగా పేర్కొంటున్న ఈ ఇష్యూ ఆమోదించే తేదీనాటికి 24శాతం డిస్కౌంట్ ఆఫర్ కూడా ఉంటుందని తెలుస్తోంది. 13.85 కోట్ల కొత్తషేర్లుజారీచేయడంద్వారా కూడా ఈ ఇష్యూ భారీ సైజుకు చేరింది. వచ్చేనెల 10వ తేదీ ఇష్యూ ముగుస్తుంది. ప్రస్తుతం ఉన్న 25 పూర్తి అధీకృత ఈక్విటీ షేర్లకు మూడు రిఐట్స్ ఈక్విటీ షేర్లు వర్తింపచేస్తారు. అర్హతపొందిన వాటాదారులకు ఈ ఆఫర్ ప్రారంభించారు. ప్రమోటర్లు కంపెనీలో సుమారు 74శాతం వాటాతోఉన్నారు. వారిఅర్హతకు అనుగుణంగా వారుసైతం కొనుగోళ్లు చేస్తారు. సంస్థ మార్కెట్‌విలువలు రూ.2 లక్షలకోట్లుగా ఉన్నట్లు ప్రకటిం చింది. ఆదాని ఎంటర్‌ప్రైజెస్ ఎయిర్‌పోర్టు బిజినెస్ భారత్‌లోనే అతిపెద్ద ఎయిర్‌పోర్టు నెట్‌వర్క్‌తో నడుస్తోంది. సుమారు 2.5 లక్షలకోట్లు టర్నోవర్‌తోఉంది. రానురాను మూడులక్షల కోట్లకు పెరుగుతుందన్న అంచనాలున్నాయి. భావితరం ఇన్‌ఫ్రా ప్రాజెక్టులపైనా ఎయిర్ పోర్టులు, డేటాసెంటర్లు, గ్రీన్‌హైడ్రోజెన్,రోడ్లు, పివిసి,రాగిశుద్ధి ఇతర మెటల్స్ మైనింగ్, డిజిటల్‌మీడియా వెంచర్స్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఈనిధులు వినియో గిస్తామని ప్రకటించింది. ఇన్వెస్టర్లు ఒక్కోఇష్యూకు 900 అంటే 50శాంముందు చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన మొత్తం రెండు వాయిదాల్లో చెల్లించుకునే సౌలభ్యంకూడా ఇచ్చింది.

# ఐదువేలమందికిపైగా ఎబిఎన్ ఆమ్రో ఉద్వాసన

**ఆమ్‌స్టర్‌డామ్,నవంబరు 26:** లేఆఫ్‌ల జాబితాలో మరో డచ్‌బ్యాంకు చేరింది. 2028 నాటికి డచ్‌బ్యాంక్‌ల్లో ప్రముఖ దిగ్గజంగా కొనసాగుతున్న ఎబిఎన్ ఆమ్రో 5200 మందిపూర్తికాలపు ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధం అయింది. కొత్తగా సిఇఒగా వచ్చిన మార్గరెట్టీ బెరార్డ్ వచ్చీరావడంతోనే బ్యాంకులో వ్యయప్రణాళికను కుదించాలని, వృధా స్థానాలను భర్తీచేసి ఉద్యోగులను కుదించడమే శ్రేయస్కరమని చెపుతున్నారు. బ్యాంకు పునర్వ్యస్థీకరణ వ్యూహంలోభాగంగానే ఒకేసారి ఐదు వేలమందికిపైగా ఉద్వాసన తప్పదని ఆయనచెపుతున్నారు. గత యేడాది చివరినాటికి ఎబిఎన్ ఆమ్రో సుమారు 22వేలమంది పూర్తికాలం పనిచేసే సిబ్బంది, 3670మంది ఎక్స్‌టర్నల్ కాంట్రాక్టర్లతో కొనసాగింది. సిఇఒగా బెరార్డ్ వచ్చీరావడంతోనే వెయ్యిమందికిపైగా ఉద్వాసన చెప్పారు. ఇపుడు మూలధనవ్యయం మరింతగా ఆదాచేయాలంటే ఆమెముందుగా ఉద్యోగులను కుదించుకోవాలన్న అభిప్రాయంతో ఉన్నారు. అందువల్లనే 5200 మందికిపైగా ఉద్వాసన చెపుతున్నట్లు అంచనా. ఈక్విటీ రిటర్నులను వచ్చే మూడేళ్లలో 12శాతంపెంచుకోవాలని, ఆదాయ వ్యయాల నిష్పత్తి 55శాతానికి దిగువనఉండే లక్ష్యంతోఉంది. ఎన్ఐబిసిబ్యాంకును బ్లాక్ స్టోన్ ఇంక్‌నుంచి 1.1 బిలియన్ డాలర్లకు కొనుగోలుచేసింది. దీనితో ఈ బ్యాంకు రిటర్నులు 2029 నాటికి 18శాతం సాధించగలదన్న ధీమాతో ఉంది. డిజిటైజేషన్, సరళీకరణ, నిర్మాణక్రమాన్ని మరింత కుదించుకుని ఆధునిక టెక్ వ్యూహాలతోముందుకు పోగలమని సిఇఒ చెపుతోంది. బిఎన్‌పి పరిభాస్‌కు హెడ్‌గా పనిచేసిన బెరార్డ్ బ్యాంకింగ్ వ్యవస్థలపై మంచి పట్టుతోఉన్నారు. డచ్ బ్యాంకులో ప్రభుత్వ వాటా కూడా కుదించుకుంటున్నది. 30.5శాతంనుంచి 20శాతానికి కుదించుకుంటున్నది.

## రూ.15 లక్షలకోట్లకు పెరగనున్న

# పసిడి తాకట్టురుణ రంగం!




**న్యూఢిల్లీ, నవంబరు 26:** భారత్‌లో బంగారు రుణాల రంగం రానురాను భారీ విస్తరణదశలోకి పోతోంది. నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు కూడా బంగారంపై రుణాలు విరివిగా ఇస్తున్నాయి. వచ్చే 12నెలల్లోనే మూడువేలకు పైగా కొత్తశాఖలు ప్రారంభిం చేందుకు సిద్ధం అవుతున్నాయి. రుణాలు తీసుకునేందుకు ఇదే సులువైన మార్గం కావడంతో కష్టమర్లు కూడా బంగారు తనఖా రుణాలపై ఎక్కువ ఆసక్తిచూపిస్తున్నారు. గోల్డ్‌లోన్ మార్కెట్ వార్షిక పద్ధతిలో 36శాతం పెరిగి రూ.14.5 లక్షల కోట్లకు ప్రస్తుతం ఉంది. 2026లో మరింత విస్తరించి మరింత వృద్ధిలోకి వస్తుందని భావిస్తున్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు అత్యధికంగా బంగారం రుణాలిస్తున్నాయి.

ప్రభుత్వరంగ బ్యాంకుల్లో 27శాతం రుణాలిస్తు న్నాయి. ప్రైవేటుబ్యాంకులు కేవలం22శాతం వాటాతోనే ఉన్నాయి. ఎన్‌బిఎఫ్‌సిలు కూడా ఇపుడు ప్రత్యేక గోల్డ్‌లోన్‌శాఖలను ప్రారంభిస్తున్నాయి. రైతులు, ట్రేడర్లు,వ్యక్తిగత అవసరాల కోసం కూడా తక్షణ లిక్విడిటీకోసం బంగారంరుణాలనే ఆశ్రయిస్తు న్నారు. ముత్తూట్‌ఫైనాన్స్ ఎండి జార్జి అలెగ్జాండర్ మూత్తూట్ మాట్లాడుతూ గోల్డ్‌లోన్ల డిమాండ్ రానురానున పెరుగుతోందని, గతంలో ఎన్నడూ లేని విధంగా వృద్ధిలోకి వచ్చిందని అన్నారు. సూక్ష్మరుణాలను పొందలేని వారు ఇపుడు బంగారం తనఖారుణాల వైపు మళ్లుతున్నట్లు తేలింది. బంగారం రేట్లు పెరగడంతో గ్రాము బంగారం విలువలు కూడా భారీగా పెరిగాయి. దీనితో రుణం ఇచ్చే విలువలు కూడాపెరిగాయి. రేటింగ్ ఏజెన్సీ ఇక్రా బంగారం మార్కెట్ రూ.15 లక్షలకోట్లకు చేరుతుందని అంచనా వేసారు. ముత్తూట్‌ఫైనాన్స్, ఐఐఎఫ్‌ఎల్, బజాజ్‌ఫైనాన్స్ 1800 శాఖలు ప్రారంభించాయి. బజాజ్ ఫైనాన్స్ ఒక్కటే 900 గోల్డ్‌లోన్ శాఖలు తెరిచింది. ఐఐఎఫ్‌ఎల్ వచ్చే ఏడాది 500శాతఖలు, ఎల్అండ్‌టి ఫైనాన్స్ 200 శాఖలు తెరుస్తున్నాయి. పూనావాల్లా ఫిన్‌కార్ప్ 2026 మార్చినాటికి 400శాఖలు ప్రారంభించేందుకు సన్నాహాలుచేస్తోంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.